# అసుర సంధ్య

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

(గతసంచిక తరువాయి)

"ఏమో! ఆడవాళ్ల సంగతి ఆడవాళ్లకే అర్థంకావాలి! నాకు మాత్రం ఏమిటీ గొడవంతా అనిపిస్తుంది! మన తాత ముత్తాతలు, పూర్వీలు యిలానే అర్థాలు అన్వేషిస్తూ సంసారాలు చేశారా?.."

"వాళ్ళ యింత అమాయకంగా చేతగాకుండా ఎప్పుడూ లేదు! ప్రేమ, వ్యక్తిత్వం, అంటూ కళ్లకు నినాదాల్తో గంతలు కట్టుకుని సుఖాన్ని అన్వేషించలేదు. కోపంవస్తే భార్యని గట్టిగా మందలించేవాళ్ల లేకపోతే కొట్టేవాళ్ల... నిరాశతో 'అర్థం కాలేదు'...'అర్థంకాలేదు' అంటూ తలపట్టుకుని కూర్చోలేదు." చంద్రావతి తలపట్టుకుని కూర్చోవటం చూస్తే శ్రీధర్‌కు నవ్వాగలేదు.

"నువ్వటు పూర్వుడివీ కావు, యిటు నవ్యుడివీ కావు. జీవితం మీద పట్టువదిలావు. మళ్లీ దాన్ని ఏవిధంగా స్వాధీనం చేసుకోవాలో నేర్చుకోవటానికి బద్ధకిస్తున్నావు..."

చంద్రావతి అభినయంతో సహా చెబుతూ ఆమె ఊహాల్తోపాటు బంగారు తీవెలా చలిస్తూ ప్రకాశిస్తోంది. అందులో బాల్యం తాలూకు ముగ్ధత్వమూ, చిలిపితనమూ, స్త్రీత్వపు మార్దవమూ ఆకర్షణా, యౌవనపు విలాసమూ పొంగూ, కాంతి రేకలుగా రూపు కట్టుతున్నాయి. శ్రీధర్ మంత్రముగ్ధుడిలా వింటున్నాడు.

"సరే, తారసంగతి అలావుంచి నీ సంగతి కనుక్కుందాం. ఆదర్శాలతో నమ్మకం వుండే నవ్యుడివి, మరి నువ్వెందుకు ప్రేమించి పెళ్లిచేసుకోలేదు? నీ ఊహలకు అనుగుణంగా వుండే అమ్మాయికోసం ఎందుకని స్వయంగా వెదుక్కోలేదు?" అని ప్రశ్నించింది చంద్రావతి.

"నేను అప్పుడు ప్రేమను గూర్చి ఎక్కువ ఆలోచించలేదు. అదీగాక తారను చూడగానే యిష పడ్డాను, తప్పక చేసుకోవాలనిపించింది... ఇక ప్రేమిస్తే మాత్రం అంతే కద!"

"మనం శాస్త్రీయంగా ఎనలైజ్ చేసి తర్కిస్తున్నాం కాబట్టి నేను కొన్ని ప్రశ్నలువేసినా ఏమీ అనుకోగూడదు.. మగవాళ్లకుండే చాంచల్యం నీకెప్పుడూ కలగలేదా?"

శ్రీధర్ తోటలోకి, దూరంగా చెట్లవైపు ఆకాశంవైపు చూశాడు. ఆమె ప్రశ్నకు జవాబు చెప్పాలని లేదు అతనికి.. ఎవ రీ చంద్రావతి? ఏమిటి తనకూ ఈమెకూ సంబంధం?.. ఇంతసేపూ లేని ఒక సంకోచం, అవరోధం అతనిలో మొలకెత్తింది.

"ఈ ప్రశ్నల వల్ల లాభమేమిటి? ఇలా పొరలు పొరలుగా వూడదీస్తే మనిషిలో మిగిలే దేమి వుంటుంది? ఇక ఈ ప్రశ్నలూ జవాబులూ చాలించి మరేమైనా మాట్లాడుకుందాం" అన్నాడు శ్రీధర్ కొంతవిసుగ్గా.

చంద్రావతి అతణ్ణి తదేకంగా గమనిస్తోంది: "అలాగే. నే నడిగింది ఆఖరుప్రశ్న— యిక ప్రశ్నలు లేవు!" అన్నది చిరునవ్వుతో సమాధానంకోసం బలవంతం చేస్తున్నట్లుగా.

శ్రీధర్ మౌనం వహించాడు.

"మనిషి ఆంతర్యానికీ, సంఘంలో ప్రకటితమయ్యే అతని వ్యక్తిత్వానికీ మధ్య ఏ తెరా వుండకూడదనీ, రెండూ ఒకటి కావాలనీ ఆరోజు వాదించావే జ్ఞాపకం వుందా? నీకీ విషయమై మాట్లాడటం యిష్టంలేదని యిప్పుడు తెలుస్తోంది కదా! సహజమే!.. పోనీ ఆప్రశ్నను యింకోదృష్టితో అడుగుతాను— మాతృత్వంతో స్త్రీ మనస్తత్వంలో ఎంతో మార్పువస్తుంది. పితృత్వంతో పురుషుని మనస్తత్వంలో ఏం మార్పు వస్తుంది? అది సవ్యమైనదా, అపసవ్యమైనదా? దానివల్ల దాంపత్యం ఎలా మారుతుంది? నీ అనుభవ మేమిటి?"

"ప్రత్యేకంగా చెప్పదగిన మార్పేమీ లేదనుకుంటాను నా మనస్తత్వంలో."

"కొందరికి పితృత్వమనేది సహజపరిణామం కాదనిపిస్తుంది శ్రీధర్! మావారు నాకు పెళ్లవక పూర్వమే బాగా తెలుసు. ఇద్దరి కుటుంబాలకీ పూర్వమైత్రి వుంది. వివాహమైన మూడేళ్లకి బాబు పుట్టాడు. వాడు పుట్టిన తర్వాత మావారు మారిపోయారు. ఆయనకు సంసారంలో ఆసక్తి కంటె ఉద్యోగ వ్యవహారాల్లో ఆసక్తి బాగా ఎక్కువైపోయింది. మా బాబుని పదినెలల పసివానిగా మా అమ్మ దగ్గర వదిలి పెట్టి చూశాను. కాని నాజీవితం పూర్వంలా లేదు. రానురాను సోమరితనమూ, ఒంటరి తనమే ఎక్కువైపోతున్నాయి. అందుకే బి. టి. చదివి ఒక వ్యాసంగం ఏర్పాటు చేసుకుందామనుకున్నాను... పట్టు వదలిన జీవితాన్ని స్వాధీనం చేసుకోవటానికే యీ ప్రయత్నం.." చంద్రావతి లేచి వెళ్లిపోయింది. శ్రీధర్ ఆమె కన్నీళ్ల పర్యంతం కావటం గమనించాడు.

అయిదు నిముషాల తర్వాత చంద్రావతి తిరిగి వచ్చి "శ్రీధర్, నాకు వంటింట్లో కొంచెం పనివుంది.. ఇప్పటికే ఆలస్యం అయింది. క్షమిస్తావు కదూ.. రేపు కలుసుకుందాం.." అన్నది.

"అలాగే" అని శ్రీధర్ మేడదిగి వచ్చేశాడు.

డబ్బు వుండటమూ, పెద్దగా బాధ్యతలు లేకపోవటమూ అనే పరిస్థితిలో కూడా జీవితం సమస్యల్ని సృష్టిస్తూనే వుంటుంది అన్నసంగతి శ్రీధర్‌కు క్రొత్తగా తెలిసి వచ్చింది. చంద్రావతిని తనవదినె రుక్మిణమ్మతో పోల్చి ఆలోచించాడు. ఎప్పుడూ యింటి బరువు భాధ్యతల్ని మోస్తూ క్షణం తీరికలేని రుక్మిణమ్మ జీవితంలో శూన్యభావం, నిస్పృహ అంటే ఏమో ఎరుగదు. మధ్యతరగతి కుటుంబాలలోని వ్యక్తులకు— స్త్రీలకుగాని పురుషులకుగాని— జీవితం 'పట్టువదలటం' అంటూ ఎక్కడవుంది? జీవితం వాళ్లని క్షణం ఊపిరి పీల్చుకోనివ్వకుండా రంగులరాట్నంలా గిరగిరా త్రిప్పివేస్తూ వుండటమే కారణం.. చంద్రావతి వంటి వాళ్లు ఏమీ తోచకపోతే, సంఘసేవో రాచకీయాలో ఏదో ఒక వ్యాపకం తప్పకుండా కల్పించుకోవాల్సి వస్తుంది! కాని అందరికీ ఆ కలాపాల్లో అభిరుచీ మెలకువా వుండవద్దా? చంద్రావతి బి. టి. చదవటానికి నిర్ణయించుకోవటం బాగానేవుంది. అంతకంటె ఆమె తనకొడుకుని దగ్గరేవుంచుకుని వాణ్ణి పెంచేభారం వహిస్తేనే ఆమె మనస్సులోని అశాంతి తగ్గుతుందేమో అని తోచింది శ్రీధర్‌కు.

చంద్రావతి భర్తలో పితృత్వం ఒక సహజపరిణామంగా భాసించక పోవటమేమిటో శ్రీధర్‌కు అర్థంకాలేదు. డబ్బావ్యవహారాల మీద మనస్సుని లగ్నం చేసేవాళ్ల ప్రవృత్తి అలానే వుంటుంది కాబోలు! ఇదంతా చూస్తే ఆపేక్షలూ, అనుబంధాలూ మధ్యతరగతి కుటుంబాల్లోనే ఎక్కువ ప్రాముఖ్యం వహిస్తున్నట్లూ, పై తరగతివాళ్ల జీవితాల్లో అలా జరగటం లేదనీ, హృదయగతమైన అనుభూతికంటె వాళ్లు నాగరికతకూ, సుఖలాలసతకూ ఎక్కువ ప్రాధాన్యం యిస్తున్నట్లూ తోచింది శ్రీధర్‌కు..ఈ విషయమై చంద్రావతితో ఈసారి విపులంగా చర్చించాలి అనుకున్నాడు.

మరుసటి రోజు సాయంత్రం హాస్టలులో ఏదో మీటింగు వుండటంతో శ్రీధర్ చంద్రావతి యింటికి వెళ్లలేదు. రెండు రోజుల తర్వాత మామూలు వేళకు వెళ్లాడు. శ్రీధర్ వరండాలో నిల్చుంటే తోటమాలి లోపలికి వెళ్లాడు. అతిథులతో యిల్లు సందడిగా వున్నట్లు కన్పించింది. లోపల హాల్లోనుంచీ మగవాళ్ల ఆడవాళ్ల కంఠాలు వినిపిస్తున్నాయి. ఇద్దరు పిల్లలు తోటలో ఆడుకొంటున్నారు.

చంద్రావతి వరండాలోకి వచ్చింది. "శ్రీధర్ క్షమించాలి, చాలా బిజీగా వున్నాను.. బంధువులు వచ్చారు.. ఆదివారం మనం ఏదైనా మేటినీకి వెళ్దాం, ఏం?" అన్నది.

శ్రీధర్ తిరిగి వచ్చేస్తుంటే తోటమాలి అతనితో గేటు దాకా వచ్చాడు.

"మీరు కాలేజిలో సదువుతారా బాబూ? ఏవూరు?"

"అవును.. మదనపల్లి"

తోటమాలి గేటు మూశాడు మెల్లగా.. శ్రీధర్ పానగల్ పార్కువైపు నడిచాడు. అతని మనస్సుకేమిటో కొరతగా వుంది. బంధువులు వచ్చారు, చంద్రావతికి మాట్లాడటానికి తీరికలేదు. సరే! లోపలికి ఆహ్వానించి బంధువులికి తనని సహాధ్యాయిగా ఆమె పరిచయం చెయ్యగూడదా?.. అయితే వాళ్లకి తనమీదగాని, తనకు వాళ్లమీదగాని ఆసక్తి ఎందుకుంటుందీ? అందువల్ల ఆమె చేసిందీ సమంజసమే!.. తనకూ ఆమెకూ మధ్యనున్నది కేవలం స్నేహబంధమే కద!

అది మామూలు స్నేహబంధం కాదే !

శ్రీధర్ హృదయంలో ఒకక్రొత్త బాధ మెదిలింది. స్నేహానికీ బంధుత్వానికీ మధ్య గల దూరాన్ని గూర్చిన అసంతృప్తి, వ్యక్తికీ వ్యవస్థకూ మధ్యగల భేదాన్ని గుర్తించిన అసూయ.. చంద్రావతి తనకు ప్రియ బాంధవి, ఆరాధ్యదేవత, తనవలెనే బాధాతప్త హృదయం ఆమెదీ; ఆమెను గూర్చి యీ బంధువులకేం తెలుసు? కాని సంఘందృష్టిలో ఆమె మీద తనకు ఏహక్కూ లేదు! ఈ బంధం సంఘానికీ వ్యవస్థకూ అర్థంకాదు!.. అర్థం కాకపోవటం వల్లనేనా యిది మధురాతి మధురమైన అనుబంధం?

ఆదివారం కోసం ఎదురు చూశాడు శ్రీధర్.

ఆ రోజు 'ఫాంటాసియా' అనే పిక్చరుకి వెళ్లారు. నాదానికీ, సంగీతంలో స్వరాలకూ వర్ణరేఖలతో చేసిన ఊహాత్మక రూపకల్పన మొదటిభాగం. తర్వాత సృష్ట్యాదిని సూర్యమండల, భూమి, చంద్రుడు మొదలైన గ్రహాలు ఏర్పడటం చిత్రించిన మనోహరమైన వర్ణదృశ్యకల్పన రెండవభాగం. మానవుడి ఆగమనానికి పూర్వం భూమిమీద వుండిన జంతుకోటి చరిత్ర మూడవభాగం.

టాక్సీలో తిరిగి వస్తూండగా శ్రీధర్ ఆ ఊహా సౌందర్య లోకపు ప్రభావం నుంచి యింకా తేరుకోలేదు. అతనిప్రక్కన కుడివైపున చంద్రావతి నెమిలికంఠంరంగు పట్టుచీరతో శరత్కాలపు ఆకాశంలో చంద్రునిలా మనోజ్ఞంగావుంది. ఎడమవైపు పరుగిడుతున్న మద్రాసునగరం....

"శ్రీధర్, నిన్న నా రిస్టువాచీ రిపేర్ చేయించాను. మధ్యమధ్య ఆగిపోతూన్నట్లు అనుమానంగావుంది, చూడు వర్కుచేస్తోం దేమో!"

చంద్రావతి వాచీవున్న ఎడమచేతిని శ్రీధర్ భుజాల మీదుగా పోనిచ్చి అతని ఎడమ చెవిమీద మణికట్టుని అన్చింది. శ్రీధర్ వాచీశబ్దం వినటానికి ప్రయత్నించాడు. ఆమె బాహుబంధం నాగపాశంలా తనను చుట్టి చుట్టనట్లువుండి ఆమె స్పర్శ కలిగిస్తున్న ఉద్వేగంలో అతనికి వాచీశబ్దం వినిపించనే లేదు.

"ఏమిటి, శబ్దం లేదు కదూ?" అన్నది చంద్రావతి.

"ఏమో ట్రాఫిక్ రొద ఎక్కువగా వుంది"

శ్రీధర్ ఆమె మణికట్టు పట్టుకొని చెవికి దగ్గరగా అదుముకొన్నాడు. ప్రస్తుతాన్ని విస్మరించి నిశ్శబ్దంలో కాలం చేసే లయబద్ధమైన సవ్వడికోసం కేంద్రీకరించిన మనస్సుతో యోగిలా అన్వేషించాడు.. శబ్దం వినిపించింది.

"వర్కు చేస్తోంది."

ఆమె చేతిని తనమీదనుంచి తొలగిస్తూ కొంతదూరంగా జరిగి కూర్చున్నాడు. తర్వాత కుడిచేత్తో ఆమె మణికట్టు పట్టుకుని వాచీవైపు చూచి "టైము సరిగానే వుంది" అన్నాడు.

"ఈ వాచీలోవున్న గమ్మత్తు అదే! సరిగానే నడుస్తున్నట్లుంటుంది, ఎప్పుడు విర్చిపోతుందో ఎప్పుడు మోసం చేస్తుందో తెలీదు."

"పోనీ క్రొత్తది కొనరాదా?"

"పాత వస్తువులతో బంధం త్రెంచుకోవటం అంత సులువు కాదు శ్రీధర్! కాని త్రెంచుకోవలసే వస్తుంది ఒక్కొక్కసారి విధిలేక!.. అవును కదూ?.. క్రొత్తదే కొంటాను!" చంద్రావతి అతని కళ్లల్లోకి చూచి నవ్వింది ఆత్మీయంగా.

శ్రీధర్ బయటికి చూస్తూ వుండిపోయాడు.

యథాప్రకారం టీ తీసుకుంటూ మేడమీద కూర్చున్నారు.

"మీ వారిని నాకు పరిచయం చెయ్యవా?" అన్నాడు శ్రీధర్.

"ఎప్పుడు చేసేది? యివాళ ఆయన బొంబాయిలో వున్నారు.. ఆయన ఎంగేజ్‌మెంట్సు, ఎంజాయ్‌మెంట్సు, ఆ లోకమే వేరు!.. నాకు ఆలోకంతో సంబంధం లేదు!"

"బి. టి. చదవటం కంటె ఏద్దైనా సాంఘికసేవ, అంటే శరణాలయం వగైరాలాంటి కార్యకలాపాల్లో ప్రవేశించి నీ లోకం నువ్వు ఏర్పాటు చేసుకోకూడదా?"

"సంఘసేవ చేసే సీతాకోకచిలుక లంటే నాకు మంట, అసహ్యం! అందులో చిత్తశుద్ధీ నిస్స్వార్థం ఏకోశాన లేవే! అదంతా ఒక భేషజం, నటన. ఒక విధమైన చుప్పనాతితనం. నీకు తెలీదు శ్రీధర్, వీళ్లు డబ్బుకోసం, అధికారంకోసం, పరాయి మగవాళ్లకోసం ఎలా తాపత్రయ పడతారో!.. ఛీ! ఛీ!! అందుకే నాకు మా సొసైటీలో ఆడవాళ్లు స్నేహితు లెవ్వరూ లేరు. అందుకే నేను బి. టి. లో చేరి ఉద్యోగం చెయ్యాలని నిశ్చయించుకోవటం. అలాచేస్తే మనం చేసే పనేమిటో శుభ్రంగా తెలిసినట్టుగా వుంటుందని.. జీవితంమీద నేను పోగొట్టుకొన్న అధికారమూ, ఆత్మసంతృప్తి లభిస్తే చాలు.. ప్రస్తుతం సంఘసేవ అంటే ఎక్కడ చూచినా గాంధీగారి పేరే కద!.. అందుకే గాంధీ మతప్రచారం మీద నాకు విరక్తి.. నాకు వ్యక్తిగా బ్రతకటంలోని హాయి కావాలి.. ప్రచారమూ యీ యాకుళ్లూ అక్కరలేదు!"

కోపం, అసహ్యం, తీవ్రమైన ఉద్రేకం చంద్రావతి యిదివరకెప్పుడూ అతని ముందు యిలా ప్రకటించలేదు. శ్రీధర్ కుతూహలంగా ఎన్నో ప్రశ్నలు వేశాడు స్త్రీల సాంఘిక కలాపాల్ని గూర్చి, చంద్రావతికి తెలిసినవాళ్లని గూర్చి. చంద్రావతి చెప్పిన సంగతుల్ని బట్టి అతనికి సంఘంలోని పై తరగతి వాళ్ల జీవితం కేవలం మేడిపండులా కనిపించింది.

## 11

దసరా సెలవుల్లో శ్రీధర్ బందరువెళ్లాడు. కృష్ణకు క్రొత్తనీళ్లు వచ్చి, నది నిండుగావుంది. ఈ మూడునెలల్లో తారకూడా వళ్లుచేసి క్రొత్తగా కన్పించింది. ఆమె మాటల్లో వాడితనం అక్కడక్కడా చురుక్కుమంటూనే వున్నా శ్రీధర్‌కు పూర్వంవలె బాధ కలుగలేదు. చంద్రావతితో స్నేహం ప్రారంభమయ్యాక అతనికి స్త్రీలు ఒకక్రొత్త దృక్పథంనుంచి అర్థం అవుతున్నారు. వివాహితలు, పిల్లలతల్లులు ఎదురైనప్పుడు వారి వైవాహిక జీవితాలు సుఖప్రదంగా వున్నాయా లేవా అనే కుతూహలంతో వాళ్ల ముఖకవళికల్ని హావభావాల్ని అన్వేషించటం పరిపాటైంది శ్రీధర్‌కు. ఇలా గమనిస్తూవుంటే చాలమందిలో అతనికి అసంతృప్తి మాత్రమే కనిపిస్తోంది. వివాహబంధాన్ని కాదంటూ సంఘాన్ని విమర్శించే తిరుగుబాటూ తీవ్రభావాలూ వాళ్లలో కనిపించకపోయినా, మొత్తంమీద ఎవరి మటుకు వాళ్లకు పరిస్థితుల్లో ఏదో ఒక కొరత, ఏదో ఒక లోపం వుంటూవున్నట్లే అతని పరిశీలన దృఢపరుస్తోంది.

రైల్లో ఏద్దైనా కుటుంబం ఎదురైతే, వాళ్లు మాట్లాడుకునే దాన్నిబట్టే, వాళ్లలోవాళ్లు పరస్పరం వ్యక్తం చేసుకునే ప్రేమాదరాల తీరునుబట్టీ శ్రీధర్‌కు సులభంగా సమస్య ఏమిటో తెలిసినట్లైపోతుంది. ఒక ఆమెకు నగలమీద ప్రీతి, కాని భర్త సంపాదన అందుకు చాలటంలేదు. ఇంకొక స్త్రీకి విరామం లేకుండా పిల్లలు కలగటంతో పిల్లల మీదా భర్తమీదా కూడా విసుగూ, చిరాకూ. మరొక చదువుకున్న యువతికి వివాహం కావటంతో ఉద్యోగం చేసే అవకాశం లేకపోయిందన్న అసంతృప్తి. సమష్టి కుటుంబాల్లో మరదులు, ఆడబిడ్డలూ, అత్తమామలూ జోక్యంవల్ల కలిగే ఘర్షణ ప్రభావం కొందరిలో కనిపిస్తూ వుంటుంది. ఒక్కొక్కరిలో సంతానం కలగక పోవటమే పెద్ద అసంతృప్తిగా వుంటుంది. పై చెప్పిన కారణాలవంటివేమీ లేకపోయినా చంద్రావతి కూడా అశాంతిలో బాధపడుతూనే వుంది! తనకూ తారకూ మధ్య సమస్యేవిటో ఎంత తరచినా అతనికి అంతుపట్టటమే లేదు!.. పోతే సుఖపడుతున్న వాళ్లెవరు?

జీవితంలో ఏ ఆదర్శం ఎన్నికచేస్తే బాగుంటుంది, సంఘ సంస్కరణకు దోహదమిస్తే మంచిది అనేధోరణిలో శ్రీధర్ యిప్పుడు ఆలోచించటం లేదు. జీవితం కథంతా వివాహమైన తర్వాతే ప్రారంభమౌతుంది; సంఘజీవనంలో ముఖ్యమైన భాగం వివాహితులకే చెందిందనే అభిప్రాయానికి వస్తున్నాడతను. అందులో నిలకడా, సంతృప్తీ సాధించడ మెలాగ ? కవిత్వమూ కథలూ, చదువూ సినిమాలూ అవివాహితుల మనస్తత్వాన్ని, వాళ్ల ఆదర్శాల్ని 'ప్రేమ' లాంటి సమస్యల్ని చాటి చెప్పినంతగా వివాహితుడైన వ్యక్తి ఆంతరంగిక జీవితాన్ని గూర్చి చెప్పవలసిన యదార్థం చెప్పటంలేదే, ఎందుచేత?···అనిపిస్తోంది అతనికి... వివాహితులైన వాళ్లని గూర్చి కథలూ పుస్తకాలూ లేకకాదు, ఎన్నో వున్నాయికాని శ్రీధర్‌దృష్టిలో అతనికి కావలసిన విషయాన్ని గూర్చి చర్చించిన సాహిత్యమే కనిపించటం లేదు.. పూర్వగ్రంథాల్లో 'సంసారం మహాసాగరం' అంటూ భక్తిమార్గాన్నీ వేదాంతాన్నీ ఉద్బోధించటమైతే వుందిగాని, సాగరం ఎలా ఈదాలో, యిప్పటి పరిస్థితుల కన్వయింపదగిన పరమార్థమేదో అదిమాత్రం అతనికి లభించటంలేదు! నవ్యసాహిత్యంలో సంఘానికీ వ్యక్తికీ సంఘర్షణ రెండురకాలుగా—'సెక్స్' లేక 'ఆర్థిక' సమస్యగా—రూపొందింది. లేచిపోయిన ఆడవాళ్లూ, భగ్నప్రేమికులైన మగవాళ్లూ, సంఘ దురన్యాయానికి బలైపోయిన పేదవాళ్లూ, సంఘసంస్కరణ కోసం అష్టకష్టాలూపడ్డ యువకులూ, రాజకీయవాదులూ చిత్రింపబడ్డారుకాని సాంఘిక వ్యవస్థని ఆమోదించి లోబడి

దానితో ఘర్షణ పడకుండా జీవించటానికి ప్రయత్నించే వ్యక్తే వుంటే అతను ఎందుకు సుఖ సంతోషాలకి నోచుకోక అసంతృప్తి పాలౌతాడో, 'దురదృష్టం' అంటే ఏమిటో వివరించి చెప్పే కథగాని, నవలగాని శ్రీధర్‌కు కనిపించలేదు.

నిజానికి వ్యవస్థతో రాజీపడి బ్రతకదలచుకునేవాళ్లే లోకంలో అధికసంఖ్యాకులు. అయితే వాళ్లలో చాలమందికి మన శ్శాంతి లేకపోవటానికి కారణ మేమిటి? డబ్బు లేకపోవటం, చాలకపోవటం అనే కారణం ఎక్కడపడితే అక్కడ ఎదురవుతున్నా అసంతృప్తికి దానికంటె మూలకారణం వుందనే శ్రీధర్ అభిప్రాయం. ఏమంటే చంద్రావతి విషయంలో డబ్బుకి లోటు లేదు, సంఘంతో సంఘర్షణేమీ లేదు, సంతానాన్ని గూర్చిన కొరత లేదు. భర్త వైఖరి సంపాదనవైపు మళ్లినా ఆమెకు భర్త మీద గౌరవానురాగాలున్నాయనటంలో సందేహమూ లేదు. అయినా ఆమెలో నిర్వేదం వుంది! ఏమిటీ నిర్వేదం? 'జీవితం మీద పట్టు తప్పిపోయింది' అంటుం దామె. ఆ వాక్యానికి అర్థమే స్ఫురించటం లేదు ఇదమిత్థమని. అయితే అలాటిదేదో తనకూ అనుభవమే ఒకవిధంగా. జీవితం తనకూ స్వాధీనంలో లేదు. ఎప్పుడేం జరుగుతుందో! ఒకసారి బాగానే వున్నట్లుంటుంది, ఒకసారి అంతా తలక్రిందు లైనట్లు వుంటుంది, మరి యీ అనిశ్చిత పరిస్థితికి అంతమెప్పుడు? ఇలా బహుశా యిద్దరిసమస్యా ఒక్కటేనేమో!

అనుకోకుండానే సెలవులు సంతోషంగా సుఖప్రదంగా గడిచిపోవటం శ్రీధర్‌కు ఆశ్చర్యం కలిగించింది! మామగారు బాగా ఆదరించారు. ఎక్కడా బాధ కలిగేమాటగాని సూచనగాని రాలేదు. మరి యిదంతా తను అనుకోకుండానే ఇలా సవ్యంగా జరగటం ఎందువల్ల?

సెలవుల్లో విశ్వనాథవారి "వేయిపడగలు" నవల చదివాడు శ్రీధర్. ఒకవ్యవస్థ, దానినంటి పెట్టుకున్న ఒకతరహా జీవనమూ నాగరకతా, దాని విలువలూ ఎలా మారుతూవచ్చాయో ఆవేదనతో చిత్రింపబడిన ఆ నవలలో కూడా శ్రీధర్ ప్రశ్నకు సమాధానం లభించలేదు. వ్యక్తి జీవితంలో అసంతృప్తి పాతసాంఘిక ఆధ్యాత్మిక వ్యవస్థ పతనం కావటంవల్ల ఏర్పడిందా? అయితే ఆ వ్యవస్థ స్వరూపం మారి, వేయిపడగలూ ఒక్కొక్కటి విరిగి పడటానికి కారణం. కేవలం విదేశీయుల పరిపాలన, పాశ్చాత్య నాగరకతా ప్రభావం, ఆర్థిక వ్యవస్థలో మార్పు అన్న సమాధానం అదీ సంతృప్తికరంగా లేదు శ్రీధర్‌కు! భారతీయమైన హైందవమైన ఆ వ్యవస్థే గొప్పదైతే, దానికంటే గొప్పదికానిదానిముందు అది పతనం కావటం ఎందుకో! కాలప్రభావమా? అంటే దాని కర్థమేమిటి?.. అందువల్ల శ్రీధర్‌కు ఆ నవల వ్యక్తంచేసిన చారిత్రక చలన దృశ్యం హృదయంలో ఒక ఆవేదననూ విచారాన్నీ కలిగించిందేకాని, అతనిలో రేకెత్తిన ప్రశ్నమాత్రం సరియైన సమాధానం స్ఫురింప జేయలేదు.

సెలవుల్నించి మద్రాసు తిరిగి వచ్చిన తర్వాత ఒకనాడు చంద్రావతితో "వేయిపడగలు" నవలను గూర్చి ప్రస్తావించాడు శ్రీధర్.

"ఒక మహావ్యక్తి మరణిస్తాడు.. అతన్ని గూర్చి స్మరించటమూ, అంజలి ఘటించడమూ సహజమే.. కాని అదే ధ్యాసలో నిరంతరమూ ఉండటం మనజీవితాన్ని, విధ్యుక్తధర్మాన్ని మనం నిర్లక్ష్యం చెయ్యడమే అవుతుంది.. అలానే ఒక వ్యవస్థ మారింది.. ఏడ్చి లాభమేమిటి? నా కా నవల రుచించలేదు!" అన్నది చంద్రావతి.

"మహావ్యక్తికీ వ్యవస్థకూ పోలిక పెట్టడం సరికాదనుకుంటాను. ఏమంటే ఎంతటి వ్యక్తి అయినా మృత్యువుని తప్పించుకోలేడు గదా! వ్యవస్థ అనేదీ, ధర్మము అనేదీ ఎందుకు నశించాలి? అది చిరస్థాయిగా వుండవలసిందే కద! అది ఆర్థిక వ్యవస్థకు అతీతమైనది కాదా?"

"ఇందులో ఒకభ్రమ వుంది శ్రీధర్! వ్యక్తి అంటే ఏమిటి నిర్వచనం? అతని దేహమా? మనస్సా? పోతే ఆత్మ అంటారే అదేమిటి? ఇదంతా జిజ్ఞాసచేసి సంపాదించవలసిన జ్ఞానం; ఇందులో మృత్యువుకూ మార్పుకూ అతీతమైన వస్తువు ఏమైనా వుందో లేదో—ఆత్మ అలాటిదని అంటారే— అది ఎవరికి వారు తెలుసుకోదగిన సంగతి. ఒకరు చెబితే నమ్మి ఊకదంపుడుగా మాట్లాడవలసిన సంగతి కాదు.. అలాగే యివాళ హైందవవ్యవస్థ, సంస్కృతీ, వానితోబాటు మూలధర్మమూ బ్రతికేవున్నాయో గతించి శల్యావశిష్టమయ్యాయో, లేక వ్యవస్థమారినా మూల ధర్మం అలానేవుందో ఎవరికి వారే నిర్ణయించుకోవాల్సిన సంగతి. అందువల్లే అది వివాదగ్రస్తమైన సంగతికూడా.. నామటుకు నాకు వ్యవస్థ మారుతుందీ, నశిస్తుందీ, దాన్ని గూర్చి పెద్దగా దుఃఖించ నక్కరలేదు అనిపిస్తుంది. దుఃఖించడము మానవ సహజమేగాని, ఆ దుఃఖములో మరేమీ చూడలేకపోవటం బలహీనత, చేతకానితనం. అదే జీవితంమీద అధికారం లేకపోవటం కూడా!.. ఆ నవలలో కనిపించేది వ్యవస్థయొక్క బాహ్యస్వరూపమే తప్ప దాని మూలధర్మంకాదు. ఎవరో అన్నట్లు అందులో పడగలు తప్ప పాములేదు!.. శ్రీధర్, మనలో గొప్పలోపం మనకు జీవితం మీద గాఢవిశ్వాసం లేకపోవటం...."

"అంటే ఏమిటి? అదెలా వస్తుంది?"

"ఏమో నాకూ అది తెలీకనే కదా ఈ అవస్థ!"

* * *

డిసెంబరు నెలలో ఒక ఆదివారం ఉదయమే శ్రీధర్‌ని తనయింటికి రమ్మని ఆహ్వానించింది చంద్రావతి. ఎప్పుడైనా ప్రొద్దుటిపూట సినిమా 'షో'కి వెళ్లాలనుకుంటే అలానే రమ్మనేది. ఈసారి శ్రీధర్ వెళ్లేటప్పటికే బయలుదేరటానికి సిద్ధంగా వుంది చంద్రావతి. ఏమీ చెప్పకుండానే కారులో కూర్చోమన్నది. శ్రీధర్ ముందుసీట్లో కూర్చున్నాడు. అతనెప్పుడూ చంద్రావతి వాళ్ల కారులో వెళ్లలేదు. కారుని చూడగానే బహుశా చంద్రావతి భర్తకూడా సినిమాకు వస్తాడనీ, అలా అయితే భార్యాభర్తలు వెనకసీట్లో కూర్చోవటం బావుంటుందనీ అలా చేశాడు. ఇంతలో లోపలినుంచీ చంద్రావతి అయ్యరు కుర్రవాడితో 'లంచ్ బాస్కెట్' పట్టించుకొని వచ్చి వెనకసీట్లో పెట్టించింది.

"ఎక్కడికి? ఏదో ప్రయాణంలా వుందే?" అన్నాడు శ్రీధర్.

"చెబుతా.. పిక్నిక్" అని లోపలికి వెళ్లింది చంద్రావతి.

తర్వాత కొంతసేపటికి ఆమె తిరిగివచ్చి స్టీరింగ్ దగ్గర కూర్చుంది.

"నీకు డ్రైవింగ్ వచ్చు నన్నమాట!.. మీ డ్రైవర్ ఏమయ్యాడు? మీవారు కూడా వస్తా రనుకున్నాను".

కారు బయల్దేరింది.

"మావా రెక్కడున్నారు? ఇవ్వేళ రంగూన్‌లో వుంటారు. డ్రైవర్‌కి సెలవు".

"ఎక్కడికీ ప్రయాణం?" అన్నాడు కొంత ఆశ్చర్యంతో శ్రీధర్.

"ప్రపంచానికి కాస్త దూరంగా పారిపోదామని..."

"అడయారు వైపా?"

చంద్రావతి సమాధానం చెప్పలేదు. శ్రీధర్ కామెధోరణి క్రొత్తగా తోచింది. అలా ముభావంగా వుండటం ఆమె స్వభావానికే వ్యతిరేకం. బహుశా డ్రైవ్ చేస్తూండటంవల్ల ఏకాగ్రత చెడుతుందని ఆమె ముక్తసరిగా వుండేమోనని శ్రీధర్ కూడా మౌనం వహించాడు.

కారు గిండీ దాటింది.

శ్రీధర్ మళ్లీ అడిగాడు గాని సమాధానం రాలేదు...

ఒక యువతి డ్రైవ్ చేస్తున్నకారులో తనుఆమె ప్రక్కనే కూర్చుని ఎక్కడికో తెలీని ప్రదేశానికి వెళ్లిపోతూ వుండటం— అలా ఊహించుకొని చూస్తే ఎదురుచూడని ఆ అనుభవంలోని క్రొత్తదనం అతణ్ణి ముగ్ధుణ్ణి చేస్తోంది.. కాని మరోవైపు ఏమిటో సంకోచమూ అనుమానమూ..

కారు తాంబరం రైల్వేస్టేషన్ దాటింది.

శ్రీధర్‌కు తను నాగరాజు ఆహ్వానంమీద క్రిస్టియన్ కాలేజిహాస్టలు వార్షికోత్సవానికి వెళ్లిన సాయంకాలం— మాయలత— ఆమెతో సంభాషణ— అన్నీ జ్ఞాపకం వచ్చాయి— మాయలతతోబాటు మొగలి అత్తరు పరిమళమూ....

శ్రీధర్‌కారులో యిటునటు చూచి, వెనుకసీటులో వున్న చంద్రావతి నల్లటిబ్యాగ్‌ని వంగి తీసుకున్నాడు......

చంద్రావతి ప్రశ్నార్థకంగా అతని వైపొకసారి చూచి మళ్లీ రోడ్డువైపు దృష్టిమళ్లించింది.

శ్రీధర్ బ్యాగ్ తెరిచాడు. అద్దం, దువ్వెన, చేతిరుమాలు, అయిదు పదిరూపాయలనోట్లు —యథాప్రకారం, పూర్వం ఆమె తనకు ఆ బ్యాగ్ యిచ్చినప్పుడున్నట్లే వున్నాయి. కాని శ్రీధర్ అన్వేషణంతా అందులో పూర్వం కనిపించిన మొగలిరేకు కోసం! ఆ మొగలిరేకు కనిపించలేదు! శ్రీధర్ తెరచివున్న బ్యాగ్‌ని ఆఘ్రాణించాడు. అతనికి అందులో మొగలివాసన ఛాయామాత్రంగా కూడా గోచరం కాలేదు. ఇంకేదో అనిర్దేశితమైన అపరిచితమైన పరిమళం తోచింది.

చంద్రావతి మళ్లీ అతనివైపు చూచింది... నవ్వుతూ.' "ఏమిటి అంతవింతగా పరీక్ష చేస్తున్నావ్! ఆ బ్యాగ్ రహస్యాలన్నీ భేదిస్తున్నావ్!... అంతగా యిష్టమైతే పోనీ తీసేసుకోరాదూ! ఆడవాళ్ల బ్యాగ్ అంటే అంత ఆకర్షణేమిటి నీకు?"

"అదికాదు.. ఇదివరకు యిందులో ఒక మొగలిరేకు చీలిక చూచాను. ఇప్పుడది లేదు, దాని వాసనా లేదే!"

చంద్రావతి పడిపడి నవ్వుతోంది.

"తర్వాత తీరిగ్గా నవ్వవచ్చు,డ్రైవింగ్ జాగ్రత్త మేడమ్!"

"అదికాదు...నీకు మొగలిరేకుల వాసన అంటే అంత యిష్టమని నాకు తెలీదు! చూడు, నిన్ను గురించి యిన్నాళ్ళూ ఎన్నో విషయాలు తెలుసుకొన్నా, ఈ ఒక్కవిషయం తెలీలేదే!.... వైవిధ్యం వుండాలి కదా ఎందులోనైనా.... అప్పుడు మొగలిరేకు సరే, యిప్పుడు యింకో వాసన!..... ఏం బాగులేదా?...ఈ పరీమళ మేమిటో పోల్చుకోలేదా?"

"లేదు, ఏదో క్రొత్తగా వుంది!"

"ఏం? క్రొత్త అంటే నీకు సరిపడదా?....ఈవెనింగ్ ఇన్ పారిస్.... పేరే చాల గమ్మత్తుగా వుంది కదూ?.... ఇది అందరికీ తెలిసిందే, ప్రసిద్ధమైందే..... ఒక్క శ్రీధర్‌కు తప్ప!"

కృత్రిమమైన ఈ అత్తరుల కంటె పువ్వులనుంచీ వచ్చే పరిమళమే నాకిష్టం......"

"శ్రీధర్, ఏది కృత్రిమం? ఏది కాదు? అసలీ విభేద మేమిటంట? ఒక పరిమళం తాలూకు అనుభూతి ఎలావుంది అనే ప్రశ్న ముఖ్యంకాని, దాని గుణ నిర్ణయానికి అది పువ్వునుంచీ వచ్చిందా కోల్‌టార్ నుంచీ వచ్చిందా అన్నప్రసక్తి కేవలం అన వసరంకాదు!.... తర్కించే కొద్దీ నాకు కనిపిస్తున్న దేమిటంటే జీవితానుభవాల విషయంలో చూడవలసింది అనుభూతే తప్ప ఆ అనుభూతికి మూలమైన కారణమైన పరిస్థితుల యొక్క, వస్తువులయొక్క గుణ విమర్శ కాదు.... నాకో తమాషా ఉదాహరణ జ్ఞాపకం వస్తోంది. ఆలిస్— వండర్‌లాండ్ కథలో ఒక చమత్కారపు సంగతి వుంది, పిల్లి నవ్విందట. ఆలిస్ ఆశ్చర్యపడి చూస్తూంటే మిగిలింది నవ్వేనట కాని పిల్లి అక్కడ లేనేలే దట... అలాగే జీవితాన్ని విశ్లేషించి చూస్తే, సత్యంగా నిలిచి గోచర మయ్యేది అనుభూతి ఒక్కటేకాని అనుభవాలు కావు... పువ్వు లెన్నోరకాలు, మధు వొక్కటే!... ఏమంటావ్?"

శ్రీధర్ జవాబు చెప్పలేదు. చంద్రావతి ఆలోచన తీసే పరుగుల్ని అతను తరచు అందుకోలేడు గాని, చంద్రావతి కూడా యించుమించు నాగరాజు ప్రతిపాదించిన సిద్ధాంతం వంటిదాన్నే జీవితానుభూతి అంటూ ఏదో సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తోంది కాబోలు!

శ్రీధర్ జ్ఞాపకంలో ఆచివరి దృశ్యం— తను నాగరాజుతో పోట్లాడిన దృశ్యం నిలిచింది......

నాగరాజు— సిసీలియా— భ్రూణహత్య—

మద్రాసునుంచి వెళ్లిన తాను, మళ్లీ మద్రాసుకే ఎందుకు తిరిగి వచ్చినట్లు? శ్రీధర్‌కు ఆశ్చర్యం కలిగింది. ఒకదాని వెంబడి ఒకటి కారణాల తోరణాలు, సంఘటనల వరుస ఆవర్తమై అతను వదిలిపెట్టి వెళ్లిన చోటికే మళ్లీ అతణ్ణి తెచ్చి నిల్పోబెట్టాయి...

నాగరాజు బదులు చంద్రావతి... అంతేనా భేదం? లేక ఆ భేదం భేదమే కాదా?

ఎక్కడికో చెప్పకుండా, ఉన్నట్లుండి యింత ధైర్యంగా కారు స్వయంగా డ్రైవ్‌చేస్తూ, పిక్నిక్ బయల్దేరదీసిన చంద్రావతిని ఎలా అర్థం చేసుకోవాలి?.....

కలిసి సినిమాలకు వెళ్లటం వేరు. ఆత్మీయత వేరు. ఇలా కారులో ఎక్కడికో దూరంగా ఏకాంతంగా పిక్నిక్ వెళ్లటంవేరు. లోకం ఏమనుకుంటుంది?

"మనం ఎక్కడికి వెళ్లేది? అచో ఏదో ఆసంగతి ఎందుకని నాతో చెప్పకుండా దాచావ్?" అన్నాడు శ్రీధర్.

"మహాబలిపురం... ఇదుగో చెంగల్పట్టు వచ్చేశాం.. నువ్వు కనుక్కుంటావో లేదో చూద్దామనుకున్నాను... కాని లాభం లేదు. నీకు ఈ పిక్నిక్‌ను గురించి సరదానే వున్నట్లులేదు" అన్నది చంద్రావతి.

"మహాబలిపురమైతే నాకూ యిష్టమే! నాకు చూడాలని ఎన్నాళ్లనుంచో వుంది!"

అలా అని అన్నాడే కాని శ్రీధర్ మనస్సు మనస్సులో లేదు. జరుగబోతున్న దేమిటి? మహాబలిపురంలో శిల్పాలను చూచివచ్చి వెయ్యటమేనా?...ఇది బహుశా తనకు ఒక పరీక్ష.. దీనికి పర్యవసానం ఎలా వుంటుంది?......

"ఇదే పక్షితీర్థం... ఇంకోసారి ఎప్పుడైనా రావచ్చు యిక్కడికి! అంటూ చంద్రావతి, పక్షులు రావటాన్ని గూర్చిన సిద్ధాంతాలు నమ్మకాలు విమర్శిస్తోంది.

ఏది ఏమైనా స్నేహాన్ని యథాతథంగా వుంచే ప్రయత్నం చెయ్యాలి తను! ఈ బాధ్యత తనదే, తనదే! ఇక్కడ తనకు ఓటమి సంభవించకూడదు!....

కారు మహాబలిపురం చేరుకున్నది....

ఒక గంటకుపైగా తిరిగి శిల్పాల్ని, శిథిలాల్ని చూశారు.

సముద్రానికి దగ్గరగావున్న ఒక దేవాలయ ప్రాంగణంలో ఏకాంతస్థలాన్ని ఎన్నిక చేసుకుని అక్కడికే 'లంచ్ బాస్కెట్' తెచ్చుకున్నారు.

లంచ్ ముగిసింది. సంభాషణ యావత్తూ మహాబలిపురం చరిత్రమీద, శిల్పవైశిష్ట్యం మీద సాగింది. శ్రీధర్ మనస్సుకు హాయిగా సంతృప్తిగా వుంది.

ఎదురుగా సముద్రం కనిపిస్తోంది. చలికాలం కావటంతో ఎండ తీవ్రంగా లేదు. మధ్యాహ్నం రెండుగంటలైంది.....

"నువ్వెప్పుడైనా సముద్రస్నానం చేశావా? కొండల్లో వుండేవాడివి..." అన్నది చంద్రావతి.

"ఆఁ.. ఒకసారి గ్రహణం సమయంలో విద్యార్థులం వెళ్లాము..." విద్యార్థుల కొంటెతనమూ, వాళ్ల ప్రవర్తనా మాటలూ, స్నానంచేస్తున్న ఆడవాళ్లపట్ల వాళ్లు ఆసమయంలో చూపిన కుతూహలమూ శ్రీధర్‌కు జ్ఞాపకంవచ్చి, సిగ్గుపడ్డాడు. ఆ విషయాన్ని గూర్చి ప్రసంగం అంతటితో ఆపివేశాడు.

"అయితే అల వచ్చినప్పుడేం చెయ్యాలో వగైరా విషయాలు తెలుసన్నమాట!... నేనూ మావారూ చాలాసార్లు సముద్రస్నానం చేశాం.. మాకెంతో సరదా!" అన్నది చంద్రావతి.

శ్రీధర్ సముద్రంవైపు చూస్తున్నాడు బెరుగ్గా. అతనికి సముద్రంలో దూరాన నౌకలాంటిది కన్పించినట్లయింది. అది నావేనో కాదో అని పరకాయించి చూస్తూ పరధ్యానంగా వున్నాడు.

చంద్రావతి లేచివెళ్లి బాస్కెట్‌లోనుంచి ఒక ప్లాస్టిక్ కేస్ తీసుకువచ్చింది.

"స్నానంచేద్దాం... కారులో టవల్స్ వుంచాను తీసుకువస్తావా? నేనంతలో డ్రెస్ మార్చుకుంటాను..." అన్నదామె.

"నువ్వింకో చీరా అన్నీ తెచ్చుకున్నా వేమిటి? మరి నేనేమీ తెచ్చుకోలేదే!" అన్నాడు. ఈ స్నానం ప్రసక్తి అతనికి సుతరామూ యిష్టంగా లేదు.

చంద్రావతి ప్లాస్టిక్‌కేస్ తెరిచి 'బేదింగ్‌సూట్' బయటికి తీసి చూపించింది అతనికి.

శ్రీధర్‌కు మతిపోయినట్లైంది. ఏమనాలో తోచక చంద్రావతి వైపు చూచి, తర్వాత ఎటో చూశాడు. అతనికి వళ్లంతా చెమట పోస్తున్నట్లయింది.

చంద్రావతి శ్రీధర్‌ను గమనిస్తోంది. చివరకు—

"నీకు నాతో స్నానం చెయ్యటానికి సిగ్గు కాబోలు!" అన్నదామె నవ్వుతూ.

శ్రీధర్ తలవంచుకుని, మనస్సు చిక్కబట్టుకుని, "అవును, అయినా ఉప్పునీటి స్నానం బావుండదు నాకు, వళ్లంతా బంక పట్టుతుంది... విశ్రాంతి తీసుకుని ఇంకో గంటకు వెళ్లిపోదాం... స్నానం గీనం వద్దు!" అన్నాడు గబగబా.

"అలాగే... నువ్వు విశ్రాంతి తీసుకో... నాకు సముద్రంలో అలలతో ఆడుకోవటమే బాగుంటుంది... నువ్వటు వెళ్లి టవల్సు తెచ్చిపెట్టు... నేను డ్రెస్ మార్చుకుంటానేం?" అన్న దామె బేదింగ్ సూట్ విప్పుతూ....

శ్రీధర్‌లో ఆవేదనా, దుఃఖమూ పొంగివచ్చాయి.

"వద్దు.. నువ్వీ దుస్తుల్లో సముద్రస్నానం చేస్తావని నేనెప్పుడూ ఊహించలేను!.. నా కిష్టం లేదు!...వద్దు!! వెస్ట్‌లో ఆదేశాల్లో, వాళ్లేమైనా చెయ్యనీ, మనకక్కరలేదు...." అతని మాటలో ఉద్వేగం, ఆజ్ఞాపిస్తున్న ధోరణి వ్యక్తం అయింది.

చంద్రావతి అతని ఉద్వేగాన్ని గమనించీ గమనించనట్లే నెమ్మదిగా అన్నది: "ఇందులో తప్పేమిటి శ్రీధర్? సముద్రస్నానం ఆరోగ్యానికి మంచిది... బరువైన మామూలు దుస్తులతో ఎలా స్నానం చెయ్యటం? దీనికి తూర్పు పడమరలతో ఏమీ సంబంధం లేదు!"

శ్రీధర్ ఆమెవైపు చూడలేకపోయాడు. సముద్రంవైపే చూస్తూ కొంతసేపటికి ప్రాధేయపూర్వకంగా అన్నా డామెతో:

"నాకు నీలా వాదించే శక్తిలేదు!... నేను సెంటిమెంటల్ క్రీచర్‌నే కావచ్చు.... కాని...కాని.. నాకిది సవ్యమైన విషయంగా కన్పించటంలేదు చంద్రావతీ!.... నామనస్సులో ఏమున్నదీ యిది

వర కొకసారి చెప్పాను ఆరాత్రి బీచ్‌లో.. ఇప్పుడూ చెబుతాను— ఎంత అప్రస్తుతంగా సెంటిమెంటల్‌గా కన్పించినా సరే— నిన్ను మా వదినెతో పోల్చుకున్నాను ఎన్నోసార్లు... మా వదినె నాకంటె పెద్దదే కాదు, నన్ను వాత్సల్యంతో చూస్తుంది కూడా.. ఆమె మీద నాకు గౌరవభావం— నీమీద నాకు గౌరవభావమేకాదు, ఆరాధనా భావం కూడా— నేను యింటరులో వున్నప్పుడు భారతదేశం అంటే ఒక స్త్రీమూర్తిగా ఉహించుకొన్నాను...ఆమెను నిత్యమూ మావదినె మంచితనంలో గొప్పతనంలో చూచేవాణ్ణి.... మళ్లీ నీలో చూచాను, ఎంతో గొప్పగా, ఉజ్జ్వలంగా, మేధాశక్తితో తత్త్వవిచారణ చేయగలిగిన బుద్ధికుశలతతో, నాకు ఉపదేశం చేసే గురువుగా కనిపించావు— ఇదంతా సెంటిమెంటే, సందేహం లేదు—కాని ఈసెంటిమెంట్‌ని, ఈ కలని నిర్దాక్షిణ్యంగా అంతమొందించవద్దనే నేను కోరుతున్నాను.... నువ్విలా వుండాలనీ, లేక యిలా చెయ్యకూడదనీ ఆంక్షపెట్టే అధికారం నాకు లేదు— కాని మనస్నేహం చూచి నాకీ పరీక్ష పెట్టవద్దని కోరుతున్నాను.."

చంద్రావతి నవ్వుతూ అన్నది!

"నన్ను అంతలా అందల మెక్కిస్తే క్రింద పడకుండా ఎలా ఉండగలను శ్రీధర్ ! నువ్వు విచిత్రవ్యక్తివి ! నీ సెంటిమెంట్స్‌కి బాధ కలిగించటం నా కిష్టంలేదు ! నాకూ ఉన్నాయి బాబూ సెంటిమెంట్స్ ! .... కాని ఉద్రేకపడకుండా నిదానంగా, నిశ్చలంగా తర్కించి చూడు .... నేను బేదింగ్ సూట్‌తో సినిమా పోస్టరులా నడివీధిలో నుంచోబోవటం లేదు ! నిన్ను ఆత్మీయుణ్ణిగా ఎంచుకున్నాను కాబట్టే సందేహించలేదు.... ఇది నీకు పరీక్ష అని నువ్వనుకోవట మెందుకో !"

శ్రీధర్ తికమక పడ్డాడు. అత్మపరిశీలన చేసుకున్నాడు. ఈ పొరపాటు తనలోనే ఉందా ? తన సందేహంలోనే ఉందా ఈ కాలుష్యం ?

"నేను నీవలె తర్కించుకొని సహేతుకంగా ఏదీ చెప్పలేను. ఈ విషయంలో నా అభిప్రాయ మేమిటో, నా విశ్వాస మేమిటో చెప్పాను. ఇది తర్కానికి అందని విషయం.... విశ్వాసాల్ని తర్కంతో పడగొట్టుకుంటూ పోవటంవల్ల లాభం లేదని పిస్తుంది..... కొంతదూరం ఉత్సాహంగా వెళ్లగలం కాని ఎక్కడో ఒకచోట ఆగిపోవలసిందే ! లేకపోతే ఏమీ మిగిలేట్టు తోచదు !"

"రైట్ ! ఇక ఆ విషయం అంతటితో వదిలివేద్దాం.... ఈ మహాబలిపురం చూడు, యింతకు మూడింతలో నాలుగింతలో పట్టణం ఉండేదట, కాని ఆ భాగం సముద్రంలో కలిసిపోయింది. మిగిలిం దిది .... ఎన్ని సౌందర్య కల్పనలు-అలాగే సెంటిమెంట్స్; ఎన్ని శిల్పాలూ, ఆలయాలూ—అలాగే విశ్వాసాలూ వ్యవస్థలూ; మానవచరిత్ర అనే సాగరగర్భంలో, కాలంలో అంటే ఎప్పటి కప్పుడు నూతనంగా చొచ్చుకు వచ్చే అభిరుచులకూ, తర్కం అనే అలల తాకిడికీ—కనబడకుండా పొయ్యాయో ! .... ఇది గమనిస్తే ఏమనిపిస్తోంది ? పోయినవాటికంటె ఈ మిగిలినవాటి ఆధిక్యం ఏమిటి ? అనుకోవచ్చు. అలాకాదు, ఇవి ఏ అదృష్టం వల్లనో యిలా మునిగిపోకుండా మిగిలిఉండటమే వీటి ఆధిక్యం కదా ! అని కూడా అనుకోవచ్చు. మొదటి విధంగా అనుకుంటే అవిశ్వాసమూ, నాస్తికత్వమూ .... రెండోవిధంగా అనుకుంటే విశ్వాసమూ, ఆస్తికత్వమూ .... ఇంతే భేదం శ్రీధర్ ! .... ఇది మారిన, మారుతున్న మన దేశ సంస్కృతికీ, సంఘ వ్యవస్థకూ సంబంధించిన సత్యమే కాదు— వ్యక్తుల్లోనూ యింతే ! ..... నేను పెళ్లయినా కాలేజిలో చదువుతూ ఉండటం, నీతో సినిమాలకు తిరుగుతూ ఉండటం నీకు ఎబ్బెట్టుగా లేదు— అంతమేర ప్రాత పద్ధతులు నీలో తర్కానికీ, నూత్న భావాలకీ లొంగి మాసిపోయినట్లే కదా ! కాని నేను బేతింగ్ సూట్ వేసుకొని సముద్రస్నానం చేస్తాననగానే, నువ్వు ఈ విషయం నీ సెంటిమెంట్స్‌కీ, దృఢ విశ్వాసాలకీ చెందిందని చెబుతూ, అక్కడ తర్కానికి ప్రవేశార్హత లేదంటూ ఆగమన్నావు .... ఇది నీలో మిగిలిన 'మహాబలిపుర' మన్నమాట !"

"పోనీ, యిద్దైనా నిలవటం మంచిదే కద !. లేకపోతే వట్టి యిసుక మిగిలేది !"

"నిలవటం మంచిది కాబట్టి నిలవాలనే నిర్ణయం, ఎవరు చేస్తున్నారు శ్రీధర్ ? అదీ నా ప్రశ్న .... నిలిచిందేదో అది గట్టి—దీన్నీ రేపు అలలు పైబడి వచ్చి ముంచివేసి లోపలికి లాక్కుపోతాయా పోనీ—అంతేకాని, మంచిది పోయిందనే ఏడుపు అనవసరం—దేని మంచి అయినా, చేవ అయినా దాని శక్తిని అది నిరూపించుకోవటంలోనే ఉంది—ఇదీ డార్విన్ సిద్ధాంతం లాంటిదే ! 'జీవించే అర్హత కలిగిలన ప్రాణులే మిగులుతాయి' (Survival of the Fittest)—వ్యవస్థ, సంస్కృతి, శిల్పము, నాగరకత వగైరాలకూ అన్వయిస్తుంది !" ఆమె చేస్తున్నది వాదన కాదు, ఆత్మపరిశీలన అనిపించింది శ్రీధర్‌కు.

ఆమెలో నిర్వేదం గుర్తించాడు శ్రీధర్. కాని, ఆమె మనోవ్యథ యథార్థస్వరూప మేమిటో అతనికి యిన్నాళ్లకు యిప్పటికీ అర్థంకాలేదు..... ఈ పిక్నిక్‌ను తలవని తలంపుగా ఆమె ఏర్పాటు చెయ్యటానికి కారణం ఆ మనోవ్యథేనని మాత్రం గ్రహించగలిగాడు.....

తిరుగు ప్రయాణం సాగుతుండగా శ్రీధర్ ప్రశ్నించాడు: "ఈ పిక్నిక్ అనుకోకుండా తలపెట్టావే కారణ మేమిటో !"

"నీకు పరీక్ష పెట్టటానికి !" అన్నది చంద్రావతి.

"ఆ విషయమై వాదన వదిలిపెట్టుకున్నాం కదా, మళ్లీ ఆ ప్రసక్తి, ఎత్తిపొడుపూ న్యాయం కాదు !"

"నిజంగానే శ్రీధర్ ! నిజం చెప్పినా నమ్మవేమి టయ్యా నువ్వు ? మంచివాడివే ! పోనీలే, నాకు మనస్సు బాగలేక అనుకో."

ఆమె 'అయ్యా' అన్న ధోరణి అచ్చంగా వదినె రుక్మిణమ్మ మాటవరసలా ఉందనిపించింది శ్రీధర్‌కు.

"పోనీ అదేమిటో అర్థమయ్యేట్లు వివరించకూడదా !" చంద్రావతి మాట్లాడలేదు.

చెంగల్పట్టులో ఒక హోటలు ముందు కారాపి, కాఫీ త్రాగటానికి లోపల ప్రవేశించారు. అప్పటికి నాలుగు గంట

లవుతోంది. హోటల్లో ప్రవేశించగానే అందరి కన్నులూ తమ వైపే ఉండటం గమనించారు. ఫామిలీస్‌కు ప్రత్యేకించిన గదిలో వెళ్లి కూర్చున్నారు.

"చూశావా, వాళ్లందరూ ఎలా చూస్తున్నారో మనల్ని! ఈ రోజుల్లో మనం వదినా, మరదీ, లేక అక్కా తమ్ముడూ అంటే ఎవరు నమ్ముతారు ?" అన్నది చంద్రావతి విషాదంగా చిరునవ్వు నవ్వి.

ఆమెమీద ఆప్యాయత పొంగి వచ్చింది శ్రీధర్‌లో.

"నా కిదివరకే వదినె ఉంది, నువ్వు అక్కయ్యవు ! నాకంటె ఎన్నేళ్లు పెద్దదానివీ ?" అన్నాడు.

"ఆడవాళ్లను వయస్సును గూర్చి ప్రశ్నించకూడదనే మేనర్స్ తెలీకపోతే ఎలా ?" .... అంతలో కోపం తెచ్చుకున్న చంద్రావతిని చూచి విస్తుపోయి శ్రీధర్ నిశ్శబ్దంగా కాఫీ పూర్తిచేశాడు.

మళ్లీ కారు బయల్దేరేదాకా యిద్దరూ మౌనంగానే ఉన్నారు .....

"నువ్వు నాకు పెట్టిన పరీక్ష ఏమిటో చెప్పనా ?"

"పరీక్షా లేదు, ఏమీ లేదు ! .... ఒక సంగతి జరిగిన తర్వాత అదంతా నా తెలివేనని చెప్పుకోవటమూ ఒక పద్ధతి, అంతే !—నిజానికి యిలాంటి పరీక్షలు నిత్యమూ అందరికీ జరుగుతూనే ఉంటాయనుకో; పరీక్ష చేసేవాళ్లే ఆ క్షణం లోనే పరీక్షింపబడుతూ ఉంటారు కూడా !—ఈ సోదె అంతా ఎందుకు ? నువ్వే అన్నావు 'పరీక్ష' అనే మాట, దాన్ని పట్టుకొని నేనేదో వూహిస్తూ అన్నాను, అంతే !— ఏమంటే నువ్వు కనిపించినదాన్నల్లా మంచి ఆదర్శం అంటూ పట్టుక్కూచుంటావ్, తర్కించేటప్పటికి సగానికి సగం వదులుకుంటావు కూడా .... మరి నీలో గట్టిగా నిలిచే విశ్వాసాలు ఏమున్నాయో నా కెలా తెలుస్తుంది ? ఇవ్వాళ కనీసం ఆ ఒక్క సంగతి ఎలాగో కాస్త బయటపడిం దనుకోవచ్చు కదా !"

"ఏమిటేమిటీ ? నేను ఆదర్శాలను వదులుకుంటానా ? ఏ ఆదర్శాన్ని వదులుకున్నాను అలా ? ఇంతవరకూ నాకు తెలిసి ఏ ఆదర్శాన్నీ వదులుకో లేదే ! చర్చించటంవల్ల అందులోని సాధక బాధకాలను గుర్తించవచ్చు కాని వదులుకోవటం ఎన్నడూ జరుగదు...... పోతే నీలో నేను గుర్తించిన లోపం ఏమిటో చెప్పనా—ఎడతెగని విమర్శ, అదీ విధ్వంసక విమర్శ చేస్తూ ఉండటం—ఇదంతా మానేసి మనస్సు నిమ్మళం చేసుకుంటే బావుండదూ !"

"రైట్ ! నాలోని లోపం విశ్వాసాల్ని విమర్శిస్తూ వాటిని నిలుపుకోలేకపోవటమే, నిజంగా అంతే ! కాని అందుక్కారణం నేను కాదు, బహుశా నా అదృష్టమేమో ! ..... ఏమో చెప్పలేను, నేనే కావచ్చు కూడా, అదృష్టాన్ని అనటం ఎందుకు ? .... ఇది తేలే విషయం కాదు చూస్తే."

తర్వాత యిద్దరూ ఎవరి ఆలోచనల్లో వాళ్లుండిపోయారు.

ఆమె అదృష్టం విషయ మేమిటో అడగాలని ఉన్నా ఆమె ముఖంచూచి శ్రీధర్ మళ్లీ ప్రశ్నించలేకపోయాడు. ఇప్పుడు కాదు, మరోమాటు అడగాలి అనుకున్నాడు. కారు గిండీ చేరువకు వచ్చేసింది.

"నన్ను హాస్టలుకు దగ్గరగా దారిలోనే దింపేస్తే బావుంటుందేమో ! లేకపోతే మళ్లీ అంతదూరమూ వెనక్కి రావద్దూ !" అన్నా డామెతో.

"అలాగే."

## 12

శ్రీధర్ హాస్టల్ చేరుకునేటప్పటికి ఆరుగంటలైంది. అది వారం సాయంత్రంకావటంతో హాస్టలు ఇంచుమించు నిర్మానుష్యంగా వుంది. స్నానం చేసివచ్చి కిటికీ దగ్గరగా కుర్చీలాక్కుని కూర్చున్నాడు గదిలో. ఆ సాయం సంధ్యా నిశ్శబ్దంలో ఆరోజు జరిగినదంతా ఆలోచిస్తూ ఉండిపోయాడు. అతనికి చాల విషయాలు అర్థంకాలేదు. కాని ఆరోజు చంద్రావతితో ఆమెను గూర్చి తనకుగల భావమేమిటో స్పష్టంగా చెప్పగలిగినందుకు అతనికి తృప్తిగా ఉంది......చంద్రావతిని అర్థం చేసుకుని ఆమెకు తనేదో సలహా ఇవ్వగలనన్న అభిప్రాయం మొదట్లో ఉండినా, ఆ అభిప్రాయాన్ని ఇప్పుడు పూర్తిగా వదులుకున్నట్లే! మెరుపుతీగె ఎప్పుడెలా ప్రకాశిస్తుందో ఎలా మిరుమిట్లు గొలుపుతుందో అనూహ్యమైన విషయమే! ఆమెకు దారి చూపటం తన తరమా? ఆమెను గురించి యిదమిత్థమని తను వూహించలేకపోయినా ఆమెమీద విశ్వాసం, గౌరవం, అభిమానం మాత్రం తనలో ఎప్పుడూ ఉంటుంది......అదే ఆమెను గూర్చిన సత్యం......

శ్రీధర్ మెస్‌కు వెళ్లేసరికి అతని రూమ్‌మేట్ రామారావు అప్పుడే టవున్‌నుంచి సరాసరి మెస్‌కు వచ్చాడు. శ్రీధర్‌ను పలకరించాడు ప్రక్కన కూర్చుంటూ :

"ఏమండీ శ్రీధర్, పొద్దుటినుంచీ పత్తాలే దివ్వాళ? ఏమిటి ప్రోగ్రాం?"

"తెలిసిన వాళ్లింటికి వెళాను."

"స్నేహితులా, బంధువులా?"

"రెండూ" అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

"రెండూ ఎట్లా?" అన్నాడు రామారావు అరటి ఆకు కడిగి, ఆ నీళ్లను క్రిందికి జార్చుతూ. రామారావు సాధారణంగా ముక్తసరిగానే వ్యవహరిస్తాడు. ఇతరుల విషయాల్లో జోక్యం కల్పించుకోడు. అనవసర ప్రసంగాలు చెయ్యడు. శ్రీధర్ కూడా అతనితో అలానే ఉంటాడు. అందువల్ల రామారావు ధోరణికి శ్రీధర్ కొంత ఆశ్చర్యపడ్డాడు.

"స్నేహితులైన బంధువులు, లేక బంధువులైన స్నేహితులు అనుకోండి. బంధుత్వంకంటె స్నేహమే ముఖ్యంకాదా?"

"అయ్యర్! నెయ్యి తీసుకురా" అంటూ అన్నం కలుపుతూ రామారావు శ్రీధర్‌వైపు తిరిగి "ఏమిటో వేదాంతం మాట్లాడుతున్నారు. ఇంతకీ చెప్పటం ఇష్టం లేదన్నమాట..... పోనివ్వండి, అడగటం నాదే తప్పు" అన్నాడు.

"ఇందులో ఏముందీ! స్నేహితులింటికే వెళ్లాను, బంధువులకంటె ఎక్కువేననుకోండి......మీతో మాటవరసకు అలా అన్నాను."

"ఎవరు స్నేహితులు?"

శ్రీధర్ జవాబు చెప్పలేదు. రామారావు ఏదో క్రొత్తగా ప్రవర్తిస్తున్నాడనిపించింది అతనికి.

గది చేరుకున్న తర్వాత శ్రీధర్ తన పుస్తకాలు సర్దుకుని చదువుకోటానికి సిద్ధమవుతూ, పత్రిక చదువుతూన్న రామారావుతో "నా డిక్షనరీ చూశారా మీరు?" అన్నాడు.

"లేదే! మొన్న పజిల్స్ సాల్వ్ చెయ్యటానికని పేరిశాస్త్రీ సత్యనారాయణా వాళ్లరూమ్‌కి పట్టుకెళ్లలా! మళ్లీ యిచ్చారా?"

"అవును కదూ, వాళ్ల దగ్గరే వుంది"

శ్రీధర్ పేరిశాస్త్రి రూమ్‌కి వెళ్లాడు.

పేరిశాస్త్రి ఏవో పద్యాలు చదివి వినిపిస్తున్నాడు. సత్యనారాయణ మంచంమీద పడుకుని వింటున్నాడు. వాళ్లిద్దరూ ఎప్పుడూ ఒకరినొకరు ఎడబాయని జంట; రూమ్ మేట్స్. పేరిశాస్త్రి చదవడంఆపి శ్రీధర్‌కు కుర్చీ చూపిస్తూ "కూర్చోండి, ఏమిటీ విశేషాలు......వూరక రారు మహాత్ములు" అన్నాడు.

పేరిశాస్త్రి ధోరణి కొంత హాస్యయుక్తంగానే ఉంటుంది ఎప్పుడూ......"ఏమిటో కవితాస్వాదన చేస్తున్నారు?" అన్నాడు శ్రీధర్ శాస్త్రి ధోరణికి తగ్గట్టుగా......

"వనితా మధురాధరాస్వాదన సౌభాగ్యం లేనివాళ్ళు ఇదైనా చెయ్యవద్దా?......ఏంలేదు, సత్యానికి మనుచరిత్రలోని రసవత్తర ఘట్టాలు చదివి వినిపిస్తున్నాను......చూడండి, ప్రవరుడు పెద్ద ఫూల్‌లాగా ప్రవర్తించటంతో గంధర్వుడు ఎలాంటి ఛాన్సు కొట్టేశాడో......"

"ఫూల్‌లాగా ప్రవర్తించట మేమిటండీ! గొప్పగా నిగ్రహంతో ప్రవర్తిస్తేనూ?" అన్నాడు శ్రీధర్.

"నిగ్రహం మాట నేను చచ్చినా నమ్మను! ఇంటి దగ్గర సంసార మేమైపోతుందో, మళ్లీ వెళ్లగలుగుతానో లేదో అనే భయం కారణమనండి నమ్ముతాను.....ఏమి నిగ్రహమండీ? వీడేమి విశ్వామిత్రుడు వగైరా ఋషులకంటె గొప్పవాడా? ఉప్పు కారం తింటున్న గృహస్థే కద!"

"గృహస్థు కాబట్టే సులభంగా నిగ్రహం చూపించి ఉంటాడులెండి! అంతేకాదు, ఎవరికైతేమాత్రం కనిపించిన ఆడదానిమీదల్లా మనసుపోతుందా? వరూధిని నచ్చలేదేమో!"

"వరూధినేమి సామాన్యమైన అందగత్తా?...... అదీగాక తమరు మహా బుకాయిస్తున్నారుగాని, వంటరిగా ఆడది దొరికితే, ఆ అవకాశమేవుంటే విడిచి పెడతారా? విడిచేమగా డెవడండీ? నేను నమ్మను......వేరే భయమో, ఇంకేదో అత్యవసరమైన కార్యమో, కారణమో అడ్డంవస్తే తప్ప! అందుకే ప్రవరుడు ఇంటిదగ్గరేం మునిగిపోతుందో అనే ఆదుర్దా ఎక్కువై వరూధిన్ని విడిచిపెట్టా డంటాను. ఏం సత్యం, నువ్వేం మాట్లాడటంలేదు!" అన్నాడు శాస్త్రి.

"అంతా నువ్వే మాట్లాడుతున్నావు గా, ఇంక నేనెందుకూ? ఎవడూ పెద్దమనిషి కాదు ఆమాటకొస్తే! ఆడవాళ్లకే కాస్త నీతీ, నియమం, సిగ్గూ, లజ్జా, కనీసం ఏవో కొన్ని కట్టుబాట్లంటూ లేకపోతే ఎవడి భార్య పతివ్రత, ఎవడి తల్లి ఉత్తమురాలు?.....ఛీ, ఛీ, పుస్తకాల్లో రాతలూ అలానే ఉన్నాయి, మనుష్యుల బుద్ధులూ అంతే!......ఇంక మూసిపెట్టు ఆ పుస్తకం, ఏదైనా పనికొచ్చే సంగతి మాట్లాడు....." అన్నాడు కోపంతో, ఉద్రేకంతో గొంతు పెద్దదిచేస్తూ సత్యనారాయణ. అతని ధోరణి చాల అప్రస్తుతంగా కనిపించింది శ్రీధర్‌కు....

సత్యనారాయణతో శ్రీధర్‌కు పెద్దగా పరిచయంలేదు. శాస్త్రితో ఎప్పుడైనా హాస్యంగా నాలుగు మాటలు మాట్లాడటం ఉందిగాని సత్యనారాయణతో ఆపాటి పరిచయం కూడా లేదు. ఏదో చర్చించబోతే సత్యనారాయణ ఉద్రేకం చూపడంతో అతనికి సభ్యత తెలీదనిపించింది.

"శాస్త్రిగారూ, నా డిక్షనరీ తెచ్చారు గదండీ, అది కావాలి!" అన్నాడు శ్రీధర్.

"సత్యం దగ్గరే ఉండాలి" అంటూ, శాస్త్రి 'మనుచరిత్ర' పుస్తకాన్ని తన షెల్ఫులో పెట్టడానికి అటులేచి వెళ్లాడు.

శ్రీధర్ సత్యంవైపు చూశాడు. సత్యం తన కేమీ పట్టనట్లు పై కప్పుకేసి చూస్తూ పడుకొనిఉన్నాడు.

"సత్యనారాయణగారూ, డిక్షనరీ కావాలి"

"ఎవరి నడుగుతారు? నేను తేలేదు!"

"అదేమిటండీ, ఆరోజు మీరిద్దరూవచ్చి తీసుకొచ్చారా లేదా?"

సత్యనారాయణ మాట్లాడలేదు.

"శాస్త్రిగారూ, ఏమిటీ మర్యాద? పుస్తకం తెచ్చుకొన్నవాళ్లు మళ్లీ తెచ్చిఇవ్వటం పోయి, నేనే స్వయంగా వచ్చి అడిగితే ఇలానా ప్రవర్తించటం?"

"నేను చూచి ఇస్తాను ఉండండి" శాస్త్రి సత్యనారాయణ పుస్తకాల షెల్ఫు తడివి డిక్షనరీ పట్టుకొచ్చి శ్రీధర్‌కిస్తూ "స్వయం జాగ్రత్త లేకపోతే పోతాయండీ యివి! పుస్తకం, వనితా, విత్తం, పరహస్తాల్లో పడితే ఇంకేముందీ!" అన్నాడు.

"శాస్త్రీ నోరు మూస్తావా మూయించాలా?" అంటూ గర్జించాడు సత్యనారాయణ.

శాస్త్రి శ్రీధర్‌తో గది వెలుపలికి పంపిస్తూ, "మావాడివ్వాళ మహాకోపంలో ఉన్నాడు లెండి......" అన్నాడు.

శ్రీధర్ తన గదివైపు నడుస్తుండగా లోపలికి వెళ్లిన శాస్త్రి అంటున్న మాటలు తేలిపోతూ వినిపించాయి : "నామీద పడతా వేమిటి సత్యం? ఏమిటో సామెత చెప్పినట్లు ఎదురుగా......"

సత్యనారాయణ అసభ్య ప్రవర్తనకు ఆశ్చర్యపోతూ శ్రీధర్ గదిని చేరుకోగానే జరిగిన విషయాన్ని కుతూహలంగా రామారావుతో చెప్పాడు.

"మీరు చాల అమాయకుల్లా ఉన్నారు శ్రీధర్! అయితే ఈ సంగతి మీకేమీ తెలీదా? మీరేమీ వూహించుకోలేరా?" అని ప్రశ్నించాడు రామారావు.

రామారావు తనని అమాయకుడన్నందుకు శ్రీధర్‌కు కోపం వచ్చింది: "నాకు ఒకళ్ల గొడవలు పట్టవు! నేనెందుకు వూహించుకోవాలి! సత్యనారాయణ అంత మేనర్సులేని మూర్ఖు డేమిటా అనిపించి మీతో చెప్పాను. ఇందులో నా అమాయకత్వాని కేమొచ్చింది?"

"మీరు నిజంగా అమాయకులే! మనకు ఒకళ్ల గొడవలు అక్కరలేకపోయినా, అందరికీ మన గొడవ కావలసివస్తుంది. ఆ శాస్త్రి చాల ప్రమాదకరమైనవాడు, సత్యనారాయణని తన చేతిలో బొమ్మలా ఆడిస్తూ ఉంటాడు. ఇంతసేపూ శాస్త్రి మీతో మాట్లాడిన మాటలూ, అవిసుర్లూ ఎవర్ని గురించీ, దేన్ని గురించీ అనుకున్నారు?"

శ్రీధర్ ఆశ్చర్యంగా వింటూ, "దేన్ని గురించి?" అన్నాడు.

"ఏమిటండీ?! మీరూ చంద్రావతీ కలిసి సినిమాలకు వెళ్లటం, మీరు తరచు వాళ్ల ఇంటికి వెళ్లిరావటం ఎవరికీ తెలీనే తెలీ దనుకుంటున్నారా? ఏమిటి, కొంపదీసి? గమనించటమే కాదు, ఇప్పుడది ఇంచుమించు 'స్కేండల్' క్రిందే తయారైంది.......తెలీదంటా రేమిటి? దీనికంతా ఆ శాస్త్రీ, సత్యనారాయణా సూత్రధారులు.....వాళ్లే మిమ్మల్ని గురించి ఆరాలు తియ్యటం, వార్తలు మెల్లగా క్రింద క్రింద ప్రసారం చెయ్యటం......"

శ్రీధర్‌కు గుండె జారినట్లయింది......కొంతసేపు ఏమీ మాట్లాడలేకపోయాడు......

"ఎందుకంటారు వాళ్లకు నామీద కక్ష?" అన్నాడు చివరకు.

"ఈ సత్యనారాయణకు మీ ఫ్రెండు చంద్రావతి బంధువట........వరుసకు వదినె అవుతుందట......'అన్నాప్రెగడ వాళ్లట వాళ్లూ వీళ్లూను......ఆమె భర్త ఇతనికి అన్న వరుస' ఏదో బీరకాయపీచు, దగ్గరో దూరమో!.......కాని అసలీ సంగతి మీకు తెలీనే తెలీ దన్నమాట! మీకు తెలుసేమో అనుకున్నాను. కాలేజిలో చేరిన మొదట్లోనే బంధుత్వాలు తిరగేసి సత్యనారాయణా, శాస్త్రీ ఆమెతో మాట్లాడారట. తర్వాత ఆమె ఇంటిక్కూడా ఒకసారి వెళ్లారట. కాని వీళ్ల ధోరణి నచ్చక కాబోలు ఆవిడ ఉదాసీన చెప్పినట్లుంది. అదీ కోపం! సత్యనారాయణ స్వతహా మంచివాడే, శాస్త్రి ఉన్నాడే వట్టి కొంపలు ముంచే రకం......మళ్లీ తియ్యగా, హాస్యంగా మాట్లాడుతాడు......అది సరేగాని, మీరుమాత్రం మీ ప్రవర్తనలో ఎందుకు కాస్త జాగ్రత్తగా ఉండకూడదు! కాలేజిలో చదువుతున్నపుడు ఆమెతో మీరు సినిమాలకు వెళ్లటం, అదీ ఆమె భర్తవెంట లేకుండా, కొంత అపోహలకు అవకాశ మిస్తుందా లేదా? అనుమానాలకూ అనవసర కల్పనలకూ అదే మూలం.... మన నీడ మనం చూడకున్నా లోకం చూస్తూనే ఉంటుందండోయ్!"

"థాంక్స్ ఫర్ ది ఎడ్వైస్!" అనేసి శ్రీధర్ నిస్పృహగా మంచంమీద పడుకున్నాడు ఆలోచిస్తూ. అతడు అనుకోని క్రొత్త దృక్పథం ఒకటి ఎదురుగా ప్రత్యక్షమైంది......

"ఇవ్వాళ ఎక్కడికి వెళ్లారని ఇందాక మెస్‌లో అడిగితే నాతో చెప్పనే లేదు మీరు! ఆమె కారు డ్రైవ్‌చేస్తూ మీరు ప్రక్కన కూర్చుని ఎక్కడికో వెళ్లారట కదూ! మధ్యాహ్నం మెస్‌లో శాస్త్రి మెల్లగా నన్నడిగాడు ఆరాతియ్యటానికో లేక తను తెచ్చిన వార్త ప్రసారంచేసే ఉద్దేశమో......తర్వాత తనే చెప్పాడు—శాస్త్రీ, సత్యమూ యిద్దరూ ఎక్కడికో వెళ్తూ ఉదయం 8½ గంటల ప్రాంతాన ప్రత్యక్షంగా మీరు కారులో వెళ్లటం చూశారట! మీ రిద్దరేనట, ఆమె డ్రైవ్ చేస్తోందట......నేను నమ్మలేదు. వట్టి పుకార్లు పుట్టిస్తున్నాడేమో ననుకున్నాను......అందుకే మిమ్మల్ని అడిగాను...మీరు వాళ్ల గదికి వెళ్లితే జరిగిన గొడవంతా దానికి సంబంధించిందే నన్నమాట.....మీరు కారులో వెళ్లటమే నిజం కాబోలు."

"ఆఁ......నిజమే!......రామారావ్, ఆమె నాకంటె పెద్దది. నే నామెను 'అక్కయ్యా' అని పిలుస్తాను. మీరు చెప్పిన ఈ 'లోకం' దృష్టి నా కెప్పుడూ తట్టనే లేదు సుమండీ! ఇవ్వాళ ఆదివారం కదా అని ఆమె రమ్మంటే వెళ్లాను. అకస్మాత్తుగా మహాబలిపురం చూడాలని తీసుకెళ్లింది......వెళ్తూ ఎందుకో అనుకున్నాను కూడా, ఇది లోకం దృష్టిలో ఏమీ సబబుగా కనిపించదేమోనని! కాని నా కీ క్షణందాకా తెలీదు ఇంతగా విషప్రచారం మిమ్మల్ని గురించి ఎన్నాళ్లనుంచో జరుగుతుందని!... ఇప్పుడేమిటి చెయ్యటం?"

"ఏమిటండీ చేసేది?! ఆవిడ అంతగా రమ్మంటూంటే వెళ్లారు. ఆమెకే ఉండాలి ఆమాత్రం యింగితజ్ఞానం! కానివ్వండి, పబ్లిగ్గా తిరగటాన్నిగూర్చి ఆమెకులేని భయం మీకేమిటి? కాని లోకం సంగతీ, చుట్టూ ఏమనుకుంటున్నారో కాస్త కనిపెట్టి ఉండాలి. మరీ అమాయకంగా వుంటే లాభం లేదు. శాస్త్రి, సత్యాన్ని ఎలా రెచ్చగొడుతున్నాడో గమనించారు కదా! కాస్త జాగ్రత్తగా ఉండండి!........ఏమైనా అందరి దృష్టిలో మీరు అదృష్టవంతులే!"

శ్రీధర్‌కు తను నిలుచున్న భూమి అకస్మాత్తుగా కాళ్ల క్రిందనుంచి జారిపోయినట్లయింది......

ఇప్పు డెవరిని చూచినా ఎవరితో మాట్లాడినా అతనికి వాళ్ల మనసుల్లో తనను చంద్రావతిని గూర్చిన అపోహే గుర్తువస్తూ జంకు కలిగిస్తోంది. వాళ్లతో పూర్వంలా సహజంగా కలసి మెలసి ఉండలేకపోతున్నాడు.

చంద్రావతికీ, తనకూ గల స్నేహానికి అశ్లీలమైన అర్థాన్నితప్ప ఇంకో అర్థాన్ని కల్పించటం సాధ్యం కాదా సంఘానికి?.......పైనుండి చూచే వాళ్లకి వ్యక్తిగతమైన స్నేహబంధంలోని ప్రత్యేకత పవిత్రత ఎలా గ్రాహ్యమౌతుంది మరి?... స్త్రీ పురుషులమధ్య ఆకర్షణకు అతి సామాన్య కారణమేదైతే ఉందో దాన్నే వూహిస్తారు వాళ్లు!.....శ్రీధర్ ఆలోచనకు

ఇతరులు తననుగూర్చి ఎలా అనుకుంటున్నారో అన్వేషించటమే, వాళ్ల మాటల్లో సూచనగా ఆ విషయం వ్యక్తమవుతూ ఉందో లేదో గమనించటమే ప్రధానమైంది. దాన్తో అతని మనసు రెండు విధాలుగా విడిపోయినట్లయి అవి ఒక దాన్నొకటి తరచు విమర్శించటం ప్రారంభించాయి......రెండు ముక్కలుగా పగిలిన అద్దంలో ముఖం చూచుకుంటున్నట్లుగావుంది అతనికి!

వెళ్లి చంద్రావతితో విషయం పూర్తిగా చెప్పాలను కున్నాడు మొదట. కాని ఎలా చెప్పాలో వూహించుకుంటేమాత్రం అది తనకే అసహ్యంగా వుండి ఆమెముందు ఆ ప్రసక్తి తేవ టమే అసాధ్య మనిపించింది!.....అంతటితో ఆప్రయత్నం మాను కున్నాడు.....తర్వాత ఆమె ఇంటికే వెళ్లలేదు.

సంఘం చూచే దృష్టితో క్రమంగా చంద్రావతితో స్నేహాన్ని ఆద్యంతమూ విమర్శించాడు. కేవలం స్త్రీ పురుష సంబంధంగా చూస్తే అతనికీ ఆమెకీ మధ్య జరిగినదంతా ఒక క్రొత్త రూపంలో సాక్షాత్కరిస్తోంది—స్నేహాన్ని ప్రారం భించింది చంద్రావతే, తనేమీ ఆమె వెంట పడలేదు ! ఆమె ఉద్దేశం కేవలం తన్ను ఆకర్షించటమే నేమో ! .... ఆమె యింటికి వెళ్లటం ఎలా ప్రారంభమైంది ? .... రెండోసారి తను స్వయంగానే వెళ్లినా ప్రథమంగా ఆమె ఆహ్వానించింది కదా ! ఆమె తనపట్ల చూపిన ఆసక్తి, శ్రద్ధ, అభిమానం, వీటికి మూలకారణం తరచి చూస్తే ఏమిటి ? . . . . . ఆమె ఒక్కొక్కసారి అంత సన్ని హితంగా ఎందుకు ప్రవర్తించింది ? .... ఎందుకు తన్ను అలా స్పృశించింది. ? .... పేరిశాస్త్రి ఆమెను వరూధినితో పోల్చటం కొంతవరకు సమర్థనీయం కాదా ! .... తను ఆ పరిస్థితుల్లో ప్రవరుడిలాగే ప్రవర్తించాడు ! అందుకే తనని ఆమె యించు మించు 'ఛాందసుడు' అంటూ ఏవేవో మాటల్లో అనలేదా మహాబలిపురంలో ? .... అశ్లీలంగా వ్యాఖ్యానిస్తే తేలే సంగతు లివీ ! అన్నీ అనుమానాలే ఆమెను గూర్చి !!

కాని ఈ హేయమైన దృష్టి, అన్యాయమైన వూహా అతనికి ఎంతో దుర్భరంగా ఉన్నాయి .... ఒకవైపు ఆమె మీద అభిమానమూ, గౌరవమూ, ఆరాధనా భావమూ, 'సత్య' మిది కాదు, మళ్లీ ఆలోచించమంటూ పైరకపు దృష్టిని ప్రతిఘ టించి తీవ్రంగా ఘర్షణ పడుతున్నాయి..... అపురూపమైన స్నేహానుబంధాన్ని త్రెంచవద్దని ఆమెను తనే ఎన్నోసార్లు ప్రాధేయపడ్డాడే ! ఎంత అరమరికలేని అభిమానం కాకపోతే అంత సన్నిహితంగా ప్రవర్తిస్తుం దామె ? దాన్ని కలుషితం చెయ్యటమేనా ? ఆమె చేష్టలలో అసభ్యత తనకు తోచనైనా లేదే ! ఆ అనుభవంలోని పవిత్రత, ఉదాత్తత, అనుభవైక వేద్యమే గాని, యితరులకు—సంఘానికి—ఎలా నిరూపించి చెప్పటం ? సాధ్యంకాదే !

మహాబలిపురం నుంచి వచ్చిన సాయంత్రం తను ఏమనుకున్నాడు ? చంద్రావతి వ్యక్తిత్వం ఒక మెరుపుతీవ; ఆమె మేధాశక్తి అందుకునే ఆకాశపుటంచులు, తీసే సముద్రపు లోతులు తనకు అందవు. అయితేనేం ? ఆమె ఒక తరగని సత్యం. ఆమెమీద తన కెప్పుడూ విశ్వాసం సడలకూడదు అను కున్నాడే, ఇప్పుడా విశ్వాసాన్ని పోగొట్టుకోవటమేనా ?

శ్రీధర్ యిలా విశ్వాసం—అవిశ్వాసం మధ్య వూగిస లాడుతూనే ఉన్నాడు..... ఒకసారి యిటు, ఒకసారి అటు .... ఏకాంతంగా ఉన్నప్పుడు చంద్రావతి ఉజ్జ్వలమూర్తీ, ఆమె మాటలూ, విజ్ఞానమూ, ఆమె ఆదరాభిమానాలూ జ్ఞాపకం వచ్చి తను 'విశ్వాసం'లో నిలిచి ఉంటాడు .... కాని, కాలేజీకి వెళ్లినప్పుడు సహాధ్యాయులతో మాట్లాడవలసి వచ్చినప్పుడూ, చంద్రావతి పదిమందిలో క్లాసులో కనిపించినప్పుడూ ఆమె మీద వైముఖ్యం రేకెత్తి 'అవిశ్వాసం' లో పడిపోతున్నాడు. ఆమె తననేదో వంచించినట్లనిపిస్తోంది అతనికి ఆ సమయంలో.

ఇదంతా అప్రయత్నంగానే అతనిలో జరుగుతున్నది. మనస్సులోని ఈ ఆకర్షణా, అపకర్షణా బొత్తిగా తన స్వాధీనంలో లేకపోవటంతో, ఇదొక ఎడతెగని అలజడిగా రూపొంది ఆలోచనకూ వూహకూ విరామం అంటూ లేక పోతోంది. ఏం చేస్తున్నా, దేనిమీద మనస్సు లగ్నం చెయ్య బోయినా, నేపథ్యంలో చంద్రావతి సమస్య ప్రజ్వలిస్తూనే ఉంది .... ఈ సందిగ్ధావస్థ నుంచి ఏదో విధంగా బయట పడా లనే ప్రయత్నిస్తున్నాడు .... సాయంకాలం గిండీ వైపు రోజూ ఒంటరిగా షికారు వెళ్లటం—ఆలోచనల్ని బేరీజు వెయ్యటం, ఒక నిశ్చయానికి రావటానికి ప్రయత్నించి చివరకు రాలేక పోవటం, నిత్యం జరుగుతోంది. ఏమైనా పోయిన మనశ్శాంతి మళ్లీ లభించలేదు శ్రీధర్‌కు.

చంద్రావతిని తప్పించుకుని తిరగటమే కాదు, టౌన్ వైపూ సినిమాలకూ వెళ్లటమే మానుకున్నాడు శ్రీధర్ పది రోజులుగా.

ఒక సాయంత్రం మసకచీకటిలో మామూలుగానే షికారు నుంచీ గిండీ రోడ్డులో నడచి వస్తున్నాడు ఒంటరిగా. సైదా పేట బ్రిడ్జి సమీపించేటప్పటికి ఎదురుగా వస్తూన్న ఒక మనిషి మొరటుగా శ్రీధర్‌మీద తూలిపడ్డాడు.

"ఏయ్, చూచి నడవరాదూ !" అన్నాడు శ్రీధర్ మంద లింపుగా.

"ఎన్న పేశరే ? ఇంద రోడ్ నీ సొంతంవా ? నీ అబ్బ సొంతంవా ?" అన్నాడు వాడు నిలబడి దురుసుగా.

శ్రీధర్‌కు కోపం వచ్చింది.

"ఏయ్, ఏమిటా వాగుడు ? మర్యాదగా మాట్లాడ వోయ్, తాగావా ఏమిటి ?" అన్నాడు శ్రీధర్ దగ్గరగా వెళ్లి.

"మరియాదా ? ....పెరియ ఆళ్ ! నీ యార్దా ఎనక్కు తెరియాదా !" అంటూ ఎగతాళిగా నవ్వుతూ మీదికి వచ్చి, కళ్లురిమిచూస్తూ ముఖంలో ముఖంపెట్టి, జబ్బలు తడువు కుంటున్నాడు వాడు.

శ్రీధర్‌కు త్రాగుడు వాసన కొట్టింది .... తాగిన వాడితో పేచీ ఏమిటనిపించింది అతనికి. "సరి సరి పో" అంటూ అక్కడినుంచీ కదలబోయాడు. వాడు శ్రీధర్ షర్టు పట్టుకుని లాగుతూ "మరియాద సొల్రె? మూంజి పార్....

నీ ఎంగె పోరె ? మాంబళంవా? మాంబళం ఎందు క్కాడా ?... సాలా, అప్రం .... ముత్మాల్ సాలా !" అంటూ గబగబా కాలర్ పుచ్చుకున్నాడు.

శ్రీధర్ వాణ్ణి గట్టిగా చెంపమీద ఒకటి పెట్టి విదిలించేశాడు. వాడు శ్రీధర్‌మీద కలియబడ్డాడు. ఇంతలో యిద్దరు వ్యక్తులు పరుగెత్తుకుంటూ వచ్చి, విడదీసినట్లే విడదీస్తూ శ్రీధర్ చేతుల్ని గట్టిగా పట్టుకున్నారు. మొదటి వాడు శ్రీధర్‌మీద విజృంభించాడు. శ్రీధర్ వదలించుకో ప్రయత్నించాడు. లాభంలేకపోగా ముగ్గురూ అతనిమీద కలియబడ్డారు. శ్రీధర్‌కు అర్థమైంది, వాళ్లు ముగ్గురూ ఒక జట్టేనని .... శ్రీధర్ ఇంక లాభంలేదని పోట్లాట్టం మాని రోడ్డుమీద చప్పగా చతికిలపడ్డాడు. మొదటివాడు శ్రీధర్‌ని పైకి గుంజి కొట్టబోతూఉంటే మిగతా యిద్దరిలో ఒకడు వాణ్ణి వారించాడు..... తర్వాత వాడు శ్రీధర్ నుద్దేశించి—

"ఏమి బుద్ధిదా వచ్చిందా ? నువ్వుదా స్టూడెంటు, నీకు ఆండవాళ్లతో కార్లో, టాక్సీలో సుట్టటం ఏందా పని ? నువ్వు దా యారని తలిస్తివి ? దొర సెప్పినారు జాగత్త .:.... సందరావతి అమ్మాళ్ తో దా మాట్టాడినావా, నిన్ను ఈ ఏట్లోదా పూడ్చిపెడ్తాము .... లే, లే, లేచి పో....ఇద్దా వార్నింగ్ ...."

కొట్టినవాళ్లు ముగ్గురూ గబగబా వెళ్లిపోయారు. కొంత దూరంలో రోడ్డు ప్రక్కగా సైకిళ్లున్నాయి. అవి ఎక్కి శ్రీధర్ చూస్తుండగానే వాళ్లు మాయమయ్యారు.

వాళ్లు అకస్మాత్తుగా తనమీద కలయబడటం కంటె, వాళ్లు బయటపెట్టిన ఉద్దేశం శ్రీధర్‌ని ఆశ్చర్యంతో విమూఢుణ్ణి చేసింది ......

ఈ సంఘటనకూ చంద్రావతికీ సంబంధమా ?

ఈ మనుషుల్ని పంపిన 'దొర' ఎవరు ? చంద్రావతి భర్త ? మహాబలిపురం వెళ్లినరోజు అతను రంగూన్ వెళ్లాడని చెప్పిందే చంద్రావతి ..... ఎన్నోసార్లు అతన్ని కలుసుకుందామనే తను ప్రయత్నించాడే. అతనికీ అపోహ తన్ను గూర్చీ, భార్యను గూర్చీ ఎలా కలిగింది ?

కాదు, కాదు, దీనికి కారణం సత్యనారాయణా పేరి శాస్త్రి ! వాళ్లే యీ రౌడీలను పంపించి ఉంటారు ఈర్ష్యా భావంతో .... ఏమో !

తనిప్పు డేం చెయ్యాలి? ప్రతీకారం చెయ్యాలా ? ...

హాస్టలుకు చేరుకునే వేళకు శ్రీధర్ క్రమంగా ఈ విషయము ఇంతటితో మరచిపోవటమే ఉత్తమం అనే నిర్ణయానికి వచ్చాడు.....

ఆ రాత్రే, ఎన్నాళ్ల తర్వాతో, పాఠ్యపుస్తకాలు తెరచి శ్రద్ధగా చదవటం ప్రారంభించాడు ఆలోచనకు స్వస్తిచెప్పి .... ఎన్నడూ కుదరని ఏకాగ్రత ఆరోజు కుదరటం అతనికే వింతగా ఉంది.

ఒకరోజు లైబ్రరీలో పుస్తకాలు చూస్తుండగా చంద్రావతి శ్రీధర్ దగ్గరగా వచ్చి పలకరించింది : "చదువుమీద శ్రద్ధ అంత ఎక్కువయిందా ఏమిటి, దర్శనమే లేదు ?..... సినిమాలు కూడా మానేసినట్టేనా ?"

"అవును .... తీరిక లేదు ...." అన్నాడు ముక్తసరిగా.

చంద్రావతి అతనివైపు ఆశ్చర్యంగా చూచి, తర్వాత పుస్తకాలు పరిశీలించటంలో నిమగ్నురాలైంది. కొన్ని క్షణాలు అక్కడే తచ్చాడి శ్రీధర్ బయటికి వెళ్లిపోయాడు.

ఆమెతో తను మాట్లాడిన తీరు, యిచ్చిన సమాధానమూ అతనికే తృప్తిగా లేవు. చాలసేపు మళ్లీ మళ్లీ తర్కించుకున్నాడు. కాని, ఇంకోవిధంగా ఏమని సమాధానం యిచ్చివుంటే బాగుండేదో అతనికి తట్టనే లేదు..... ఆమెతో ఎక్కువగా మాట్లాడటానికీ, వివరించి చెప్పటానికీ అది తగిన చోటు కాదాయె ! తర్వాత అనిపించింది—ఆమెకూ, తనకూ ఏమిటి సంబంధం ? తను రుక్మిణమ్మకూ ఆమెకూ పోలిక పెట్టటం కూడా కేవలం ఒక భ్రమ, అసలు ఎక్కడా పోలికే లేదనిపించింది తర్కించి చూసేకొద్దీ ! రుక్మిణమ్మ చంద్రావతిలా ఎన్నడైనా మాట్లాడగలదా ? ఇద్దరినీ పోల్చటంలో అర్థంలేదు !

శ్రీధర్‌కు ఆ రాత్రి ఒక కల వచ్చింది .... చనిపోయిన సీత "చీ బాబాయ్ !" అని పిలుస్తూ ఏమిటో చెప్పటానికి ప్రయత్నిస్తోంది .... శ్రీధర్ సీత మాటలు వినిపించుకోకుండా సీత ఎలా తిరిగి వచ్చిందా అనే ఆశ్చర్యపోతున్నాడు :

"చీ బాబాయ్ ! నన్ను కొట్టావే, అమ్మ చెబితే కొట్టొచ్చా ? ఏదీ అమ్మ ? .... అమ్మ ..... అమ్మ ..... చచ్చిపోయింది బాబాయ్ !" చేతులు వట్టిగా త్రిప్పి చూపుతూ 'చచ్చి' అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ అదేమాట మూడు నాలుగుసార్లు చెబుతోంది సీత.

"నువ్వెలా వచ్చావ్ ? నువ్వు కాదూ చచ్చిపోయింది?" అడగటం మెలాగా అని సందేహిస్తూనే చివరకు అడిగాడు ఆ ప్రశ్న.

"ఊహూ .... అదిగో...... అక్కడ ..... అమ్మ ...." శ్రీధర్ సీతతో బయల్దేరాడు .... ఇంట్లోనుంచి బయటికి వీధిలోకి వచ్చి చూశాడు .... అప్పుడే వర్షం వచ్చిందేమో, వీధిలో మురుగుకాల్వలో నిండుగా ఎర్రటి వర్షపునీళ్లు జోరుగా పోతున్నాయి ..... సీత ఆ నీళ్లని చూపిస్తూ "అమ్మ .... అమ్మో ..... యీ ఏట్లో పడి చచ్చిపోయింది !" అంటోంది.

శ్రీధర్ గట్టిగా నవ్వుతూ ఏడుపుమొహం పెట్టిన సీతని చేతుల్లోకి ఎత్తుకున్నాడు ..... నవ్వుతూనే ఉన్నాడు .. గట్టిగా నవ్వటంతో మెలకువ వచ్చేసింది అతనికి.

"ఏమిటి నిద్దట్లో నవ్వుతున్నారు ?" అంటున్నాడు రామారావు.

"ఏదో కల .... మా అన్నయ్యకూతురు సీత కలలోకి వచ్చింది. ఆ అమ్మాయి చనిపోయి కొన్ని మాసాలైంది.... ఎందుకో కలలో కనిపించి వాళ్లమ్మ చనిపోయింది అని చెబుతూ మురుగుకాలవని చూచిస్తోంది .... అందుకే నవ్వాను .... ఏమిటో మరి, రేపు యింటికి ఉత్తరం వ్రాయాలి !"

శ్రీధర్ తండ్రికి ఉత్తరం వ్రాశాడు.

## 13

శ్రీధర్‌కు తండ్రి దగ్గరనుంచీ ప్రత్యుత్తరం వచ్చింది. ఇంట్లో అందరూ క్షేమం, వదినె రుక్మిణమ్మకు ఆరోమాసం. వంట్లో నలతగా ఉండి యింటిపనులు చేసుకోలేక పోతోంది. వీలైతే తారను మదనపల్లి రమ్మని వ్రాయవలసిం దంటూ శ్రీధర్‌కు వ్రాశా రాయన. డిసెంబరు సెలవుల్లో అతన్ని యింటికి రమ్మన్నారు.

వదినె గర్భవతి అనే వార్త శ్రీధర్‌కు సంతోషం కలిగించింది. వెంటనే తారకు ఉత్తరం వ్రాశాడు. మదనపల్లి బయల్దేరమనీ, తనొక పది రోజుల్లో సంక్రాంతి సెలవులకు అక్కడికి వస్తాననీ వ్రాశాడు. తార జవాబు వ్రాస్తూ తను యిప్పట్లో మదనపల్లికి రావటానికి వీలుపడదనీ, తన తల్లికి ఆరోగ్యం బాగుండటంలేదనీ తెలియజేసింది.

శ్రీధర్‌కు తారమీద కోపం వచ్చింది. ఆమె చూపించిన కారణం కేవలం ఒక నెపం తప్ప నిజంగా తార తల్లికి జబ్బేమీ ఉండదనే అతని నమ్మకం.

సంక్రాంతి సెలవులకు మనదపల్లి వెళ్లాడు శ్రీధర్.

రుక్మిణమ్మ చాలా నీరసంగా, వంట్లో బొత్తుగా వోపికలేని స్థితిలో ఉంది. పుట్టింటివైపు నుంచీ ఆమె అమ్మమ్మకు చెల్లెలి వరుస అయిన ఒక ముసలావిడను సాయం తెచ్చుకున్నది. ఆ పరిస్థితుల్లో రామలింగయ్యగారికి సరియైన సదుపాయం జరగటంలేదు. కాని వేసవిలో వచ్చినటువంటి ఉద్ధృత పరిస్థితి మళ్లీ రాలేదనీ, నెమ్మదిగానే ఉందనీ చెప్పా రాయన.

శ్రీధర్‌కు ఇంటి పరిస్థితి చాల దుఃఖాన్ని కలిగించింది. తనకు వివాహమై ఉండి కూడా, తన భార్య యీ సమయంలో ఆదుకోలేక పోవటం అతన్ని ఖిన్నుణ్ణి చేసింది. రుక్మిణమ్మతో ఆమాటే అన్నాడు శ్రీధర్.

"ఎక్కడికి ప్రాప్తమో అంతేనయ్యా! లోపల కలగాలి గాని బలవంతం చేస్తే ఒకరు చెబితే వచ్చేవి కావు అపేక్షలు. కోరుకుని ఏం లాభం? పైగా మీ అత్త చలవ నీ భార్యమీద ఉండనే ఉందాయె .... నువ్వు చదువు పూర్తిచేసుకొని రా చూద్దాం ...." అన్నదామె.

కాని అతనికి తారలోనే ఆ గుణం లోపించినట్లనిపించింది. మన బంగారం మంచిదైతే కంసాలిని ఆడిపొయ్యటమెందుకు? మంగమ్మత్త ప్రభావం ఏం చేస్తుంది, తారకు తన కర్తవ్య మేమిటో గట్టిగా తెలిస్తే!

ఆ సెలవుల్లో ఒకరోజు చలమయ్యను కలుసుకున్నాడు శ్రీధర్. చలమయ్య చాలసేపు రాజకీయాలు, సంఘంలోవుండే వర్గభేదాలు, మార్క్సిజమ్ గురించి ప్రసంగించాడు. ఇది అతనిలో ఒక క్రొత్త పరిణామంగా తోచింది శ్రీధర్‌కు.

"రాజకీయ స్వాతంత్ర్యం సిద్ధించింది దేశానికి: ఇక ఆర్థిక స్వాతంత్ర్యం అంటే వర్గ సమానత్వం ఎప్పుడు ఎలా సాధించాలనేదే ముందు ప్రశ్న శ్రీధర్! నిజానికి కమ్యూనిజమంటే మనమేదో అపోహలు పెట్టుకున్నా మిన్నాళ్లూ. చూడు మనలో మాట, నీకూ, నాకూ కమ్యూనిజమ్ వస్తే పోయేదేమీ లేదు, మన సంకెళ్లుతప్ప. మనం కష్టజీవులం శ్రీధర్!" అన్నాడు చలమయ్య.

చలమయ్య కమ్యూనిస్టుపార్టీవైపు మొగ్గుతున్నాడని గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు: "పోనిద్దూ, రాజకీయాల గొడవ! ఇంకేమైనా సంగతులుంటే చెప్పు!" అన్నాడు శ్రీధర్.

"విశేషా లేముంటాయ్ మన ఊళ్లో...బహుశా నువ్వీపాటికి వినే ఉంటావు—లెక్చరరు శేషాద్రి కూతురు లేదూ సుజాతని వెధవముండ, చూట్టానికి దిట్టంగా ఉంటుంది, మహిళామండలి కార్యదర్శినిగా ఊళ్లో తిరుగుతూ ఉండేది, అది లేచిపోయిందట, వంటవాడితో......ఇరవై రోజులైంది, వూరంతా అనుకోవటమే!" తృప్తిగా నవ్వుతున్నాడు చలమయ్య.

"అయ్యయ్యో! ఎంత అప్రతిష్ఠ శేషాద్రిగారికి!"

"ఏంజేస్తాడు? మరి థియోసఫిస్టూ, పెద్దగా కబుర్లు చెబుతాడూ, ఆ పిల్లకు ఎప్పుడో మళ్లీ పెళ్లి చెయ్యాల్సింది!...... అన్నీ బూర్జువా కబుర్లు....ఈ వూళ్లో ఆయ నీమధ్య ఒక పెద్ద రియాక్షనరీగా తయారయ్యాడులే......పంచాయతీబోర్డు ఎలక్షన్లలో తన కెందుకు జోక్యం చెప్పు!"

"పెద్దవాడు, ఆయన్ని గూర్చి అలా అనటంలో అర్థం లేదు చలమయ్యా!"

"ఏమిటయ్యా పెద్ద? అందరూ పెద్దవాళ్లే! మర్యాద పేరిట బురఖా వేసుకుని తిరిగే రియాక్షనరీస్ బ్రతుకు ఇలానే బయటపడుతుంది.....ఆ కాలం వచ్చేసింది!"

చలమయ్య తత్త్వం చాలా దూరమే పురోగమించిందే! అనుకున్నాడు శ్రీధర్. బి. ఏ. పరీక్షకు ప్రైవేటుగా చదువుతూ ఎన్నెన్నిసార్లు శేషాద్రిగారి సహాయ్యం అర్థించలేదు చలమయ్య! ఆ విశ్వాసం తాలూకు గౌరవమూ సానుభూతీ అయినా లేదే అని బాధపడ్డాడు. ఏమీ సమాధానం చెప్పకుండానే ఆ ప్రసంగం అంతటితో కట్టిపెట్టి లేచాడు శ్రీధర్.

శేషాద్రిగారి ఇంటికి వెళ్లాడు శ్రీధర్. ఇల్లు తాళం వేసివుంది. విచారించగా రెండు నెలలు సెలవు తీసుకుని బెంగుళూరు వెళ్లారని తెలిసింది.

సెలవులైపోగానే మద్రాసు తిరుగు ప్రయాణం కట్టుతూ శ్రీధర్ ఓబయ్యమామ దగ్గర మరొక అయిదు వందలు పుచ్చుకున్నాడు యధాప్రకారం నోటు వ్రాసి......

శ్రీధర్ తిరిగివచ్చేటప్పటికి అతనికొక అచ్చొత్తిన ఆహ్వానమూ, దానితోబాటు చంద్రావతి స్వయంగా వ్రాసిన లేఖా ఎదురు చూస్తున్నాయి.

"శ్రీధర్,

మా అబ్బాయి సురేష్ పుట్టినరోజు 17 వ తేదీన పార్టీకి ఆహ్వానం ఇందువెంట పంపాను. సెలవులు 15 వ తేదీవరకే కాబట్టి నువ్వు ఆపాటికే మదనపల్లినుంచీ వస్తావనీ, పార్టీకి తప్పక రాగలుగుతావనీ ఆశిస్తున్నాను.

ను వ్వెన్నోసార్లు అడిగిన నీ మేనల్లుణ్ణి చూపించటమే కాదు, మావారినీ పరిచయం చేస్తాను, ఏం? చంద్రావతి"

పార్టీకి వెళ్లటమా? వద్దా అన్న ప్రశ్న ఎదురైంది. ఎందుకు వెళ్లటం; వెళ్లి లేనిపోని అసూయలకూ, అనుమానాలకూ అవకాశం ఇవ్వటం? చంద్రావతి మిగతా సహాధ్యాయుల్ని ఆహ్వానించిందేమోనని చూశాడు కాని ఎక్కడా ఆ ప్రసక్తే వినిపించలేదు......తను స్వయంగా వెళ్లకపోయినా పిల్లవాడికేమైనా పంపించవలెనని నిశ్చయించాడు చివరకు.

బజారువెళ్లి ఎన్నో వస్తువులు చూచాడుకాని ఏదీ నచ్చలేదు. అబ్బాయికి నాలుగు పూర్తయి అయిదు వచ్చింది. ఏమిస్తే బాగుంటుంది? చివరకు "వ్యూమాస్టర్" అనే దాన్ని—సినిమా బొమ్మలలాగ ప్రపంచంలో వింత దృశ్యాల సెల్యూలాయిడ్ ఫిల్ముల్నిచూచే 'దర్శిని'—కొన్నాడు. చంద్రావతికీ, తనకూ సినిమాలంటే సరదా. దాన్ని ఈ వస్తువు గుర్తు తెస్తుందని వూహించుకున్నాడు. పిల్లవాడికీ సరదాగానూ విజ్ఞానదాయకంగానూ ఉంటుంది.

పదహారోతేదీ దాన్ని పార్శెలుకట్టి రిజిష్టర్డుపోస్టులో చంద్రావతికి పంపాడు. అందులో "ఆశీర్వాదాలూ, శుభాకాంక్షలూ" అని వ్రాసి సంతకం చేశాడేకాని, తను స్వయంగా హాజరుకాకపోవటానికి కారణమేమీ వివరించలేదు.

తర్వాత వారం రోజులపాటు శ్రీధర్ లైబ్రరీకి కూడ వెళ్లలేదు. అక్కడ చంద్రావతి కనిపించి 'ఎందుకు రాలేదని' ప్రశ్నిస్తే ఏమి జవాబు చెప్పాలో తెలీకపోవటమే అందుకు కారణం.

ఒక ఆదివారం ప్రొద్దున ఎనిమిదిగంటలకు శ్రీధర్‌కోసం మనిషి వచ్చాడు. తను చంద్రావతివాళ్ల కారుడ్రైవరుననీ, చంద్రావతీ, ఆమెభర్తా ఆరోజు శ్రీధర్‌ని మధ్యాహ్నం భోజనానికి ఆహ్వానిస్తూ తనని పంపారనీ చంద్రావతి వ్రాసిన చీటీ యిచ్చాడు. తను మళ్లీ 11 గంటల తర్వాత కారు తీసుకొని వస్తానని కూడా చెప్పాడు. శ్రీధర్ సరేనని చెప్పి అతణ్ణి పంపించివేశాడు.

అతను వెళ్లిన తర్వాత ఎలా తప్పుకోవటమా అని ఆలోచించాడు. మార్గం కనిపించలేదు. ఇప్పుడేదో వంకపెట్టి తప్పించుకొన్నా తర్వాతనైనా చంద్రావతితో వెళ్లలేకపోయినందుకు కారణమేమిటో చెప్పి క్షమాపణ కోరవలసిన పరిస్థితి అనిపించింది శ్రీధర్‌కు. వస్తానని చెప్పి వెళ్లకపోవటం, తర్వాత ఆమె ముఖమే చూడకపోవటం, నిష్కారణంగా, దారుణంగా అవమానించటమే అవుతుంది. అలా చెయ్యటానికి అతనికి మనస్కరించలేదు.

పదకొండుగంటలకు అట్టహాసంగా కారు రావటం, తను అందులో వెళ్లటం, అది హాస్టలులోవాళ్లు చూడటం, వ్యాఖ్యానించటం, తలచుకుంటే ఒళ్లు కంపరమెత్తుతోంది. అందువల్ల వేళకు ముందుగానే చంద్రావతి ఇంటికి తరలివెళ్లిపోవటమే ఉత్తమమార్గం అని ఆలోచించి పదింటికే శ్రీధర్ చంద్రావతి ఇంటికి వెళ్లాడు.

చంద్రావతి వంటింట్లో వుంది. శ్రీధర్ వచ్చాడని తెలీగానే వచ్చి "పైకి పోదాం" అని మేడమీదికి తీసుకువెళ్లింది. పుట్టినరోజు పండుగకు హాజరవటానికి వీల్లేకపోవటాన్నిగూర్చి శ్రీధర్ రెండు పొడిమాటలు చెప్పాడు.

"అందుకు బదులు తీర్చటానికే కాబోలు, పదకొండుదాకా
అంటే కారుకోసం ఆగకుండా ముందుగానే రావటం! నిజమేనా"
అన్నది చంద్రావతి నవ్వుతూనే కొంత నిష్ఠూరంగా.

"అతిథి సమయముకు చాల ముందుగా రావటం పొరపాటే
నని నేనూ ఒప్పుకొంటాను......ఇప్పుడేం చెయ్యమంటావు?"
అన్నాడు నొచ్చుకుంటున్న ధోరణిలో శ్రీధర్.

"అసలు పొరపాటు నువ్విన్నాళ్లూ రాకపోవటం! దాన్ని సర్దుకోవటానికి ఏంచేసినా ఫరవా లేదులే!......నిజానికి నువ్వు ముందుగానే వస్తావనీ, కారు పంపే మర్యాదకోసం ఆగవనీ వూహిస్తూనే వున్నాను శ్రీధర్! నీవు యిలా రావటమే నా ఊహకు సరిగ్గా ఎంతో బాగుంది నాకు! బాబూ, వాళ్లనాన్నా, స్నేహితులింటికి వెళ్లారు, ఇంకో అరగంటలో వస్తారు, కూర్చో......"

శ్రీధర్ కూర్చున్నాడు. చంద్రావతి అతను మాటాడితే వినాలన్నట్లుగా కుతూహలంగా ఎదురు చూస్తోంది. కాని శ్రీధర్ యిటూ అటూ చూచి బల్లమీదవున్న పత్రిక చేతికి తీసుకున్నాడు. అది చూచి చంద్రావతి "ఇప్పుడే వస్తాను" అంటూ క్రిందికి వెళ్లింది.

ఆమె వెళ్లగానే పత్రిక బల్లమీదపెట్టేసి, ఆమె ఖాళీ చేసిన కుర్చీని చూస్తూ, మనస్సుని చక్కబెట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

చంద్రావతిని చూడగానే,ఆమె ఆప్యాయంగా అన్నమాటల్ని వినగానే, అతనిలో మరణించిన ఒక విశ్వాసం దెబ్బతిని మూర్ఛపోయిన ఒక అనుభూతి పునరుజ్జీవితమై కదిలింది.....తనేదో తప్పు చేసినట్లు మనస్సులో కొఱతా, తను చేసిన తప్పేమిటన్న ఎదురుప్రశ్నా, ఈ భావాలన్నీ కేవలం అప్రస్తుతమన్న హెచ్చరికా అతనిలో తడబాటు కలిగించాయి......" అసలు పొరపాటు నువ్విన్నాళ్లూ రాకపోవటం అన్న ఆమె వాక్యం రింగుమంటూ అతనిలో "తనది పొరపాటా? ఎవరిది పొరపాటు?" అనే మీమాంసను రేకెత్తించింది.

చంద్రావతి రెండు గ్లాసుల్లో షర్బత్ తీసుకుని వచ్చి ఒకటి అతనికిచ్చి ఒకటి తను తీసుకున్నది.

"శ్రీధర్! నిజానికి నీ గురించికాదు, నావల్ల పొరపాటేమైనా జరిగిందేమోనని అడిగి తెలుసుకొని క్షమాపణ చెప్పటానికే నిన్ను ఆహ్వానించాను, తెలుసా?" అన్నది చంద్రావతి.

ఆమె పొరపాటేమిటో, దానివల్ల కలిగిన ఫలితాలేమిటో చెబుదామని నోటిదాకా వచ్చినా ఆగిపోయాడు శ్రీధర్. ఆమె అలా నిష్కల్మషంగా అతని ముఖంలోకి చూస్తూవుంటే అతనికి నోట మాటే రాలేదు......మనస్సూ మారింది.

"ఏమీ లేదే!" అన్నాడు అన్ని సందేహాలూ దిగమ్రింగి.

"మరెందుకు రావటం మానుకున్నావ్?"

"తీరుబాటు లేక. . . . . చదువుకుంటున్నాను కొంచెం శ్రద్ధగా. అదీగాక మనం లోకంలో వుండే సిద్ధాంతాలన్నీ సమగ్రంగా ఇదివరకే చర్చించివేశాం కదా, ఇంకేమీ మిగల్లేదు కూడా!"

చంద్రావతి నవ్వేసింది.

"నిజమే! కాని ఎప్పుడూ నా గొడవతో నేను సతమత మవుతూ నీ కెక్కడ బాధ కలిగించానో అనీ అనుమానం కలిగింది......ఆరోజు మహాబలిపురం వెళ్లినరోజున నా మూడ్ బాగులేదు.....నిన్నేదో తీవ్రంగా విమర్శించాను కూడా...... తర్వాతనే నువ్వు రావటం మానేశావ్......అందువల్ల......"

"ఇప్పు డెలా వుంది మూడ్? నువ్వు మీ అబ్బాయిని తీసుకు వచ్చెయ్యటం ఎంతో బాగుంది...అలా చెయ్యమని నే నెన్ని సార్లు చెప్పలేదు?"

"అలా కాదులే!......శ్రీధర్, నీ కో రహస్యం చెప్పనా?"

"ఏమిటి?" అన్నాడు పసిపిల్లవాడికిమల్లే గోముగా కుతూహలంగా ఆమె కళ్లల్లోకి చూస్తూ సర్వమూ విస్మరించి...

"పెద్ద రహస్య మేమీ కాదు. కేవలం నాకు సంబంధించిందే. కాని నీకు చెప్పాలనిపించింది, అందుకే నిన్ను ప్రత్యేకంగా పిలిచాను. పిలవకపోతే నువ్వు ఇక రావేమో అనుకున్నాను కూడా......నా మూడ్ ఇప్పుడు బాగుండటానికి కారణం నాలో వాడిపోయిం దనుకున్న విశ్వాసం మళ్లీ చిగురెత్తి బ్రతకటమే!......కొన్నాళ్లుగా మావారి ప్రవర్తన విపరీతంగా మారిందన్నాను కదూ నీతో.....నిజానికి అందు క్కారణం ఒక స్టెనో సీతాకోక చిలుక..... చివరకు అది బాగా దగాచేసి పారిపోయిందిలే! ఇప్పు డదంతా మరచి పోవటానికి ప్రయత్నం జరుగుతోంది......కాని ఆ పీడకల జరిగి నన్నాళ్లూ నాకు సంఘ వ్యవస్థమీదా, మనుష్యులమీదా నమ్మకం చెదిరిపోయింది శ్రీధర్! నేను పిచ్చిదాన్నే అయ్యాను. ఏ విశ్వాస మైనా అవిశ్వాసమనే అగ్నిపరీక్షలో కృతార్థత పొందితేగాని దాని విలువ, దాని నిజ స్వరూపం బయటపడదు కాబోలు శ్రీధర్!..... ఆ పరిస్థితుల్లో నువ్వే లేకపోతే ఏమైపోయేదాన్నో! మనలో విశ్వాసాలు కూడా కొన్ని సంఘటనలనుబట్టి, మనకు సంబంధించిన వ్యక్తుల్నిబట్టి జీవిస్తాయి, మరణిస్తాయి......పరిస్థితిలో ఇప్పుడీ మార్పు జరగకపోతే నే నేమైపోయేదాన్నో నాకే తెలీదు...... మహాబలిపురంనుంచి తిరిగివచ్చిన ఆ సాయంత్రం ఎంత నిస్పృహలో ఉన్నాను! ఆ మరుసటిరోజే బర్మానుంచి వారు తిరిగి వచ్చారు. కథ మలుపు తిరిగింది......కానీ......" చంద్రావతి ముగించలేదు. కారు వచ్చి ఆగిన శబ్దం వినిపించింది. ఆమెలేచి నిల్చుంది.....

"క్రిందికి పోదాంపద, బాబూ, ఆయనా వచ్చారు" అంటూ గబగబా క్రిందికి తీసుకుపోయింది శ్రీధర్‌ను.

చంద్రావతి భర్త ప్రకాష్ చామనలుపే అయినా స్ఫురద్రూపి, అందమైనవాడు. కలుపుగోలుతనం చూపించాడు. చంద్రావతి కొడుకు సురేష్ చలాకీగా చక్కగా ఉన్నాడు. ఎక్కువగా తల్లి పోలికలు వచ్చాయి. శ్రీధర్ బహుమతిగా పంపిన 'వ్యూమాస్టర్' తీసుకొచ్చి కబుర్లు చెప్పాడు.

తర్వాత భోజనాలు.

ఆ కుటుంబం శ్రీధర్‌ని ముద్దుణ్ణి చేసింది. భోజనం కాగానే ప్రకాష్ ముక్తసరిగా సెలవు తీసుకొని మేడమీదకు వెళ్లిపోయాడు.

"ఆయన కార్యక్రమం ఎప్పుడూ తంచనుగా ఉంటుంది. ఆదివారం భోజనానంతరం విశ్రాంతీ, ఫలానా చదవాలి, ఫలానా కాగితాలు చూడాలి అని పెట్టుకుంటే అది జరగాల్సిందే. వాయిదా మాత్రం పడదు. అది అలవాటు" అంది చంద్రావతి.

సుమారు ఒకగంటసేపు అక్కడేవున్నా, చంద్రావతి తోనూ, సురేష్‌తోనూ మాట్లాడుతూవున్నా శ్రీధర్ మనస్సు మాత్రం అక్కడలేదు......చంద్రావతి పూర్వపు ధోరణికీ, ఇప్పటి ధోరణికీ భేదం కనిపిస్తూనే వుంది. ప్రతి విషయానికీ ఒక వాదం, ఒక సిద్ధాంతం లేవదీసే ఆమె ధోరణి ఇప్పుడు బొత్తిగా మారి పోయింది......ఆమె చూపు, ఆలోచనా, ప్రతిమాటా కొడుకు వైపే ఆసక్తిగా పరిభ్రమిస్తున్నాయి......

శ్రీధర్ సెలవు తీసుకోటానికి లేచాడు. చంద్రావతి అతణ్ణి పూర్వంలాగే వస్తూఉండమని ఆహ్వానించింది. వచ్చి తనతో, కొడుకుతో ఆదివారాలు గడుపుతూ ఉండమని చెప్పింది. "అలాగే" అన్నాడు శ్రీధర్. కాని ఆ మాట వెనుక ఉండవలసిన విశ్వాసం కాని ధైర్యంకాని అతనిలో లేవు.

చంద్రావతి డ్రైవర్‌ను కేకవేసింది. శ్రీధర్, "కారు వద్దు, నేను ట్రిప్లికేన్‌వైపు వెళ్లాలి" అన్నాడు. హాస్టలుకు కారులో వెళ్లటం అతని కిష్టంలేదు.

"పోనీ, ట్రిప్లికేనుకే వస్తాడు. ఇప్పుడు కారుతో వేరే పనేం లేదు" అన్నదామె.

"సరే" నన్నాడు శ్రీధర్ విధిలేక.

గేటు దాటిన తర్వాత డ్రైవరుని "యూనివర్శిటీ లైబ్రరీకి తీసుకువెళ్ల"మని చెప్పాడు. తర్వాతనైనా చంద్రావతి డ్రైవరుని ప్రశ్నిస్తుందని తెలుసు శ్రీధర్‌కు.

కారు లైబ్రరీకి చేర్చింది శ్రీధర్‌ను.

"థాంక్స్" అని చెప్పి లోపలికి వెళ్లిపోయాడు. వెళ్లి మేగజైన్ సెక్షనులో ఒకచోట కూర్చున్నాడు.

సాయంత్రం అయిదుదాకా అక్కడే ఉండిపోయాడు ఆలోచిస్తూ.......మొదటిసారిగా అతనికి తనమీద తనకే అసహ్యం కోపం కలిగాయి......

ఆలోచించేకొద్దీ తన పిరికితనం, తను అబద్ధాలాడటం, తను ఏ విషయాన్నిగూర్చీ గట్టిగా ఆలోచించి ఒక నిర్ణయానికి రాలేకపోవటం, ఎటూ తన అసమర్థతే స్పష్టంగా కనిపిస్తోంది అతనికి.

తనకు రాజీలవల్ల జరిగిన అవమానం, తన దౌర్బల్యం, తనకు ఆమెపట్ల కలిగిన నిరసనభావం, అపోహ—అన్ని సంగతులూ వెళ్లి ఒక్కసారి చంద్రావతితో చెప్పేవెయ్యా లనిపించింది. కాని ఫలితం? చంద్రావతి తనతో స్నేహానికీ, అనుబంధానికీ ఎంతో విలువ యిచ్చింది, ఇస్తోంది!......అది ఆమె ఎప్పటికీ మరచిపోలేని విషయం......ఆ స్మృతిని వెళ్లి కలుషితం చెయ్యడమేనా?......ఆమె తనమీద చూపుతున్న విశ్వాసాన్ని చేజేతులా ఎలా నాశనం చెయ్యటం?

తను పోగొట్టుకున్న విశ్వాసాన్ని మళ్లీ పొందగలిగానని ఆనందంతో చెబుతున్నదే చంద్రావతి!......తనలోనూ ఒక ప్రగాఢమైన విశ్వాసం—ఆమెమీదా, రుక్మిణమ్మవదినెమీదా—ఉందంటూ గొప్పలు చెప్పి తీరా తనే పరీక్షకు నిలవలేకపోయిన సంగతి—పని గట్టుకుని ఎల్లి ఆమాట ఏమని చెప్పగలడు! తన అల్పత్వాన్ని ప్రస్తుతం ఆమెకు చెప్పి కించపరచుకోవటంతో లాభించే దేమిటి? తనలో వ్యక్తమైన బలహీనత ఏ విధంగాను ఇప్పుడు మాసిపోదు కద! గత చరిత్ర మారదు!

మనిషి తప్పులు చేస్తాడు......చేసిన తప్పు తిరిగిరాదు......అందువల్ల భవిష్యత్తులో అంతకంటె మెరుగ్గా ప్రవర్తించటానికి ప్రయత్నం మాత్రమే చెయ్యగలడు అనుభవం సాహాయ్యంతో....అంతకంటె చెయ్యగలిగిందీ లేదు! తనలో విశ్వాసం శక్తివంతం కావాలి!

గాంధీ సిద్ధాంతాలమీద విశ్వాసం ప్రకటించిన తను, సత్య పరీక్షకు ఏమాత్రం నిలవగలిగాడు? సమయం వచ్చి నపుడు పరీక్షకు నిలవటం ముఖ్యంకాని, ఏవో సిద్ధాంతాలను గూర్చి నమ్మకం ఉందంటూ మాట్లాడటం ముఖ్యం కాదు గద!

విశ్వాసం గట్టిలేనినాడు ప్రేమకూ, అభిమానానికీ ప్రయోజనమూ విలువా ఉండవు!

"కనిపించిన ఆదర్శాన్నీ, సిద్ధాంతాన్నీ స్వీకరిస్తావు. కాని నీలో గట్టి ఏమిటో నాకు ఇప్పటిదాక తెలీకనే పోయింది" అన్నది చంద్రావతి మహాబలిపురం వెళ్లినరోజు. సమాధానంగా తనకు ఆమెమీదా, రుక్మిణమ్మమీదా విశ్వాసం అచంచలమైందని నొక్కి చెప్పాడు ఆమెతో......ఆ విశ్వాసం ఇప్పటికీ తనలో నిలిచివున్నా, పరీక్షకుమాత్రం తను నిలవలేకపోయాడే! ఇక ఆ విశ్వాసానికి ప్రయోజన మేమిటి?

శ్రీధర్ మనస్సు మళ్లీ మళ్లీ అక్కడికే-తన దౌర్బల్యం దగ్గరికే—సుళ్లు తిరిగి వచ్చి నిలుస్తోంది......"ఏ విశ్వాసమైనా అవిశ్వాసం అనే అగ్నిపరీక్షలో కృతార్థత పొందితేగాని దాని విలువ రుజువు కాదు, శ్రీధర్" అన్న చంద్రావతి మాట ఆమె తనకిచ్చిన సందేశంలా ప్రతిధ్వనిస్తోంది......

## 14

పరిస్థితులు ఎలామారినా జీవితంలో తనకు ముఖ్యమైన విలువల్నీ, విశ్వాసాల్నీ అంటిపెట్టుకునే ప్రయాణం సాగించాలన్న నిశ్చయాన్ని తరచు జ్ఞాపకం తెచ్చుకుంటూనే ఉన్నాడు శ్రీధర్.

మద్రాసులో బి. టి. చదువు ముగిసింది. అక్కడ చంద్రావతితో పరిచయం తనలోని దౌర్బల్యం ఏమిటో పరీక్షించి సువ్యక్తం చేసింది. అందులో తను పెద్ద గుణపాఠం నేర్చుకున్నా ననుకున్నాడు. ఫలితంగా తనలో అంతకుపూర్వంలేని ఒక 'గట్టితనాన్ని' పెంపొందించుకునే ప్రయత్నంలో ఉన్నాడు శ్రీధర్.

వేసవి సెలవుల్లో (1949) బందరులో నెలరోజులు గడిపాక రుక్మిణమ్మకు మగపిల్లవాడు కలిగాడని తెలిసి శ్రీధర్ మేనెలలో తారనూ, పాపాయినీ తీసుకుని మదనపల్లి బయలు దేరాలనుకున్న ఉద్దేశ్యం నెరవేరలేదు. తార ససేమిరా తను మదనపల్లి రానన్నది. రుక్మిణమ్మ తనకేమీ అత్తగారుకాదనీ, ఆమె అజమాయిషీక్రింద బ్రతకవలసిన కర్మం తనకు లేదనీ, నిష్ఠురంగా మాట్లాడింది. శ్రీధర్‌కు కోపం వచ్చింది. మారు మాట్లాడకుండా రైలెక్కాడు. బావమరది రైలుదాక వచ్చి రెండవ తరగతి టికెట్టు తీసియిచ్చి అనునయంగా చెప్పాడు: "అసలు విషయం ఇప్పుడు తార మదనపల్లి వచ్చినా, మీరు అక్కడే ఉంటారన్న నిశ్చయం లేదుకదా! ఉద్యోగంలో ఏ వూళ్లో ప్రవేశిస్తారో ఏమో, ఆ విషయాలన్నీ నిర్ణయమైన తర్వాత ఒక్కసారే వస్తుంది తార. ఇప్పుడు మదనపల్లి రావటం మళ్లీ అక్కణ్ణుంచీ అంతలోనే కదలటం ఎందుకు లెమ్మని బద్ధకిస్తోంది, అంతే! ఆడవాళ్లమాటలకి యథాతథంగా, Literalగా, (అక్షరాలా) మనం ఎప్పుడూ విలువ యివ్వకూడదు. They Dont mean what they say" అన్నాడు మురళీమోహన్.

ఆ చివరి వాక్యంలో సత్యం ఉందని అంగీకరిస్తూ తల పంకించాడు శ్రీధర్. తన కిప్పు డిప్పుడే బోధపడుతున్న ఈ రహస్యం—ఆడవాళ్ల మాటల రహస్యం—పెళ్లికాని మురళీకి అప్పుడే ఎలా అనుభవానికి వచ్చిందా అని ఆశ్చర్యపడ్డాడు. ఏమైనా మురళీ మెడికల్ కాలేజి స్టూడెంటు కదా !—అనుకున్నాడు తనలో.

"కోపం వచ్చి తారకు ఉత్తరం వ్రాసినా వ్రాయకపోయినా నాకు వ్రాయి బావా! నేను కనుక్కుంటాను దాని సంగతి" అన్నాడు మురళీ రైలు కదులుతూండగా. శ్రీధర్ జవాబు చెప్పలేదు.

తనకు మాతృస్థానంలోవుంటూ ఆదర్శమూర్తిగా భాసిస్తున్న రుక్మిణమ్మ తారకు అంగీకార్యం కాకపోవటం—సమష్టి కుటుంబ జీవనంలో శ్రీధర్‌కున్న విశ్వాసానికి పెద్ద అఘాతమే అయింది.......అయినా తను చలించకుండా నిలబడితే కాలమే పరిస్థితిని చక్కబరుస్తుందనే అభిప్రాయానికి వచ్చాడు శ్రీధర్......

జిల్లాబోర్డు హైస్కూలులో ఖాళీలు ఉన్నాయని తెలిసి దరఖాస్తు పెట్టాడు బి. టి. అసిస్టెంటు ఉద్యోగానికి. జూన్ మొదటివారంలో పోస్టింగ్ వచ్చింది. మదనపల్లి హైస్కూల్లోనే వేశారు. తను ఆరేళ్లు చదువుకున్న హైస్కూల్లోనే ఉపాధ్యాయ పదవి లభించిందని సంతోషించాడు శ్రీధర్.

బందరునుంచీ వచ్చిన రెండు నెలల్లోనూ తార దగ్గర నుంచీ ఉత్తరమే లేదు. శ్రీధర్ చలించలేదు. తనూ వ్రాయలేదు. మురళీమోహన్ గుంటూరు వెళ్లి హౌస్ సర్జన్ చేస్తున్నాడు. అక్కడినుండి మూడు నాలుగు ఉత్తరాలు వ్రాశాడు. కాని అతనికి బందరు వార్తలు ఎంతవరకు తెలుసునో శ్రీధర్ వూహించుకోలేకపోయాడు—వార్తలంటే తార మనోవైఖరిని గూర్చిన భోగట్టా.

ఉద్యోగంలో చేరగానే మంగమ్మత్తా ఓబయ్యమామా సలహా యిచ్చారు : ఇల్లు తీసుకుని వేరు కాపురంపెట్టి తారను తీసుకురమ్మనీ, తర్వాత ఆస్తి పంపకాల విషయం ప్రయత్నం

చెయ్యమనీ......"ఏమైనాసరే, నేను వేరుకాపురం మాత్రం పెట్టను. ఇష్టం ఉంటే వస్తుంది, లేకపోతే పుట్టింటిలోనే ఉంటుంది" అని స్పష్టంగా చెప్పేశాడు శ్రీధర్ వాళ్లతో.

"అదేమిటి నాయనా, ఆ రుక్కు తల్లి ఏం మందు పెట్టిందో, ఏం మాయో, లేకపోతే ఇలా పెళ్లాం బిడ్డలమీద ఎవరైనా మమకారం వదులుకుంటారా? విడ్డూరం విచిత్రం కాకపోతే! మీ యన్న, మీ నాన్న కూడా నువ్వు చదువుకుంటానంటే కళ్లల్లో నిప్పులు పోసుకున్నారాయె. నీ కట్నం సొమ్ము నీకు దక్కకుండా దాచుకున్నారాయె. నీ వంతు ఆస్తి పూర్తిగా అనుభవిస్తూ ఉన్నారు. పైగా నువ్వు ఉద్యోగం చేసి సంపాయించే జీతం డబ్బులు కూడా వాళ్లకే చెల్లింపు అవుతూందే! ఇంతా జరుగుతున్నా వాళ్ల అడుగులకు మడుగు లొత్తుతూనే ఉంటానంటావూ? పెళ్లాం పిల్లలు అక్కర లేదంటావూ? నీ చేతగానితనానికి నాకు మతి పోతూవుంది సరీ! వలసపల్లిలో మందు కక్కించే వైద్యుడున్నాట్ట—వాణ్ణి పిలిపిస్తానుండు" అన్నది మంగమ్మత్త, బాధ్యతఅంతా రుక్మిణమ్మమీదికి నెట్టుతూ.

"అత్తా! అసలు మా కుటుంబం విషయాలు సాగదీసి ఇతరులతో మాట్లాడటం నాకు యిష్టం ఉండదు. నువ్వు చీటికీ మాటికీ వదినె ఏదో చేసిందనటమూ ఏమీ బాగా లేదు. ఈ విషయంలో నేను బాగా ఆలోచించుకునే చెబుతున్నాను. ఇందులో మందూ, మాకూ, వెఱ్ఱీ, పిచ్చా ఏమీలేదు. ఏ పరిస్థితి వచ్చినా నేను వేరుపడటంమాత్రం అసంభవం! అది నావల్ల జరిగేపని కాదు. తారకు ఇవ్వాళ బుద్ధిలేకపోవచ్చు. తాత్కాలికంగా వాళ్ల అమ్మా నాన్నా చెప్పుడు మాటలకు లోబడవచ్చు; ఎక్కడికి పోతుంది. ఇవ్వాళ కాకపోతే అది రేపేనా వచ్చి తీరుతుంది. ఆ నమ్మకం నాకుంది. ఇలాంటి విషయాల్లో సులువుగా చలించటం, లొంగిపోవటం కేవలం దౌర్బల్యం..... ఏం, నా కామాత్రం గట్టి మనస్సు లేదనుకుంటున్నారా మీరు? లేక మనుష్యుల్ని అర్థం చేసుకునే జ్ఞానమే లేదనుకుంటున్నారా? ఆస్తి అంటారా, ఆస్తి ఎక్కడికీ పోదు! మీరు అనవసరంగా చీటికీ మాటికీ నన్ను గొడవ పెట్టకండి" అన్నాడు శ్రీధర్.

"నిజమే శ్రీధర్! ఏం జరిగినా మీరూ మీరూ ఒకటే! అయితే ఆరోజు నువ్వు మద్రాసువెళ్లి చదువుకోవాలంటే వాళ్లెంత ప్రోత్సాహం యిచ్చారో, కన్నతండ్రి ఎవరిని వెనకేసుకు వచ్చాడో, ఇవన్నీ నువ్వప్పుడే మరచిపోయావన్నమాట! అదీ మంచిదే! నువ్వు చిన్నవాడివి, నీ మనస్సు అద్దంలాంటిది. ఈక్షణం అందులో కనిపించే నీడ మరుక్షణం ఉండదు, ఉండ కూడదు. కోపతాపాలు, కావేషాలు ఉండకపోవటం మంచిదే! కాని నే ననేది—న్యాయం జరగవద్దా అని? ఇద్దరన్నదమ్ము లున్నారంటే రెండు కన్నులు, రెండు చెవులూ అనుకో. అందులో ఒక కన్నుపోతే పోయిందిలే, ఒక చెవి వోడయితే అయిందిలే అనుకుంటారా ఎవరైనా? మేం అలా అనుకోలేము. అదీ మా ఆదుర్దా. అంతే. మీ కుటుంబం విషయాల్లో మేము జోక్యం చేసుకోవటం నీ కిష్టం లేదన్నావు. సరే. ఎలానన్నా మేం పరాయివాళ్లమే. పోనీ, పరాయివాళ్లంగానే వ్యవహరిస్తాము. నీ క్షేమం కోరటంవల్లే ఇప్పుడీ మాట అనవలసి వస్తోంది! నువ్వూ మీ నాన్నా అన్నా వేరుపడవలసిన అవసరం ఏమీలేదు. పరాయివాళ్ల నీ చదువు కిచ్చిన రెండువేలు మాటేమిటి? నీకు ఆస్తీ, సంసారం ఫలానా అని ఏర్పడివుంటే, నువ్వెప్పుడైనా కళ్లు తెరిచే పాటయితే, ఆ ప్రస్తావనే తీసుకురాము; నీదీ మాదీ అనే భేదమే ఉండదు! కాని నువ్వు జాయింటుగా ఉండటానికే నిశ్చయించుకున్నట్లయితే, మా డబ్బు మేం కావాలనడం న్యాయమే! దాన్ని చచ్చినా వాళ్లకు వదులుకోము! నువ్వు మీ నాన్నతోనూ మీ అన్నతోనూ సంప్రదించి ఆ రెండు వేలూ మాకు తిరిగి యిచ్చేట్టుచూడు. అంతే మేము అడగవలసిందీ, ఇప్పుడు నువ్వు చెయ్యవలసిందీ!" అన్నాడు ఓబయ్య మామ.

"అలాగే, వ్యవధి కావాలి" అన్నాడు శ్రీధర్.

అన్నాడే కాని ఆలోచిస్తే తండ్రితో ఈ సంగతి చెప్పే ధైర్యం లేదు అతనికి. ఆయన ఆరోగ్యం బాగులేని స్థితిలో ఈ సమస్యను లేవదీయటమా? 'రక్తపుపోటు' ఉన్నవాళ్లకు మానసికంగా ఉద్రిక్తత ఏమాత్రమూ పనికిరాదు. అన్నయ్య నరసింహులు తను బి. టి. పూర్తి జేసుకునివచ్చాక పూర్తిగా విముఖత్వం వహించాడు. ఎప్పుడూ పట్టుమని నాలుగు మాటలైనా మాట్లాడలేదు. మొదటినుంచీ అతను చదువుకు ప్రతికూలుడుగానే ఉండటం, తను రెండు వేలకు నోటు వ్రాసిన సంగతి ఇదివరలోనే వాళ్లతో చెప్పి ఉండకపోవటం, ఆలోచిస్తే అన్నయ్యతో వ్యవహారం సులువుగా ఉండేట్లు తోచలేదు. ఇటు మంగమ్మత్త ఎంత పెడసరపు మనిషో, అంత మేర అన్నయ్యలోనూ కోపగుణమూ, బిఱ్ఱబిగిసేతత్త్వం ఉన్నాయని తనకు తెలుసు. పోతే, ఈ వ్యవహారం వదినె ద్వారానే చక్కబడాలి.

ఓబయ్య చెప్పిన మాటల్ని యథాతథంగా రుక్మిణమ్మతో చెప్పాడు శ్రీధర్.

"నువ్వూ మామగారూ అప్పుడు నామాట పడనిచ్చారు కాదు. కాసులపేరుపెట్టి డబ్బు తెచ్చుకొమ్మని చెప్పానా? నెలరోజులక్రితం పొలం కొనటానికి తక్కువపడిన డబ్బు కోసం దాన్ని అడ్డంపెట్టి బాంకులోవున్న మొత్తంతో పొలం కొన్నారు మీ అన్నయ్య—ఇప్పటికి రెండేళ్లుగా జరుగుతున్న వ్యవహారం. మన భూమిలో కలిసే భూమి కావటంవల్ల ఆయన దానిమీదే పెట్టుకున్నారు మనసంతా. ఇప్పుడు మీ అత్తవాళ్ల బాకీ తీరటానికి ఇంట్లో డబ్బెక్కడిదీ?......ఆమాత్రం అవసరానికి పనికివచ్చే పెద్ద సొత్తు కూడా వేరే నా దగ్గర ఇంకోటి లేదు!" అని యింటి పరిస్థితిని వివరించింది రుక్మిణమ్మ.

శ్రీధర్ ఆలోచించాడు. నాన్నగారితో అన్నయ్యతో సంప్రదించినా వాళ్లు మాత్రం చెయ్యగలిగిం దేమిటి? పొలం ఎక్కడైనా తనఖాపెట్టి రెండువేలు తెచ్చి ఓబయ్యమావకివ్వాలి. కాని అన్నయ్య అందుకు సుతరామూ అంగీకరించడు! అయితే ఏది దారి?

నెలరోజుల గడువూ తీరిపోయింది. ఓబయ్య వూరుకోలేదు. ఒకరోజు శ్రీధర్‌ను యింటికి తీసుకొనివెళ్లి ఈ ప్రస్తావన తెచ్చాడు. శ్రీధర్ ఓబయ్యనూ, మంగమ్మనూ ప్రాధేయపడ్డాడు. తన జీతం మొత్తం నెల నెలకూ బాకీ తీరేదాకా వాళ్లకే చెల్లిస్తా నన్నాడు. ఈ ఏర్పాటు అంగీకరించమన్నాడు. ఓబయ్య నవ్వేశాడు మనస్సు నొచ్చుకుంటున్న ధోరణిలో: "నువ్వు మమ్మల్ని గురించి తెలుసుకున్న దింతే నన్నమాట! వెఱ్ఱివాడా, నీ డబ్బు మాక్కావాలా? మాకున్నదంతా నీకు పెట్టాలనే కదా మా ఆదుర్దా! మేము ఏం ప్రయత్నం చేసినా నీ వాటా నీకు న్యాయంగా రావాలనే ఉద్దేశమే తప్ప వేరే ఏముంటుంది? నీకెంత చెప్పినా మీ అన్నయ్యావాళ్ల మన స్తత్వం బోధపడక పోవటంవల్ల ఇట్లా ఒకదాని కొకటి ముడి పెట్టి, నీ మంచికోరి ఈ దోవ తొక్కవలసి వస్తోంది. నీ కెందుకు నువ్వు చూస్తూవుండు, అన్ని వ్యవహారాలు చక్కబడతాయి. నరసింహులు తనే మొనగా డనుకుంటున్నాడేమో, నిన్నిట్లా దిక్కులేనివాణ్ణి చేసి చివరకు చిప్ప చేతికిచ్చే ఈ ఎత్తులెవరూ తెలుసుకోలే రనుకుంటున్నాడు కాబోలు—వాడి కెంత అహంభావమనీ.......కొండముచ్చు......."

"ఇన్ని అనుమానాలు దేనికీ? నేనే అన్నయ్యను అడిగి ఏ సంగతీ తేల్చుకుంటాను" అన్నాడు శ్రీధర్. ఓబయ్య అన్నను అంటున్న నిందావాక్యాలు వినటంకంటె, అన్న నరసింహులి దగ్గరకు వెళ్లటమూ, ఏవైనా మాటలు పడవలసి వస్తే పడటమే గౌరవంగా తోచింది అతనికి.

"అదీ, అట్లా అన్నావు, బాగుంది. నీకు నోట్లో నాలుక లేకపోయిందనే కదా మేమింత బాధపడటం. ఈ వ్యవహారం మీ వదినెద్వారా కాదు, నువ్వే మీ అన్నతో మాట్లాడి తేల్చుకోవటం మంచిది."

"అలాగే"

శ్రీధర్ మామ్కైతే అన్నాడు గానీ, తీరా అన్నతో మాట్లాడా లనుకునేప్పటికి అతనికి ఏం మాట్లాడాలో తెలీలేదు. ఇంటి ఆర్థిక పరిస్థితి ఎలావుందో వదినెద్వారా తెలిసేవుంది. అన్నయ్యకు డబ్బిచ్చే ఉద్దేశమే వున్నా ప్రస్తుతం ఎక్కడనుంచీ తెచ్చియివ్వగలడు? ఓబయ్యమామ పేచీ తేవటంలో ఉద్దేశం: అన్నదమ్ములు ఆస్తి పంచుకోవాలనే తప్ప, డబ్బు నిజంగా తనకు అవసరంవుండి కాదని స్పష్టంగానే చెబుతున్నాడు. అలాంటప్పుడు తను అన్న దగ్గరకువెళ్లి 'మనం ఆస్తి పంపకాలు పెట్టుకుందాం' అని చెప్పాలా? ఏం చెప్పాలి?

వారం రోజులు గడిచాక ఒకనాడు ఓబయ్య బజార్లో కనిపించి "ఏమయ్యా నరసింహులితో మాట్లాడావా? ఏమన్నాడు?" అని అడిగాడు.

"ఇప్పుడు డబ్బు పుట్టటం కష్టం మామా! నువ్వు కోరుతున్నట్లు పంపకాల మాట నేనై తీసుకురాలేను" అన్నాడు శ్రీధర్.

"డబ్బు పుట్టటం కష్టమని మీ అన్న చెప్పాడా? అసలు ఏం జరిగిందో సరిగా చెప్పు"

"కొత్తగా పొలం కొనటంవల్ల, డబ్బుకు యిబ్బంది గానే ఉంది మరి."

"అసలు నువ్వు మీ అన్నతో మాట్లాడావా? లేక యివి మీ వదినె నేర్పిన చిలక పలుకులా?"

శ్రీధర్‌కు కోపం వచ్చింది. నిగ్రహించుకుని నవ్వుతూనే అన్నాడు: "ఎందుకు మామా, ఈ గొడవంతా నా వాటా నా కెలాగూ వస్తుంది. నువ్వూ అత్తా వూరికే అపోహ పడుతున్నారుగాని! మా కుటుంబం వీ ఋణం తీర్చకపోదు లే"

ఓబయ్య చూపులో మార్పు వచ్చింది. "ఇదా నాకు నువ్వు చెప్పవలసిన సమాధానం! ఇక నీతో లాభంలేదు. సరే, మీ కుటుంబమే తీరుస్తుందిలే రుణం. వస్తా" అని గబగబా వెళ్లిపోయాడు......

తర్వాత లాయరు నోటీసులు అందాయి రామలింగయ్యకూ, నరసింహులికీ, శ్రీధర్‌కూ.

"ఓబయ్యకు నువ్వు నోటు వ్రాసియిచ్చిన సంగతి నాతో చెప్పలేదేం?" అని అడిగారు రామలింగయ్యగారు శ్రీధర్‌ను.

"అది వట్టి నామకార్థమే అన్నారు అప్పుడు."

"అయినా నువ్వు నాతోనూ, మీ అన్నతోనూ చెప్పి ఉండవలసిన విషయం కాదా?"

శ్రీధర్ బదులు చెప్పలేకపోయాడు.

"సరే, నువ్వెళ్లు. ఆలోచిద్దాం."

రామలింగయ్యగారు ఆరోజు రాత్రి చాలసేపు నరసింహులితోనూ, రుక్మిణమ్మతోనూ సంప్రదిస్తూనే ఉన్నారు. శ్రీధర్‌ను ఎవ్వరూ పిలవలేదు. తన్ను మినహాయించి వాళ్లు ముగ్గురూ సమాలోచన జరుపుతూ ఉండటం అతనికి కష్టమనిపించింది. కానీ ప్రస్తుతం ఈ సమస్య బాధ్యత తన భుజాల మీది నుంచీ వాళ్లమీదికి మారిందనీ, ఈ పరిస్థితిలో వాళ్లేం చేస్తారో చూస్తే ఓబయ్యమామావాళ్ల ఆరోపణల్లో ఎంత సత్యం ఉండేదీ తేలిపోతుందనీ సమాధానపరచుకున్నాడు.

ప్రొద్దున్నే అన్నయ్య పొలం వెళ్లేదాకా ఆగి వంటింట్లోకి వెళ్లి రుక్మిణమ్మ ఎదురుగా కూర్చున్నాడు శ్రీధర్, రాత్రి జరిగిన విశేషాలు వినటానికి......రుక్మిణమ్మ ముఖం గంభీరంగా వుంది. ఆమె ఎంతసేపటికీ మాట్లాడలేదు. పలకరించనూ లేదు. పిల్లవాడికి పాలు పట్టుతూ వుండి, ఆపని పూర్తయాక పిల్లవాడిని అలవాటు ప్రకారం శ్రీధర్‌కు అందివ్వలేదు. వెళ్లి స్వయంగా తొట్టెలో పడుకోబెట్టివచ్చింది. చివరకు శ్రీధర్, "ఏం వదినా, రాత్రి ఏమాలోచించారు నోటీసుల విషయం?" అన్నాడు.

రుక్మిణమ్మ తోకత్రొక్కిన త్రాచులా లేచింది. "నువ్వు తెలిసే చేస్తున్నావా, లేక తెలీక చేస్తున్నావా? ఈ చిత్రవధకంటె ఒక్కసారిగా చంపెయ్యకపోయావా మమ్మల్ని? నీకు వేరువడాలని వుంటే ఆమాటే మొహంమీద చెప్పేస్తే శుభ్రంగా ఉంటుంది!......అయినా నువ్వు వచ్చి వచ్చి నన్ను వేధించటం దేనికీ? వెళ్లి మీ అన్నయ్యనే అడుగు!"

శ్రీధర్ నోట మాట రాలేదు. వదినె తన్ను యిలా అంటుందని అతడు కలలో కూడా వూహించలేదు. ఆమెకే తనమీద అవిశ్వాసమా! అతని ధైర్యం జారిపోయింది.

"నే నేం చేశానమ్మా? ని న్నడక్కపోతే ఎవరి నడగను?" అన్నాడు, కంఠంలో గద్గదిక తోచింది.

"మీ ఓబయ్య మామ నీకు తెలీకుండానే ఈ నోటీసులు పంపేడా, శ్రీధర్! నెలరోజులప్పుడు నన్ను నువ్వడిగితే మన సంసారం పరిస్థితి ఎట్లా ఉందో అంతా వివరంగా నేను చెప్పలేదూ? నువ్వు తలుచుకుంటే వాళ్లకు నచ్చజెప్పలేవా? నీమీద అంత ప్రేమ ఒలకబోసేవాళ్లు నీ మాట వినటం లేదంటే ఎవరు నమ్ముతారు? నువ్వు వాళ్ల మాటలు వింటున్నావో, వాళ్లు నీ మాటలు వింటున్నారో తెలీటంలేదు గాని, మొత్తానికీ వాళ్లూ నువ్వూ, అందరూ కలిసి ముసలాయన్ని రొష్టు పెడుతున్నారు. ఇంతకంటె ఏంచెయ్యాలి? ఏం చేశానూ అని అడగటానికి, నువ్వేం చిన్న పిల్లాడివా? ఏమీ తెలీదు పాపం! తెలియజెప్పాలి! అనుకోటానికీ!......అక్కడో కాలూ, ఇక్కడో కాలూ ఎలాగూ కుదరదుగాని అటో ఇటో నువ్వు తేల్చుకోవటమే మంచిది!......"

"ఆ సంగతే మీ రందరూ కూర్చుని ఏం తేల్చారు రాత్రి అని అడుగుతున్నాను."

రుక్మిణమ్మ అతని కెదురుగా వచ్చి నిల్చుని ముఖంలోకి తేరపార జూచి "అయితే వేరుపడటమే నీ అభిప్రాయమా?" అన్నది ఆశ్చర్యంగా సమాధానంకోసం ఎదురుచూస్తూ.

"వదినా, ఇందులో నా అభిప్రాయ మేముందీ? ఎవరి క్కావాలీ? ఇదంతా నా ఖర్మ! నా అభిప్రాయం కనుక్కోవాలని వుంటే నువ్విలా మాట్లాడవు. నాన్నా, అన్నయ్యా రాత్రే నన్ను పిలిచి అడిగివుందురు. అక్కడ వాళ్లూ డబ్బుకోసం గొంతుమీద కూచోకుండా నేను నెలనెలా జీతంలో తీరుస్తా నన్న నా మాట ఖాతరుచేసివుందురు......ఎవరూ నన్ను లెఖ్ఖ చెయ్యరు, ఎవరికీ నే నక్కరలేదు. ఎవళ్ల పంతాలూ, కావేషాలూ వాళ్లవి.......నీకూ నేనంటే నమ్మకం లేదు......సరే ఏం చెయ్యదలుచుకున్నారో చెయ్యండి....."

రుక్మిణమ్మ అంతా విని మౌనంగా తనపని చూసుకోవటం మొదలుపెట్టింది. ఆమె ఏమైనా చెబుతుందని శ్రీధర్ ఎదురుచూస్తూ కూర్చున్నాడు. ఆమె మాట్లాడకపోయేప్పటికి—"నేను వెళ్లి నాన్నగారినే అడుగుతాను" అంటూ లేచి నిల్చున్నాడు.

"ఆయన్నూ నన్నూ అడిగి లాభ మేమిటి? అసలే జబ్బు మనిషి. రాత్రంతా కన్నుమూసి ఉండరు. అడగదలచుకుంటే మీ అన్ననే అడగరాదూ?"

"సరే, అయితే అన్నయ్య దగ్గరకే వెళ్తాను. ఇవ్వాళ బడికి సెలవు పెడతాను."

వెళ్లబోతున్న శ్రీధర్‌ను ఆపి రుక్మిణమ్మ అన్నది: "ఇదుగో మీ అన్నయ్య అంతా నువ్వే చేస్తున్నావని అనుమాన పడుతున్నాడు. కాదని నచ్చజెప్పటానికే రాత్రి మేం వెళ్ల వాళ్లూ కూచుంది. అందుకే నిన్ను పిలవంది కూడా......పొలం దగ్గరుంటారు. నేను పంపినట్లు కాకుండా నీవై వెళ్లినట్లు వెళ్లి వున్న సంగతి దాపరికం లేకుండా చెప్పి అన్నదమ్ము లిద్దరూ ఏదో ఒప్పందానికి రండి......కాఫీ పెట్టివ్వనా?"

"పెట్టు.....నేను సెలవుచీటీ వ్రాసి పంపించి వస్తాను."

శ్రీధర్‌కు ఆరోజు ఎంత వెతికినా నరసింహులు కన్పించ లేదు. ఇంటికి భోజనానికీ రాలేదు. గ్రామాంతరంవెళ్లి మరుసటి రోజు ప్రొద్దున తిరిగి వచ్చాడు. అదృష్టవశాత్తు ఆరోజు ఆదివారం కావటంతో మళ్లీ సెలవుపెట్టే అవసరం లేకుండా పోయింది. మధ్యాహ్నం పొలంవెళ్లి అక్కడ కలుసుకున్నాడు......

"అన్నయ్యా, కోర్టు నోటీసు విషయం ఏంజేద్దాం?"

"ఏం చేద్దామో, నువ్వే చెప్పు" అన్నాడు నరసింహులు పరమ శాంతమూర్తిగా.

"అసలు ఇలా వస్తుందని నే ననుకోలే దన్నయ్యా....." అంటూ ప్రారంభించి ఉన్న సంగతి పూర్తిగా—అంటే అన్నదమ్ములు వేరుపడాలనే ఉద్దేశంతో ఓబయ్య పెట్టుకున్న నిర్బంధమే ఇందులోని అంతరార్థ మనేదాకా, వాళ్ల మాటలో్తసహా విశదీకరించాడు శ్రీధర్.

"నిజమే. వాళ్లకు అట్లా నీమీద అభిమానం ఉండటం నీ మంచికోరి ఈ ప్రయత్నం చేస్తూ ఉండటం బాగానే ఉంది. ఎవరు కాదంటారు? దాన్ని గూర్చి వాళ్లని తప్పు పట్టుకోవడమూ అనవసరమే! వేరుపడటం అనేది లోకంలో ఎక్కడా జరుగుతున్న విషయమే! అయినప్పుడు బాధపడటం దేనికీ?" అన్నాడు నరసింహులు.

"అన్నయ్యా! అదికాదు, వాళ్లెవరు మన కుటుంబం విషయంలో జోక్యం కలుగజేసుకోవటానికి? ఏం జరిగినా మనం ఒకటిగానే ఉండటం ముఖ్యం."

"వాళ్లు జోక్యం చేసుకుంటున్నారంటే, చేసుకోవటానికి అలుసిచ్చిం దెవరో నీకే తెలుసు! ఇప్పుడు వాళ్లెవరూ అంటే మాత్రం కుదురుతుందా? వ్యవహారం మన చెయ్యిదాటిపోయింది........ఇప్పుడు చెయ్యాల్సిందే ఆలోచించాలి. ఇంతకూ నీ భాగం నీకు పంచియిస్తే వాళ్లు రుణం సంగతి ఎత్తరని నువ్వే అంటున్నావు. అందులో మనకు కలిగే నష్టమూ ఉండదు. అలాంటప్పుడు నువ్వైనా, నేనైనా వేరుపడ్డా, కలిసివున్నా ఇద్దరూ బాగుండటమే మన క్కావల్సింది. ఇప్పుడు భూమి మీద వున్న రుణమే మనకు తల బరువుగా ఉంది. మళ్లీ కలిసి పొలం తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తే ఇద్దరమూ నష్టపోతాము. ఎవరు తిన్నట్లు? కలిసివుండి నష్టపొయ్యేదానికన్నా, వేరై ఇద్దరూ బాగుపడటం మంచిదని నా అభిప్రాయం. కాదా? నువ్వే బాగా ఆలోచించు."

"అన్నయ్యా నీకు నామీద విశ్వాసం లేదా? నేను వేరైపోయి బాగుపడాలనే ఉద్దేశంతో ఇదంతా చేస్తున్నానని నువ్వు అనుకుంటున్నావా? ఎందు కిలా వేరుచేసి మాట్లాడతావు? నాకు భాగం ఏమీ అక్కరలేదు. నీ ఇంట్లో ఉండనియ్యి చాలు!" శ్రీధర్ కళ్లనీళ్ల పర్యంతం అయ్యాడు.

నరసింహులు అతని భుజంమీద చెయ్యి వేశాడు. "అరె, ఏమిట్రా నీ పిచ్చి! నువ్వింట్లో ఉంటానంటే ఎవరు కాదన్నారు? అదివేరు, వ్యవహారం వేరు! నువ్వు చదువుకున్నావు గాని లోకం తెలుసుకోలేదు! వెళ్లి వాళ్ల చేతుల్లో ఇరుక్కున్నావు, మమ్మల్నీ యిరికించావు. ఇప్పుడు మార్గం ఒక్కటే – భాగాలు పంచుకోవటం. అదే మన కుటుంబానికి లాభం; లేకపోతే అలవిగాని అప్పుల్లో మునిగిపోతాం మనం ఇంకెప్పటికీ తలెత్తుకోలేం—వుండే సంగతి ఆదీ! అభిమానాలూ, అపేక్షలూ ఎక్కడికి పోతాయి, ఎక్కడికీ పోవు!" అన్నాడు అనునయంగా.

......అతని మాటలు సహేతుకంగా ఉన్నాయి, తిరుగు లేకుండా. ఇద్దరూ యింటికి తిరిగొచ్చారు.

శ్రీధర్ ఎంత ప్రయత్నించినా తనలో సమాధానపడలేకపోయాడు. ఈ పరిష్కారం అన్నయ్య సహేతుకంగా వ్యవహార జ్ఞానంతో సూచిస్తున్నాడని ఎంతగా సరిపెట్టుకోబోయినా శ్రీధర్‌కు ఆ హృదయంలో వజ్రకాఠిన్యమే గోచరిస్తోంది.

ఓబయ్యమామకూ, అన్న నరసింహులికీ మనస్తత్వంలో ఏమీ భేదంలేదు. ఇద్దరి దృష్టి లోక వ్యవహార దృష్టిమాత్రమే; వాళ్లకు అభిమానాలూ, ఆప్యాయతలూ వూతపదాలు; వ్యవహార చదరంగంలో ఎత్తుకు పైఎత్తు వేయటానికి అనుకూలంగా మార్చుకునే గళ్ల తప్ప జీవితానికి స్థిరమైన ఆవాసాలు కావు!

పరిస్థితులు ఎలా ముంచుకువచ్చినా తన యింటికీ తనవాళ్లకూ, తన విశ్వాసాలకూ, అభిమానాలకూ దూరం కాగూడదనీ, తండ్రితో, వదినెతో, అన్నయ్యతో తనకుగల ప్రాథమిక అనుబంధాలను త్రెంచుకోగూడదని చేసుకున్న దృఢ నిశ్చయం ఏమైపోయింది? ఎలా పోయింది? ఇక్కడ తన ప్రయత్నానికి యివ, ప్రాధాన్యం లేనే లేదు! తుపానులా, ఉప్పెనలా వస్తున్న ఈ మార్పు తనని అడిగీ, అనుమతి తీసుకునీ రావటం లేదు. ఈ మార్పు ముందు తను కేవలం ఇసుక రేణువు, పూచికపుల్ల!!

## 15

ఆస్తి పంపకం జరుగుతుందని తెలీగానే ఓబయ్య శ్రీధర్ మామగారైన వెంకయ్యగారికి రమ్మని ఉత్తరం వ్రాశాడు. పంపకం తాలూకు వివరాలు శ్రీధర్ పూర్తిగా అన్నకే వదలిపెట్టాడు. ఓబయ్య ఆ విషయమై ప్రశ్నించబోతే కటువుగా సమాధానమిచ్చాడు—అందులో జోక్యమూ, తగువులూ అనవసరమని. అందుకే ఓబయ్య వెంకయ్యగారికి కబురుపెట్టడం జరిగింది. వెంకయ్య తారను తీసుకుని వస్తున్నట్లుగా రామలింగయ్యకు ఉత్తరంవ్రాసి పంపకం విషయం తనకేమీ తెలీనట్లే మదనపల్లిలో దిగాడు.

ఓబయ్య ఎన్ని ప్రయత్నాలు చేసినా, వెంకయ్యచేత అడ్డదిడ్డంగా ఎన్ని ప్రశ్నలు వేయించినా, శ్రీధర్ అన్ని విషయాల్లోనూ అన్న సూచించిన ఏర్పాట్లు ఏకంగా అంగీకరిస్తూపోవటంచేత, ఆస్తిపంపకం గొడవేమీ లేకుండా పూర్తయింది. కాని ఆ రోజుల్లో తార శ్రీధర్‌ని ఒత్తిడి పెట్టడం మాత్రం మానలేదు. ఓబయ్య సూచనలు వెంకయ్యద్వారా తారకు అంది, తారనుంచీ శ్రీధర్ మస్తిష్కంలోకి ప్రవేశించటానికి ప్రయత్నించి, ఇనుప కవచానికి తగిలి విఫలమయ్యే బాణాల్లాగా, అతని విశ్వాసాల్ని భేదించలేక పూర్తిగా విఫలం అయ్యాయి. ఆ వైఫల్యం తాలూకు ఉక్రోషాన్ని తార, రుక్మిణమ్మమీద పరిపరి విధాల చూపిస్తూ వచ్చింది.

పంపకం పూర్తయి కాగితాలు రిజిష్టరు అవగానే, తండ్రితోపాటు తనూ బందరు వెళ్లిపోతానన్నది తార. వెంకయ్యగారి ప్రయాణానికి ముందురోజు ఓబయ్య ఇంట్లో విందు ఏర్పాటైంది. అక్కడ శ్రీధర్‌ని దొరకపుచ్చుకొని మంగమ్మా, తారా ఈ అభిప్రాయాన్ని సహేతుకంగా వివరించారు......తార అయిదు నెలల గర్భవతి. పుట్టింటికి వెళ్తాననటం సహేతుకమే కద!

"ఇంతలో ఏం ముంచుకు వచ్చిందని వచ్చినట్లు? ఎవరు రమ్మన్నారనీ? ఎవరు ఉండమన్నారనీ?" అన్నాడు శ్రీధర్.

"ఎంతమాట!! అయితే నీకు పెళ్లాం, పిల్లలూ అక్కరలేదుటయ్యా?" అన్నది మంగమ్మ. తార "చూడు పిన్నీ!" అంటూ కళ్లనీళ్ల పర్యంతం అయింది. శ్రీధర్‌కు చిరాకు వేసింది. "ఎందుకీ ఏడుపులు? ఒకవైపు నువ్వే వెళ్తానంటుంటే నేను వెళ్లొద్దని కదా ఏడుస్తున్నాను? నాకు పెళ్లాం వద్దంటున్నానా?" అన్నాడు......"ఎందుకీ నిష్ఠూరాలూ? అదికాదు, నేను చెబుతా నుండమ్మాయ్" అంటూ ప్రారంభించింది మంగమ్మ: "మీ ఇద్దరిమధ్య ఎందుకు వస్తున్నాయి ఈ పోట్లాటలూ, పొరపొచ్చాలూ? చూడు సిరీ, అమ్మాయి ఎక్కడికీ వెళ్లదు. ఇక్కడే వుండి పురుడు పోసుకుంటుంది. బందరునుంచీ ఎవరు వచ్చినా రాకపోయినా వాళ్లకు వీలున్నా, లేకపోయినా, నేను దగ్గరుండి చూసుకుంటాను. అయితే నువ్వు తెలుసుకోవాల్సిందీ ఒక టుంది. ఆ ఇంట్లో తార ఉండటానికి వసతి లేదు. ఆడవాళ్లకు తెలుస్తాయి వాళ్లకుండే ఇబ్బందులు, మగాడివి నీకేం తెలుస్తాయి? రుక్కుతల్లిని నెత్తిమీద పెట్టుకోవటం ఒకటే తెలుసు నీకు!......తార అక్కడుంటే నేను సాయం చెయ్యటానికీ వీలుండదు—నేనా గడప దొక్కనని నీకూ తెలుసు......అందువల్ల మీరిద్దరూ ఇక్కడే వచ్చి ఉండినా సరే, పోని, మా ఇల్లు నీ హోదాకు తక్కువ అనుకుంటే వేరేయిల్లు కుదుర్చుకున్నా సరే! ఏం అమ్మాయ్, నీ కిష్టమే కదూ!" తార అంగీకారమేనని తల వూపింది.

"నేనా యిల్లు వదిలిరాను!" శ్రీధర్ అన్నాడు.

"అయితే అమ్మాయి బందరు వెళ్తాననటం న్యాయమే! నీ మొండితనం నీది! నీకు నీ వదినా, అన్నా తప్ప యింకెవ్వరూ కాబట్టినట్లు లేదు!.....ఇదేం మాయ! ఇదేం మత్తు! ఆ ఏడు కొండలవానికే ఎరుక!" అన్నది మంగమ్మత్త చేతులెత్తి విడ్డూరంగా.

తార కోపంగా ముఖం పక్కకు తిప్పుకుంది.

శ్రీధర్ చలించలేదు.

"అయితే నువ్వు బందరువెళ్లి పురుడు పోసుకుని తిరిగ్గారా, నేను ఎదురు చూస్తుంటాను! ఆస్తి పంపకం

అయితే కావచ్చుగాని ఆత్మని కూడా ముక్కలు చేసుకోవటం నాచేత కాదు'' అన్నాడు.

తార వెంకయ్యతో బందరు వెళ్లిపోయింది

తర్వాత నెల తిరక్కుండానే రామలింగయ్యగారు మరణించారు. పెద్ద దినానికి వెంకయ్యమాత్రం వచ్చాడు. తార రాలేదు అస్వస్థత కారణ మట.

తండ్రి మరణం శ్రీధర్‌ను కలవర పరచింది. హృద్రోగంతో కొన్ని సంవత్సరాలు అస్వస్థత ఆయన మరణానికి సహజ కారణంగా కనిపిస్తూనే వున్నా శ్రీధర్ మనస్సులో ఆస్తి పంపకానికీ, ఆయన మరణానికీ సంబంధం ఉన్నదనే భావమే స్థిరపడి పోయింది. అంతేకాదు. ఆ రెండింటికీ బాధ్యత తన మీదే ఉందని కూడా తోచింది. ఎంతవరకు ఆ బాధ్యత?—అన్న ప్రశ్నకు అతనికి సమాధానం యిదమిత్థమని తేలలేదు! భారత దేశ విభజనకూ, గాంధి గారి మరణానికీ కాంగ్రెసుపార్టీ బాధ్యత ఎంతవరకు?—అనే ప్రశ్నలోవుండే క్లిష్టతే ఇందులోనూ కనిపించింది శ్రీధర్‌కు.

తార ఉత్తరాలు వ్రాయటంలేదు. మురళీ అక్కడి వార్తలూ తన మెడికల్ కాలేజి కబుర్లూ తరుచు సరదాగా వ్రాస్తున్నాడు. తన మామగారి కుటుంబంలో తనకు కొంతవరకు సన్నిహితుడైన వ్యక్తి మురళీ—కాని, ఎందుకో, ఆ మురళీకి తన ఆంతరంగిక జీవితాన్నిగూర్చి చెప్పుకోవాలనిపించలేదు శ్రీధర్‌కు. ఉత్తరాల్లో పై కబుర్లూ విశేషాలూ తప్ప, తన హృదయగత భావాల్ని గూర్చీ, జీవితంలో తను ఎదుర్కొంటున్న పరీక్షను గూర్చీ శ్రీధర్ మురళీకి వ్రాయలేదు.

హృదయంలో ఎంతగా శూన్యాన్ని అనుభవిస్తున్నా శ్రీధర్ నిత్య జీవితంలో కర్తవ్యోన్ముఖత్వం సాధించాలని పట్టుదలతో తన శక్తుల్ని కేంద్రీకరించాడు.

జనవరి (1950) వచ్చింది. మురళీ దగ్గర్నుంచీ తంతి వార్త: తార ప్రసవించింది, మళ్లీ ఆడపిల్ల అని.

విధి తన మీద కత్తి గట్టి నట్లు తోచింది శ్రీధర్‌కు. మగపిల్లవాడు కలగక పోవటం తనకేమీ పెద్దలోటుగా లేక పోయినా, అత్తవారిలోను తార మనసులోనూ తనమీద చెలరేగుతున్న కోపాగ్ని ప్రజ్వరిల్లటానికి ఈ విషయమూ దోహదం చేస్తుందని అతనికి తెలుసు! సరిగ్గా రెండేళ్ల పూర్వం స్వరాజ్యం పుట్టినప్పటి పరిస్థితే యిప్పుడు మళ్లీ— అప్పటి కంటే తను యిప్పుడు మరీ దిగ జారి పోయాడు కూడా!

రుక్మిణమ్మ బందరు వెళ్లి రమ్మన్నది. ఇన్నాళ్లూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేందుకు పెద్ద దిక్కు తండ్రిగారు వుండేవారు; ఇప్పుడు శ్రీధర్ తన భార్య సంగతీ, ఆమె తాలూకు బంధువుల సంగతీ స్వయంగా చూచు కోవాలి అన్నదామె. శ్రీధర్‌ను తప్పకుండా వెళ్లమన్నది.

కాని శ్రీధర్‌కు మనస్కరించ లేదు. రెండేళ్లనుంచీ జీవితంలో విధితో లేక పరిస్థితులతో తనకు జరుగు తున్న పోరాటంలో అడుగడుగునా తను లొంగి పోవటం, ఓడిపోవటమే అతనికి కనిపిస్తోంది.! ఈ సారి తను లొంగ కూడదు.! ఏమైనా సరే, ముఖ్యంగా తార విషయంలో లొంగ కూడదు! తారకు గుణపాఠం నేర్పాలి అనిపించింది.

ఒక సంత రోజు స్కూల్లో టీచర్స్ రూములో కూర్చుని వుండగా మంగమ్మత్త పాలేరు వచ్చి పిలిచాడు. ఆమె సంతలో ఏవో కొనటానికి వచ్చిందనీ, తనని ఉన్నపళంగా పిలుచుకొని రమ్మన్నదనీ కబురు తెచ్చాడు. శ్రీధర్ పంపకాల తర్వాత ఆమె యింటికి వెళ్లడమే మానేశాడు. ఇప్పు డీ పిలుపు! శ్రీధర్‌కు వెళ్లాలని లేదు. కాని అక్కడేవున్న చలమయ్య ''వెళ్లిరావయ్యా ఏం అర్జంటు పనో! నేను హెడ్‌మాస్టరుతో చెప్పి నీక్లాసు తీసుకుంటానులే వెళ్లు'' అన్నాడు. శ్రీధర్ వెళ్లక తప్ప లేదు.

మంగమ్మ ఎండలో నిల్చుని కందులు బేరం చేస్తోంది. శ్రీధర్‌ని చూచి సంతోషంగా బేరం ఫైసలు చేసేసింది. ఎక్కువ రేటు యివ్వటానికి ఒప్పు కొని కందుల్ని కొలిపించు కొమ్మని పాలేరును పురమాయించి, చెట్టు నీడకు తీసుకు వెళ్లింది శ్రీధర్‌ను... మొహం మీద జలపాతంలా జారుతున్న చెమటని పైట చెరుగుతో తుడుచు కుంటూ, నోటిలోని తమ్మ ఉమ్మి వేసి, ఆకు వక్కా సున్నం తాలూకు సంచీ విప్పి మళ్లీ తాంబూలం వేసుకోటానికి సిద్ధ పడుతూ ''ఏమయ్యా, మళ్లీ కూతురు పుట్టిందటగా! నాకు నిన్ననే తార ఉత్తరం వ్రాసింది. నువ్వింకా వెళ్లకుండా యిక్కడే వున్నావా? నాతో వచ్చి, పోనీ, మాటైనా అందించావా? అప్పుడే వారం రోజులైందటనే అమ్మాయి పుట్టి!..'' అన్నది. శ్రీధర్ మాట్లాడ లేదు.

''ఏమిటి అట్లా వున్నావు? ఈ సారైనా కొడుకు పుట్ట లేదనా?... నామాట విన్నావా? నేనే నీపెళ్లానికి పురుడు పోస్తే కొడుకు పుట్టక పోయేవాడా?.. పోన్లే, బందరు ప్రయాణ మెప్పుడు? నన్ను రమ్మంటే నేనూ వస్తాను'' అన్నది మంగమ్మ.

''నేను వెళ్లటం లేదు— లీవు లేదు''

''లీవు ఎందు కివ్వరూ? ఇట్లాంటి వాటికి యివ్వకుండా ఎట్లా పోతారు? ఇవ్వక పోతే రాజీనామా యిచ్చేయ్. ఏం బతకలేమా?"

''ఇవ్వరు లే.. సరే నేను వెళ్తున్నా— నాకవతల చాల పనుంది స్కూల్లో."

''అయితే యింటికెప్పుడు వస్తానంటావ్? ఆదివారం బడి వుండదు. భోజనానికి రా, ఏం?''

అప్పటికే శ్రీధర్ వెళ్లిపోతున్నాడు. మంగమ్మ ''ఏం?'' అంటోంది గట్టిగా. ''సరేలే'' అన్నాడు గొణుక్కుంటున్నట్లుగా.

రుక్మిణమ్మ వదినె, మంగమ్మత్తా ఉత్తరధ్రువమూ దక్షిణధ్రువమూ అయినా తనకు కర్తవ్యాన్ని ఉపదేశించటంలో— బందరు వెళ్లమని చెప్పటంలో— యిద్దరిదీ ఒక్కమాటే కావటం, ఇద్దరికీ తన వ్యక్తిత్వం మాట పట్టక పోవటం, ఎంత మంకుతనం చూపుతున్నా తారనే యిద్దరూ సమర్థిస్తూ తనకు హితవు బోధించటం, శ్రీధర్‌కు విరక్తి కలిగించింది. ఆడవాళ్లింతే కాబోలు! అనిపించింది. అయినా తార విషయంలో

తను ఒకళ్ల ఆలోచనల మీదా సలహాల మీదా ఆధారపడి ప్రవర్తించటమేమిటి? అది తను వ్యక్తిగతంగా నిర్ణయించు కోవాల్సిన బాధ్యత. శ్రీధర్ యీ సారి తను తారకు లొంగి పోవటం జరగదనే నిశ్చయానికే వచ్చాడు.

ఆదివారం మంగమ్మత్త యింటికి వెళ్ల లేదు. ఏమీ తోచక చలమయ్య యింటికి వెళ్లాడు. చలమయ్య ఎక్కడికో ప్రయాణమౌతున్నాడు. ఆదివారం కావటం వల్ల ట్యూషన్ కుర్రవాళ్లకు సెలవు.

"ఏమిటి విశేషం?" అన్నాడు చలమయ్య.

"ఏం లేదు. ఏమీ తోచటం లేదు, సినిమాకైనా వెడదామా అని యిటు వచ్చాను."

"అంత కంటే సరదా అయిన చోటికే తీసుకెడుతాను వస్తావా?"

"ఏమిటీ? నాకు తెలియని ప్రోగ్రాం ఏమైనా వుందా?"

"కాదులే. నిన్నో వ్యక్తికి పరిచయం చేస్తాను."

"ఎవరా వ్యక్తి?"

"చెబుతాను రా."

ఇద్దరూ బయల్దేరారు.

"నిజానికి నిన్ను ఆవ్యక్తి యిది వరకే ఎరుగునట. నీ Old-Class mate...జ్ఞాపకం తెచ్చుకో చూద్దాం" అన్నాడు చలమయ్య.

"ఎంతమందో క్లాస్ మేట్స్. ఈవూళ్లోవుండే క్లాస్‌మేట్ అయితే నాకిది వరకే తెలిసి వుండాలే."

"నిజమే, తెలుసేమో! బహుశా ఆమెను గూర్చి వినే వుంటావు... రాఘవరావు ఎలిమెంటరీ స్కూల్లో పని చేస్తూ వుండేది.. ఇప్పుడు ట్రెయినింగ్ పరీక్షకు వెళ్లింది.. పేరు పద్మ."

పద్మ! పద్మమణి?

ఆమెను గూర్చి చలమయ్యే తనతో యిదివర కొకసారి చెప్పినట్లు గుర్తు వచ్చింది శ్రీధర్‌కు.

"ఆమె పూర్తి పేరు పద్మమణి కదూ?"

"ఏమో నే వడగలేదు...పద్మ అనే పిలవటం..ఆమె కొడుకే, సత్యం అని మన స్కూల్లో థర్డ్ ఫారమ్...నాదగ్గరే ట్యూషన్"

"అవును... ఆమె ఏదో కష్టంలో వున్నట్లు చెప్పావు."

"ఓ, అది రెండేళ్ల నాటి సంగతి.. అదృష్టం మారి పోయింది.."

"ఎట్లా మారింది?"

"తర్వాత చెబుతాను.. యిదే యిల్లు."

డాబా యిల్లు. మెట్లెక్కి మేడ మీదికి వెళ్లారు. క్రింద ఎవరో అద్దెకుంటున్నారట. ఇల్లు పద్మ సొంతమేనట!

ఆమెను చూడగానే శ్రీధర్ మంత్ర ముగ్ధుడిలా అయాడు. ఆమె పద్మమణే; కాని యిన్నేళ్ల తర్వాత ఆనాటి పద్మమణి యిలా వుంటుందని అతడు వూహించుకో లేదు! అప్పుడులేని నిండుదనం పరిణితి, ఎన్నోరెట్లు అధికమైన ఆకర్షణ.. యౌవనవతి అయిన పద్మమణిలో భాసించాయి. ఆమె కుర్చీ చూపిస్తే శ్రీధర్ కళ్లప్పగించి ఆమె వైపు చూస్తూ కూర్చుండి పోయాడు పలకరించకుండా.

"ఏమండీ! మీరు గుర్తు పట్టే వట్లు లేదు. మనం యస్సెస్సెల్సీదాకా క్లాస్ మేట్స్ం జ్ఞాపకం లేదా? చాల సందేహంగా చూస్తున్నారు!" అన్నది నవ్వుతూ పద్మమణి.

"అవును గుర్తు లేక కాదు, మీరు చాల మారారు... కాదు ఏమీ మార లేదు... ఇందులో ఏది నిజమో తెలుసుకో లేక ఆలోచిస్తున్నాను. అన్నాడు శ్రీధర్. అతనికి ఏదో స్వప్న లోకంలో ప్రవేశించి నట్లుంది. పద్మమణి కిలకిలా నవ్వింది. ఆమె నవ్వుతో అతని హృదయం కంపించింది. సర్వేంద్రియాల కవాటాలు తెరుచు కున్నాయి...పక్షుల కిలకిలారావంతో ఉషస్సు వికసించినట్లు.. అతని భావన లోని ఒకానొక స్వేచ్ఛా మాధుర్యం పూవులా విచ్చుకున్నట్లూ... మనస్సు వింతగా ఆహ్లాదంతో నిండి పోయింది.

"శ్రీధర్‌కి క్లాస్‌మేట్‌ని చూడగానే చమత్కారం కూడా వచ్చేసిందే! అందరితో చాల ముభావంగా ముక్తసరిగా వుంటాడు పద్మా!" అంటున్నాడు చలమయ్య.

"స్కూల్లో చదివేటప్పుడూ అంతే, ఎవరితో మాట్లాడే వారు కాదు, ఆడ పిల్లలతో అసలు మాట్లాడేవారు కాదు... ఏమండీ, కాలేజికి వెళ్లాక మారిపోయారు కదూ!"

ఆమె అలా అతని కళ్లల్లోకి చూసి ప్రశ్నిస్తూ వుంటే శ్రీధర్‌ని అశక్తత ఆవహిస్తోంది. ఊగే పుష్పం మీద నిలిచి ఉత్సుకతతో తెనె గ్రోలే మధుపంలా గుచ్చిలాగుతోంది ఆమె చూపుల ప్రభావం అతని హృదయం మీద. ఆ బలత్కారంలో, ఆమె సాన్నిధ్యంలో అతనికి తన వ్యక్తిత్వం పట్టు చిక్కటంలేదు. వ్యక్తిత్వమే లయించి గాలి తెరగా అదృశ్యమై పోతున్నట్లుంది. మిగిలింది అస్తిత్వపు తాలూకు వశ్యత్వం— బాధాతీవ్రమైన ఆనందం.

"ఇప్పటికీ ఆడవాళ్లంటే భయమూ భక్తీ పోలేదు పద్మా. శ్రీధర్ సాధువుల్లో సాధువు... టీచింగ్ ప్రొఫెషన్‌లో చేరాక యిప్పుడిప్పుడే గట్టి పడుతున్నాడు..." అన్నాడు చలమయ్య.

అబ్బ! ఎవరూ మాట్లాడ కుంటే ఎంత బాగుండును!

"ఎంత గట్టి పడ్డా మీలాంటి దళసరి తవం రావటం కష్టమే లెండి" అన్నది పద్మమణి.. అది కాంప్లిమెంటో, ఇన్‌సల్టో తెలీదు కాబోలు చలమయ్యకి! చలమయ్యా నవ్వి వూరుకున్నాడు... పద్మమణి మళ్లీ శ్రీధర్ కళ్లల్లోకి చూస్తూ "ఏమండీ! మీరెప్పుడూ క్లాసులో ఫస్టు వచ్చేవాళ్లు కదా, బడి పంతులు ఉద్యోగం కంటే మంచి ఉద్యోగం దొరక్క పోయిందా?" అన్నది.

ఆమాటల్లో ఏదో ఆర్ద్రతా, ఆప్యాయతా, ఆ ముఖ భంగిమలో అభిమానమూ, జాలీ స్పందిస్తున్నాయి. ఆశయాల శిధిలాలు, ప్రేమ అన్వేషించిన మృగ తృష్ణలు, మండు తున్న ఎడారిలో అడుగు జాడలు, ముందుకు సాగుతున్న విశ్వాసం— ఆమె ప్రశ్న అతని జీవితాన్నే పరామర్శించింది.

అతనిలో స్వాభిమానం రేకెత్తి "టీచింగ్ అంటే నాకు తక్కువ అభిప్రాయం ఎన్నడూ లేదు. ఇంటి దగ్గరే వుండి వ్యవసాయం చూచుకునే యీ అవకాశం గవర్నమెంటు ఉద్యోగాల్లో ఎందులోనూ లేదు" అన్నాడు.

"నేనే సలహా యిచ్చాను. బి.ఎస్.సి.తర్వాత బి.టి.కి.వెళ్లమని" అన్నాడు చలమయ్య. శ్రీధర్‌కి చలమయ్యని బయటికి గెంటెయ్యా లనిపించింది.

"ఉండండి. కాఫీ తీసుక వస్తాను" అంటూ పద్మమణి లోపలికి వెళ్లింది. శ్రీధర్‌కు వూపిరి పీల్చుకునే అవకాశం లభించినట్లయింది. గడచిన ఆకొన్ని నిముషాల్లో పద్మమణి సంగీతం, చలమయ్య అపస్వరాలు కలిసిన ఒక కొత్త లోకంలో హఠాత్తుగా ప్రవేశం..ఏదో మత్తూ బాధా కలిసిన అనుభూతి అతణ్ణి ముంచెత్తింది.

అతడికి తనలో ఏం జరిగిందో తెలీటం లేదు. అక్కడ వుండాలనీ లేదు, వెళ్లాలనీ లేదు. పద్మమణిని చూస్తూ మాటలు లేకుండా మౌనంగా తన్నుతాను ప్రశ్నించుకోవాలని అన్వేషించుకోవాలనీ వుంది— అప్పుడు కాని తనకేం జరుగుతూ వుందో తన కర్థం కాదు— ఈ అనుభవాన్ని ఎట్లా ఎదుర్కోవాలో అప్పుడే నిర్ణయించుకో గలడు! కాని అది సాధ్యమా! పద్మమణి గూర్చి యింత కాంక్ష నిద్రాణంగా వుందని అతడు కలలో నైనా వూహించ లేదే!

పద్మమణి తిరిగి వచ్చి మాట్లాడుతూ వుంది. కొంత సేపటికి ఆమె కొడుకు సత్యమే కాఫీ పట్టు కొచ్చాడు.

శ్రీధర్ మౌనంగా ఆమె వైపు చూస్తున్నాడు.

పద్మమణి తన ట్రెయినింగ్ పరీక్ష సంగతి, అంతకు ముందు రోజే తన సర్టిఫికేట్ వచ్చినట్లూ, మళ్లీ కమిటీవాళ్లను కలుసుకోవాల్సిన అవసరమూ, తనకు రాఘవరావు గారిచ్చిన పొలం అమ్మి వేయటమూ... చెబులోంది. మధ్య మధ్య శ్రీధర్ వైపు చూస్తోంది... శ్రీధర్ ఆమె మాటల్ని వింటున్నా విననట్లే ఏదో లోకంలో వున్నాడు. ఆమె చేతుల్నీ చేతి వ్రేళ్లనీ కుచ్చెళ్లనీ పాదాల్నీ, ఆమె పలువరుసనీ, ముక్కు వంపునీ, కన్నుల చపలత్వాన్నీ వాటి అగాధమైన ఆకర్షణనీ, ఆమె తల కట్టునీ, పాపటినీ వరుసగా తదేకంగా ధ్యానిస్తూ పరిభ్రమిస్తున్న అతని మనస్సు అన్వేషిస్తోంది...

ఏడేళ్ల అమ్మాయి మెట్లెక్కి వచ్చి గది గుమ్మం దగ్గర నుంచీ పద్మమణిని ఉద్దేశించి "గుడికి వస్తారేమో అమ్మ అడగమంది" అన్నది.

"ఆ వస్తున్నానని చెప్పు."

"క్రింద అద్దెకున్న వాళ్ళు. ఆదివారాలు ఆంజనేయ స్వామి స్వామి గుడికి వెళ్తున్నాము..టైమెంతయిందండీ చలమయ్యా ?" అని వివరించి పద్మమణి లేచింది.

"టైము ఐదున్నర."

చలమయ్యా, శ్రీధర్ కూడా లేచారు.

ఊరి బయటికి షికారుగా నడుస్తూండగా చలమయ్య శ్రీధర్‌తో చెప్పాడు పద్మమణినిగూర్చి. భర్తృ విహీనగా అయిదేళ్ల క్రితం తిరిగి వచ్చింది పద్మమణి. ఇప్పుడు పద్మమణి వున్న యిల్లు రాఘవరావుది. పై భాగం అద్దెకు తీసుకుని అందులో ప్రవేశించింది తల్లితో. సంఘ సంస్కర్త, కాంగ్రెసు వాదీ అయిన నలభై అయిదేళ్ల రాఘవరావు ఆస్తిపరుడు. అతనికి అప్పటికి భార్య పోయి నాలుగేళ్లయింది. సంతానం యిరవై ఏళ్ల కొడుకు ఒక్కడే. అతనికి తర్వాత వివాహం చేశాడు. తన ఆధ్వర్యాన నడుస్తున్న స్కూల్లో ఉద్యోగానికి వచ్చిన పద్మమణి ఉద్యోగ మిచ్చి చేరదీశాడు. వివాహం చేసుకో లేదు. పద్మమణికి ఆడ పిల్ల కలిగింది. ఇప్పుడు మూడేళ్లు దానికి. రెండేళ్ల క్రితం రాఘవరావు పోయినప్పుడు పద్మమణికి ఉద్యోగం పోయింది. ఆరు నెలల దాకా రాఘవరావు వీలునామా వ్రాసి రిజిష్టరు చేసిన సంగతి బయటికి రాలేదు. చివరికి పద్మమణి వుంటున్న యిల్లూ, కొంత పొలమూ, బ్యాంకులో అయిదు వేల రొక్కమూ రాఘవరావు ఆమెపేర వ్రాసిపోయి నట్లు తెలిసింది. రాఘవరావు కొడుకు పేచీ పెట్ట లేదు పద్మమణి ట్రెయినింగ్ పూర్తి చేసుకొన్నది.

"వయస్సును బట్టి చూస్తే ఆ అబ్బాయి కొడుకు కాదను కుంటాను. పద్మకు ఎస్సెస్సెల్సీ తర్వాతే వివాహం అయింది. అంటే యిప్పటికి ఎనిమిదేళ్లు మాత్రమే. వాడికి కనీసం 11, 12 ఏళ్లుంటాయి" అన్నాడు శ్రీధర్.

"ఏమో బహుశా పెళ్లికి పూర్వం పుట్టాడో ఏమో! భర్త పోయిన తర్వాత కూతురు కలిగినట్లు !" అని నవ్వాడు చలమయ్య.

"ఆ విషయం ఆమెనే అడగరాదా? మనకు తెలిసిన వ్యక్తిని గురించి అలా హేళనగా మాట్లాడు కోవటం బాగుండదు" అన్నాడు శ్రీధర్.

"తెలిసిన వ్యక్తి విషయమైతే మాట్లాడ వచ్చునా?"

"అప్పుడూ మాట్లాడ కూడదు, పోనీ మాట్లాడినా అది అంత ఎబ్బెట్టుగా వుండదు. ఆమనిషి పట్ల మనకేమీ బాధ్యత లేదు కాబట్టి స్నేహాన్ని మలినపరచిన ట్లుండదు; లోకాభి రామాయణంగా వుంటుంది.

"ఇది క్రొత్త సిద్ధాంతమే! అసలు పవిత్రత వుంటే కదయ్యా మలిన పరచటం! పద్మమణి నీతిమంతురాలైతే నీ సిద్ధాంతం వర్తిస్తుంది. కథంతా విని కూడా యింకా అలానే అంటావా?

"స్నేహధర్మం వేరు, వివాహానికి సంబంధించిన నీతి వేరు. పోనీ అట్లా చూచినా రాఘవరావుతో ఆమె సంబంధం రెండో వివాహం అనుకో గూడదా?

"అనుకోవటమా?..ఓ..దానికేం? ఎన్నైనా అనుకోవచ్చు. ప్రతి రాత్రీ వేశ్యకు ఒక వివాహం జరుగుతోంది అనుకోగూడదూ? నిత్య కల్యాణం, పచ్చతోరణం" వెటకారంగా నవ్వాడు చలమయ్య.

"ఛీ! ఎక్కడి పోలిక! నువ్వు మాట్లాడుతున్న దేమిటో నీకు తెలీటం లేదు."

"అసలు మతి పోయింది నీకు, నాక్కాదు శ్రీధర్! క్లాస్‌మేట్ అన్న విశ్వాసమా? దాని అందం చూచి గ్రేడ్ తిన్నావా? లేకపోతే ఆవిడ నీతిని గూర్చి నాదగ్గర సమర్ధ నేమిటి?"

శ్రీధర్ మాట్లాడ లేదు. పద్మమణి యిలాంటి మనిషితో ఎట్లా స్నేహంగా వుంటోంది? బహుశా ఆమెకు తెలీదు! అనుకున్నాడు.

కాని అంతటితో ఆ విషయం శ్రీధర్ ఆలోచనల నుంచి నిష్క్రమించ లేదు! చలమయ్య యిచ్చిన తీర్పుకు అర్థం వుంది. ఎందుకు లేదు? స్త్రీకి రెండవ వివాహం యీ దేశం సంప్రదాయం దృష్ట్యా అంగీకార్యము కాదు. సంస్కరణ బాల వితంతువులకు వివాహం అనుమతించింది కాని కాపురం చేసి సంతాన వతులైన యువతులకు ఆపద్ధతి ఎక్కడ సూచించింది.? పోనీ పాశ్చాత్య సంప్రదాయం దృష్ట్యా స్త్రీకి రెండవ వివాహం అంగీకార్యం అనుకున్నా, అసలు వివాహం తంతు జరగక పోవట మనేది పాశ్చాత్య దేశాల్లోనైనా నింద్యమే! పద్మమణి చరిత్ర కళంకితం! ఇది సంఘం తీర్పు! కాని తన మనస్సు యీ తీర్పును అంగీకరించ లేక పోతున్నది. పద్మమణికి కళంకమా?

తనెవ్వరు? పద్మమణి ఎవ్వరు? ఆమె కళంకము మాట అటుంచి తన కర్తవ్యము ధర్మము మాటేమిటి? ఆమె ఆకర్షణలో పడి పోయి ఆమెను తనదానిగా వూహించుకోవటం ఏం గొప్ప నీతి?

శ్రీధర్ తన మనస్సుకి తనే పాఠం చెప్పుకున్నాడు. ఇక్కడేదో బలవత్తరమైన ఆకర్షణ, తన వ్యక్తిత్వ సర్వస్వాన్ని అపహరింప జూచే ఆకర్షణ తగులు తున్నది. దీనికి దూరంగా వుండటమే శ్రేయస్సు!

## 16

పద్మమణి కొడుకు సత్యం ఒక రోజు శ్రీధర్ యింటికి వచ్చాడు. క్రొత్తగా వచ్చిన పంట తాలూకు వడ్లు ఒక నాలుగో అయిదో బస్తాలు పద్మమణికి కావాలట. "మాఅన్నయ్య నడిగి చెబుతాను. అలాగే వీలు చూచి పంపిస్తారని చెప్పు" అన్నాడు శ్రీధర్. "మీకు తీరికగా వుంటే మిమ్మల్ని దయచేసి మాయింటికి ఒక సారి రమ్మని చెప్పమంది మా అమ్మ... యీ సాయంత్రం" అని చెప్పాడు ఆ కుర్రవాడు.

చలమయ్యతో కలసి పద్మమణి యింటికి వెళ్లి అప్పటికి పదిహేను రోజులవుతోంది. పద్మమణిని మళ్లీ చూడాలనీ, ఆమె ఆకర్షణని మరో సారి అనుభవించి పరీక్షించు కోవాలనీ—మొదటి సారి కలిగిన అనుభూతి పూర్వ స్మృతుల వలన కలిగి వుంటుందనీ, అందులో విశేషమేమీ వుండదనీ అతని అభిప్రాయం. ఆమెతో పూర్వపు రోజుల్ని గూర్చి మాట్లాడాలనీ కుతూహలం వున్నా దాన్ని అణచి వేస్తూ వచ్చాడు. పద్మమణి సాన్నిధ్యంలో ఎంత ఆకర్షణా ఆహ్లాదం వుందో అంత అర్థం కాని ప్రమాదం—తన వ్యక్తిత్వాన్ని ఆహరించే ప్రమాదం ఏదో వుందని అతడు లీలగా భయపడుతూ వుండటమే అందుకు కారణం.

కాని పద్మమణి కబురు పెట్టిన తర్వాత వెళ్లకుండా వుండలేక పోయాడు. వెళ్లకుండా వుండటానికి తను పిరికివాడా? పద్మమణిలో ఏమిటా గొప్పదనం? తను భయపడ వలసిన గొప్పదనం?.. ఆమెకు కాదు బహుశా తను నీతికి భయపడు తున్నాడు!..పరీక్ష నెదుర్కోలేని తన 'నీతి'కి ఏమిటి విలువ?.. అది జీవితాన్ని గూర్చి భయపడటమే అవుతుంది!.. ఇంతకూ యిది మామూలు వ్యవహారమే, ఏవో నీడలు చూచి, జడుసు కుంటున్నాడు తప్ప! పద్మ మణికి తన పొలంలో పండిన వడ్లు కావాలి, ఆమె దాని ధర వగైరా వివరాలు అడగటానికే రమ్మని వుంటుంది. ఈ మాత్రం సాయం ఆమె అర్థించడం, ఏనాటిదో ఆపాత స్నేహ భావాన్నీ, కలసి చదువుకున్న జ్ఞాపకాన్నీ పురస్కరించుకునే కథ! ఆ భావాన్ని త్రుంచివేసే ముష్కర ప్రవృత్తి ఎందుకు తనకు? లేని పోని వూహాగానం ఎందుకూ?..

"మీరు మళ్లీ ఎప్పుడైనా వస్తారను కున్నాను... తర్వాత దర్శనమే లేదే! అంత 'బిజీ' గా వున్నారేమిటి?" అన్నది పద్మమణి శ్రీధర్ వెళ్లగానే. అందులో ధ్వనించిన చనువూ, ధీమా శ్రీధర్‌ని కలవర పెట్టాయి; రెచ్చ గొట్టాయి కూడా. చురుగ్గా అన్నాడు :

"ఏమిటి చలమయ్య అనుకున్నా రేమిటి?" అన్నాడు.

పద్మమణి కిలకిలా నవ్వింది.

"ఎందుకు నవ్వు?" అన్నాడు శ్రీధర్.

"మీరు చలమయ్యతో పోల్చుకుని బాధ పడుతున్నారని!"

"అది కాదు చలమయ్యకూ మీకూ బాగా తెలుసు... నాకు పరిచయం యిప్పుడే కదా ప్రారంభం అని అలా అన్నాను"

"ఓ! అయితే మీకు మీ స్కూలు రోజులు బొత్తిగా జ్ఞాపకం లేవన్న మాట!" ఆమె కళ్లు అతని కళ్లని నిల వేశాయి, చూపుల్ని బాణాల్లా హృదయంలో గ్రుచ్చుతున్నట్లు. తన రహస్యాల్ని భేదిస్తున్నట్లు తహ తహలాడి పోయాడు ఒక క్షణం...

మంత్ర ముగ్ధుడిలా "ఉన్నాయి" అన్నాడు.

"ఏ మండీ, నిజం చెప్పండి, మీరు నన్ను మరచి పోయారా. నేను మారా నన్నారు, ఎందులో మారాను? ఎట్లా మారాను? ఎట్లామారానంటారు?.. నాకు తెలుసు కోవాలని వుంది.. మళ్లీ మార లేదన్నారు?"

ఆమె కంఠం లోని ఆ వణుకు, ఆ సాన్నిహిత్యం ఆశక్తి అతని వ్యక్తిత్వం వేసుకున్న పొరల్ని చీల్చి వేస్తున్నాయి.. "లేదు.. మార లేదు.. నువ్వు మార లేదు.. నేను మరచి పోనూ లేదు..." అన్నాడు ఆమె ముఖంలోకి తదేకంగా చూస్తూ దీక్షగా తనలో తనే ఏదో అన్వేషించి గుర్తిస్తున్న ధ్యాసతో, తన్మయత్వంతో...

"కాని నేను మారాను.. అని కూడా అన్నారు!" ఆమె అందించింది.

(సశేషం)